


జిల్లాలో కీలకమైన ఉపాధి హామీ పథకంలో వందల కోట్ల నిధులు పక్కదారి పట్టాయి. డ్వామా సిబ్బంది, వైసీపీ క్షేత్రస్థాయి నేతలు పంచుకుతిన్నారు. వాటిలో కొన్నింటిని సోషల్ ఆడిట్ బృందాలు తమ తనిఖీల్లో గుర్తించాయి. అయితే జిల్లాలో ఉపాధి పనులు పర్యవేక్షించే అధికారి డ్వామా పీడీ. ఆడిట్ బృందాల అభ్యంతరాలపై మండల స్థాయిలో విచారణ జరిగే ప్రజావేదిక సభలో విచారణాధికారిగా పాల్గొన్న పూర్వపు పీడీ శీనారెడ్డి తన చేతివాటం చూపేవారు. అక్కడే ఆడిట్ బృందం అక్రమాలుగా రాసిన మొత్తాన్ని ఇంచుమించు పది శాతానికి తగ్గించడం, ఆపై వ్యక్తిగత విచారణ పేరుతో సిబ్బందిని పిలిచి ఆ కొద్దిమొత్తాలను కూడా తొలగించడం చేశారు. తద్వారా వందల కోట్ల ఉపాధి నిధులు దుర్వినియోగం జరిగినా సిబ్బందిపై నామమాత్రపు చర్యలతో సరిపెట్టారు. రికవరీలు లేకుండా చేసి భారీగా తాను లబ్ధిపొందారన్న చర్చ ఆ శాఖ వర్గాల్లో నేటికీ నడుస్తోంది.

'ఉపాధి'లో అనకొండ





ఒంగోలు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖల్లో ఆ పార్టీతో అంటకాగిన అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అందిన కాడికి వారు, వారికి వత్తాసు పలికేవారు పంచుకుతిన్నారు. అలాంటి ప్రభుత్వ శాఖల్లో జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఒకటి. వైసీపీ పాలనలో నాలుగున్నరేళ్లు ఆ సంస్థ పీడీగా పనిచేసిన శీనారెడ్డి ఇష్టారాజ్యంగా వ్యవహరించాడన్న ఆరోపణలు సర్వత్రా ఉన్నాయి. ప్రభుత్వం మారిన తర్వాత ఆయనపై ఉన్నతాధికారులకు, పాలకపక్ష పెద్దలకు భారీగా ఫిర్యాదులు అందడం, వాటిల్లోకొన్నింటిపై విచారణకు కూడా ఆదేశించడం ఆ ఆరోపణలకు ఊతం ఇస్తోంది. ప్రత్యేకించి ఉపాధి పథకం పారదర్శకంగా సాగేలా కేంద్రప్రభుత్వం చట్టంలో చేసిన సామాజిక తనిఖీలు (సోషల్ ఆడిట్) జిల్లాలో పీడీగా శీనారెడ్డి పనిచేసిన కాలంలో ప్రహసనంలా సాగాయి.

- ప్రహసనంలా సోషల్ ఆడిట్
- వైసీపీ పాలనలో శీనారెడ్డి ఇచ్చిందే తీర్పు
- నాలుగున్నరేళ్లపాటు పీడీగా ఇష్టారాజ్యం
- రూ.300 కోట్లపైనే నిధులు పక్కదారి
- పంచుకుతిన్న సిబ్బంది, నాయకులు
- పరిశీలనల్లో ఆడిట్ బృందాల గుర్తింపు
- ప్రజావేదికల్లో పది శాతానికి పీడీ కోత
- ఆపై వ్యక్తిగత విచారణ అంటూ అవి కూడా రద్దు
- చర్యలు, రికవరీలు శూన్యం
- సిబ్బంది బదిలీలు, నియామకాల్లో అక్రమాలు, వసూళ్లు
- ఉన్నతాధికారులకు భారీగా ఫిర్యాదులు
- కొన్నింటిపైనే విచారణలు

సగానికి సగం నిధులు స్వాహా

జిల్లాలో వైసీపీ పాలనలో 2019-24 వరకు రూ.3,383 కోట్ల మేర ఉపాధి పథకంలో ఖర్చుచేశారు. అందులో కూలీలకు వేతన రూపంలో రూ.2,110 కోట్లు, మెటీరియల్ రూపంలో మరో రూ.1,273 కోట్లు వెచ్చించారు. సాధారణంగా కనీసం 20శాతం నిధులు స్వాహా అన్నది ఆ పథకంలో సర్వసాధారణమే. వైసీపీ పాలనలో అంతకన్నా అధికంగానే మెక్కేశారు. ఒక్క జగనన్న కాలనీల పేరుతో జిల్లాలో ఉపాధి నిధులు రూ.150కోట్ల మేర ఖర్చుచేయగా అందులో సగానికి సగం వైసీపీ నేతలు, డ్వామా సిబ్బంది తిన్నారనేది బహిరంగసత్యం.

పలు మండలాల్లో కూలీలు రాకుండానే వచ్చినట్లు, అసలు గ్రామంలో లేకుండా ఇతర రాష్ట్రాలు, దేశాల్లోనూ ఉండేవారి పేర్లతోనూ మస్టర్లు వేసి పంచుకుతిన్నారు. అలాంటి అక్రమాలను అరికట్టేందుకు ఏడాదికి రెండుసార్లు సోషల్ ఆడిట్ బృందాలు మండలం యూనిట్‌గా తనిఖీలు చేసేవి. గుర్తించిన అక్రమాలపై మండలకేంద్రంలో ప్రజావేదిక నిర్వహించి బాధ్యులపై చర్యలకు సిఫార్సు చేసే వారు. అవకతవకలు, అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించిన సిబ్బందిపై వేటు వేయడంతోపాటు రికవరీకి ఆదేశించేవారు. కొందరిని ఉద్యోగాల నుంచి తొలగించేవారు.

రూ.కోటికి తగ్గించేశారు..

ఐదేళ్ల కాలానికి సంబంధించి ప్రజావేదికల్లో దుర్వినియోగమైనట్లు గుర్తించిన రూ.39.22 కోట్లను వ్యక్తిగత విచారణ అనంతరం రూ.కోటికి పీడీ తగ్గించి వేసినట్లు సమాచారం. వైసీపీ అధికారంలోకి వచ్చిన 2019-20లో రూ.695 కోట్ల మేర ఉపాధి నిధులు వెచ్చించారు. అందులో రూ.50.67 కోట్ల మేర దుర్వినియోగమైనట్లు సోషల్ ఆడిట్ బృందాలు గుర్తించినట్లు సమాచారం. అయితే ప్రజావేదికల్లో ఆ మొత్తాన్ని రూ.7.84 కోట్లకు, వ్యక్తిగత విచారణ సమయంలో రూ.10 లక్షలకు తగ్గించి వేసినట్లు తెలుస్తోంది. ఇలాంటి పరిస్థితే ఏటా కొనసాగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలు ఇతర విషయాల్లో ప్రత్యేకించి వివిధ స్థాయిల్లోని డ్వామా సిబ్బంది బదిలీలు, సస్పెన్షన్ల ఎత్తివేత, పోస్టింగులు, ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాలు తదితర అంశాలలో నాటి పీడీ శీనారెడ్డి అప్పటి అధికార వైసీపీ ప్రభుత్వంలో ఉన్న పలుకుబడితో ఇష్టారాజ్యంగా వ్యవహరించి అక్రమాలకు పాల్పడినట్లు సర్వత్రా చర్చ సాగుతోంది. ఇవే విషయాలపై ప్రస్తుతం కొందరు డ్వామా సిబ్బంది.. అటు గ్రామాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు, ఇటు కలెక్టర్‌తోపాటు ఇతర పాలకపక్ష పెద్దలకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేశారు. తదనుగుణంగా ప్రస్తుతం విచారణలు జరుగుతుండగా మరికొందరు ఇంకొన్ని ఆధారాలతో ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు సోషల్ ఆడిట్ పకడ్బందీగా సాగింది. ఒక్కో మండలంలో రెండు, మూడు రోజులు కూడా

అక్రమార్కులకు వత్తాసు పలికి..

సామాజికవేదిక సభలు సాగేవి. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ విధానం ప్రహసనంలా మారింది. పకడ్బందీగా ప్రక్రియను కొనసాగేలా సహకరించి సిబ్బంది అక్రమాలను నియంత్రించాల్సిన డ్వామా పీడీ హోదాలో ఉన్న శీనారెడ్డే అవినీతికి గేట్లు ఎత్తారన్న ఆరోపణలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో అక్రమాలకు పాల్పడిన వైసీపీ నేతలు, సిబ్బందికి సహకరించేలా బూటకపు ప్రజావేదికలను నడిపాడన్న విమర్శలు అప్పట్లోనే వచ్చాయి. అంతకుముందు ఒక్కో మండలంలో రెండేసి రోజులు ప్రజావేదిక సభలు నిర్వహించాల్సి ఉండగా శీనారెడ్డి హయాంలో రోజుకు రెండేసి మండలాల్లో నిర్వహించి మమ అనిపించేవారు. ఇక వైసీపీ ఐదేళ్ల పాలనలో రూ.3,383 కోట్ల మేర పనులు జరగ్గా కనీసం పదిశాతం వంతున దుర్వినియోగం అనుకున్నా రూ.300 కోట్లపైనే నిధులు పక్కదారి పట్టాయి. అయితే సామాజిక తనిఖీల అనంతరం మండలస్థాయిలో జరిగే ప్రజావేదిక సభల్లో ఐదేళ్లలో కేవలం రూ.39.22 కోట్లు మాత్రమే దుర్వినియోగమైనట్లు పీడీ తేల్చాడు. ఆయన చెప్పిందే తీర్పులాగా ప్రజావేదిక సభలు కొనసాగాయి. ఇక ఆపై ఆ సభల్లో బాధ్యులుగా గుర్తించిన సిబ్బందిని వ్యక్తిగత విచారణ పేరుతో డ్వామా కార్యాలయానికి పిలిచి అక్కడ వారిపై ప్రజావేదిక సభలో నమోదు చేసిన మొత్తాన్ని పదిశాతానికి తగ్గించి వేయడం, చర్యలు లేకుండా తిరిగి కొనసాగించడం జరిగిపోయాయి.




ప్రారంభానికి సిద్ధమైన చీమకుర్తిలోని అన్న క్యాంటీన్

జిల్లాలో ఐదు అన్న క్యాంటీన్లు

రేపే ప్రారంభం

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 13: పేదల ఆకలి తీర్చేందుకు టీడీపీ కూటమి ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రూ.5కే భోజనం 'అన్న'క్యాంటీన్‌లను గురువారం ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించనుంది. తొలుత రాష్ట్రవ్యాప్తంగా 100 ఏర్పాటు చేస్తోంది. వాటిలో జిల్లాకు సంబంధించి ఒంగోలులో నాలుగు, చీమకుర్తిలో ఒకటి ఉన్నాయి. ఇప్పటికే ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సహకారంతో నాలుగు క్యాంటీన్లలో రెండు నెలల నుంచి ఉచితంగా పేదలకు అన్నం పెడుతున్నారు. అయితే ఆగస్టు 15 నుంచి నగరంలోని పాత రిమ్స్, కొత్తపట్నం బస్టాండ్‌లోని రైతుబజారు, కర్నూలు రోడ్‌లోని పవర్ ఆఫీస్ వద్ద, ఊరచెరువులోని దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్ ఆవరణలో క్యాంటీన్‌లు అధికారికంగా తెరుచుకోనున్నాయి. ఎమ్మెల్యే దామచర్ల వీటిని ప్రారంభించనున్నారు. దీంతో మూడు పూటలా పేదలకు ఆకలి తీరనుంది.



బోల్తాపడిన స్కూల్ బస్సు

పొలాల్లో స్కూల్ బస్సు బోల్తా

విద్యార్థులకు తప్పిన ప్రమాదం

పామూరు, ఆగస్టు 13: మండలంలోని తూర్పుకట్టకిందపల్లి వద్ద మంగళవారం స్కూల్ బస్సు అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. విద్యార్థులు క్షేమంగా బయటపడటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. పామూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు కట్టకిందపల్లి నుంచి సుమారుగా 40మంది విద్యార్థులతో బయల్దేరింది. మార్గమధ్యలో అదుపుతప్పి గ్రామ పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. మిగిలిన వారంతా సురక్షితంగా బయటపడ్డారు. ఈ గ్రామానికి రోడ్డు సక్రమంగా లేదు. మట్టిరోడ్డుపై వర్షం కురిసి ఉండటంతో అదుపుతప్పిందని గ్రామస్థులు తెలిపారు.

దొడ్డవరం సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

- రూ.25.92 లక్షలు దుర్వినియోగం
- ఈవోఆర్‌డీకి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు

ఒంగోలు(కలెక్టరేట్)/మద్దిపాడు, ఆగస్టు 13: మద్దిపాడు మండలం దొడ్డవరం గ్రామసర్పంచ్ పునూరి సుబ్బారావు చెక్‌పవర్‌ను పూర్తిస్థాయిలో రద్దుచేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణి మంగళవారం రాత్రి ఉత్తర్వులు ఇచ్చారు. గ్రామంలోని మంచినీటి స్కీంకు సంబంధించిన నిధులను దుర్వినియోగం చేసినట్లు ఫిర్యాదులు రావడంతో డీపీవో విచారణకు ఆదేశించారు. 2021 జూన్ నుంచి 2023 మే వరకు రూ.25,92,650 దుర్వినియోగం చేసినట్లు విచారణలో అధికారులు తేల్చారు. దీనిపై ఇప్పటికే పూర్వ పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేశారు. సర్పంచ్ సుబ్బారావుకు తాత్కాలికంగా చెక్‌పవర్‌ను కొద్దిరోజులపాటు రద్దుచేస్తూ నోటీసులు జారీచేశారు. అయితే ఆ నిధులకు సంబంధించి ఎటువంటి రికార్డులు చూపకపోవడంతో సర్పంచ్ సుబ్బారావు చెక్‌పవర్‌ను పూర్తిస్థాయిలో రద్దుచేస్తూ డీపీవో ఉత్తర్వులు ఇచ్చారు. దొడ్డవరం గ్రామపంచాయతీ బాధ్యతలతోపాటు చెక్‌పవర్‌ను మద్దిపాడు ఈవోఆర్‌డీ రఘుబాబుకు అప్పగించారు.

కేసులొస్తే...కాసులే!

- ఎస్ఈబీ కార్యాలయం అవినీతిమయం
- మద్యం పట్టుకోకుండా సెటిల్మెంట్లు
- బెల్టుషాపులు, హోటళ్ల నుంచి నెలవారీ మామూళ్లు
- ప్రతి కేసుకూ ముక్కుపిండి వసూలు

పుల్లలచెరువు, ఆగస్టు 13 : నియోజవర్గ స్థాయిలో మద్యం అక్రమ అమ్మకాలు, రవాణాను నియంత్రించాల్సిన ఓ అధికారికి కేసులు వస్తే కాసుల వర్షం కురుస్తోంది. ఎర్రగొండపాలెం కేంద్రంగా పనిచేస్తున్న సదరు అధికారి డబ్బులిస్తే కేసులు మాయం చేస్తున్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. నియోజకవర్గంలోని ఎర్రగొండపాలెం, త్రిపురాంతకం, పుల్లలచెరువు మండలాల్లో వేకువజాము నుంచే బ్లాక్‌లో మద్యం జోరుగా దొరుకుతోంది. అయినప్పటికీ సదరు అధికారి పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. మూడు మండలాల్లోని ప్రతి గ్రామంలో 3కిపైగా మొత్తం సుమారు 250 బెల్టుషాపులు ఉన్నాయి. సదరు అధికారి ప్రతి బెల్టుషాపు నుంచి రూ.5వేలు తీసుకొని గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు ఆ శాఖ ఉద్యోగులే గుసగుసలాడుకుంటున్నారు. గ్రామాల్లోని బెల్టుషాపులతోపాటు చిన్నచిన్న హోటల్స్‌లో మద్యం అమ్ముకునేందుకు, ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం రెస్టారెంట్‌లలో సిట్టింగ్‌లకు అవకాశం ఇచ్చి భారీ మొత్తంలో నెలవారీ మామూళ్ల వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఏదైనా మద్యం కేసు వస్తే ముందుగా అధికారి మధ్యవర్తుల ద్వారా బేరం కుదుర్చుకొని వారి నుంచి అందినకాడికి దండుకుంటున్నారు. మామూళ్లు ముట్టజెప్పుకోలేని వారికి మాత్రమే కేసుల వేధింపులు ఉంటున్నాయని గిరిజనులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇరుపార్టీల నుంచి భారీమొత్తంలో వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. మద్యం తీసుకెళ్తూ పట్టుబడిన ఇరుపార్టీల కార్యకర్తల నుంచి రూ.10 వేల నుంచి రూ.15వేలు వసూలు చేసి కేసులు లేకుండా చేశారు. ఎర్రగొండపాలెం పట్టణంలోని వైసీపీ ప్రజాప్రతినిధి ప్రభుత్వ దుకాణాల నుంచి మంచి బ్రాండ్‌ల మద్యం బ్లాక్‌కు తరలిస్తున్నారు. దాన్ని ప్రత్యేక వ్యక్తుల ద్వారా వేకువజాము నుంచి వై పాలెంలోని వినుకొండ రోడ్డు, పుల్లలచెరువు రోడ్డుల్లో జోరుగా విక్రయిస్తున్నారు. ఈ విషయం తెలిసినా సదరు అధికారి మాత్రం కన్నెత్తి కూడా చూడటం లేదు. ఇప్పటికైనా ఉన్నాతాధికారులు దృష్టిసారించి ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో అక్రమ మద్యానికి అడ్డుకట్ట వేసి ఆ అధికారిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఎర్రగొండపాలెంలోని ఎస్ఈబీ కార్యాలయం

స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

- అధికారులకు పలు సూచనలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 13: ఒంగోలులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గురువారం జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను కలెక్టర్ తమీమ్ అన్సారియా పరిశీలించారు. సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీట్ల కేటాయింపుతోపాటు వేడుకలను తిలకించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జెండా ఆవిష్కరణతోపాటు మంత్రి డాక్టర్ స్వామి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించే ఏర్పాట్లపై చర్చించారు. శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటుకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఎస్పీ దామోదర్, జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఏఎస్పీ నాగేశ్వరరావుతోపాటు పలుశాఖల అధికారులు ఉన్నారు.

జూడాల నిరసన



పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతాలో మహిళా వైద్యురాలిని హత్యాచారం చేసిన ఘటనపై ఒంగోలు రిమ్స్‌లోని జూనియర్ డాక్టర్‌లు తీవ్రనిరసన వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

- ఒంగోలు (కార్పొరేషన్)



శివనారాయణ (ఫైల్)

పరాయిదేశానికి వెళ్లి.. ప్రాణాలు వదిలి!

వివరాలు మెయిన్‌లో..

అనారోగ్యానికి గురై యువకుడి మృతి

శోకసంద్రంలో తల్లిదండ్రులు

గుండె గుబిల్లు

- లైన్ ఇన్‌స్పెక్టర్ ఇంటికి రూ.1.20లక్షల కరెంటు బిల్లు
- మూడేళ్లుగా ప్రదక్షిణలు
- అయినా పట్టించుకోని అధికారులు
- విద్యుత్ అదాలత్‌లో గోడువెళ్లబోసుకున్న వెంకటస్వామి
- సమస్య పరిష్కారానికి హామీ ఇవ్వని అధికారులు

కొండపి, ఆగస్టు 13 : విద్యుత్ ఉద్యోగికే ఆశాఖ అధికారులు షాక్ ఇచ్చారు. ఆయన ఇంటికి ఒక నెలలో రూ.1.20లక్షల బిల్లు వేశారు. తాను ఆ ఇంటిలో ఉండటం లేదని, ఎప్పుడో ఒకసారి వచ్చి వెళ్తుంటానని ఆ ఉద్యోగి మొత్తుకున్నా వినిపించుకోకుండా రూ.40వేలు వసూలు చేశారు. విచారించి న్యాయం చేయాలని ఆయన అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా మూడేళ్లుగా పట్టించుకోలేదు. దీంతో మంగళవారం కొండపిలో నిర్వహించిన విద్యుత్ అదాలత్‌కు సింగరాయకొండ మండలం కలికివాయికి చెంది ప్రస్తుతం కె.ఉప్పలపాడులో లైన్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న వెంకటస్వామి హాజరై గోడువెళ్లబోసుకున్నారు. ఆయన కథనం మేరకు... కలికివాయిలో వెంకటస్వామికి సొంత ఇల్లు ఉంది. ఆయన పలు మండలాల్లో ఉద్యోగం చేస్తూ ఎప్పుడో పండుగలకు, పబ్బాలకు సొంత ఊరికి వెళ్తుంటారు. ఒకట్రెండ్రోజులు ఉండి వెళ్లిపోతుంటారు. తాను సొంతూరికి వచ్చినప్పుడు ఇబ్బంది లేకుండా ఉండాలన్న ఉద్దేశంతో దాన్ని బాడుగకు కూడా ఇవ్వలేదు. తన ఇంటికి మినిమం బిల్లు వస్తుండగా అది నెలనెలా చెల్లిస్తున్నాడు. అటువంటి ఇంటికి 2021 ఏప్రిల్‌లో ఒక్కసారిగా 12,600 యూనిట్లు విద్యుత్ వినియోగించినట్లు, అందుకు 1,20,000 చెల్లించాలని విద్యుత్ బిల్లు వచ్చింది. దీంతో విస్తుపోయిన ఆయన తన శాఖలోని సంబంధిత అధికారుల చుట్టూ తిరిగారు. క్షేత్రస్థాయిలో తన ఇంటిని పరిశీలించాలని, పూర్వపు బిల్లులను చూడాలని, చుట్టు పక్కల వారి నుంచి తన ఇంటిలో ఎవరైనా ఉంటారా? లేదా? అన్న విషయమై విచారించాలని అధికారులను అప్పటి నుంచి వెంకటస్వామి వేడుకుంటున్నా పట్టించుకోలేదు. సాంకేతికంగా జరిగిన పొరపాట్లను శాఖ సరిచేసే వరకూ వినియోగదారుడు కొత్త మీటర్‌కు దరఖాస్తు చేసుకుంటే ఇస్తారు. అలాగే వెంకటస్వామి కూడా కొత్త మీటర్ పొందారు. దాన్ని కూడా నాలుగు నెలల్లోనే తొలగించారు.



అధికారుల వద్ద గోడు వెళ్లబోసుకుంటున్న వెంకటస్వామి

రూ.40వేలు వసూలు చేశారు

అప్పటి అధికారులు కేవలం పంతంతో.. వచ్చిన బిల్లు కట్టాల్సిందేనని తనను వెంటాడారని వెంకటస్వామి అదాలత్‌లో వాపోయారు. రీడింగ్‌లో తప్పు వల్ల జరిగిన దానికి తనకు వచ్చిన 1,20,000 లక్షల బిల్లులో రూ.40 వేలు వసూలు చేశారని అధికారుల దృష్టికి తెచ్చారు. ఇప్పటికైనా తనకు వన్‌టైం సెటిల్మెంట్‌గా కొంత తగ్గించి చెబితే బిల్లు కట్టేస్తానని, తన ఇంటికి విద్యుత్ కనెక్షన్‌ను పునరుద్ధరించాలని ఆయన కోరారు. అయితే అధికారులు వెంకటస్వామి చెప్పిన విషయాలు విని తలలు ఊపి వెళ్లిపోయారు. ఆయనకు ఎలాంటి హామీ ఇవ్వలేదు. సామాన్య ప్రజలకు న్యాయం చేస్తున్న అధికారులు తనను విద్యుత్ వినియోగదారుడిగానైనా గుర్తించి న్యాయం చేయాలని వెంకటస్వామి కోరారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం : ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు(క్రైం), ఆగస్టు 13 : జిల్లా అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ ఏఆర్.దామోదర్ ఆదేశించారు. మంగళవారం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయిని జిల్లాలో సమూలంగా నిర్మూలించాలన్నారు. గంజాయి విక్రయాలు, సరఫరా చేస్తున్న వారితో పాటు సేవించే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని చెప్పారు. అక్రమ మద్యం, నాటుసారా, పేకాట వంటి కార్యకలాపాలను పూర్తి నివారించాలని ఆదేశించారు. జిల్లా సరిహద్దులలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిత్యం తనిఖీలు చేయాలని కోరారు. సమావేశంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఈఎస్ రవికుమార్, ఏఈఎస్ ప్రసాద్, సీఐలు పాల్గొన్నారు.

స్కూలు బస్సులకు ఫిట్‌నెస్ లేకుంటే సీజ్

డీటీసీ సుశీల ● తనిఖీలు చేపట్టిన రవాణాశాఖ


తనిఖీలు చేపడుతున్న ఎంవీఐలు

ఒంగోలు(క్రైం), ఆగస్టు 13: స్కూలు బస్సులకు ఫిట్‌నెస్ లేకుంటే సీజ్ చేస్తామని రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల హెచ్చరించారు. మంగళవారం జిల్లాలో పలు ప్రాంతాలలో స్కూలు బస్సులను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బస్సు డ్రైవర్లు యూనిఫాం ధరించకుండా వాహనచోదన చేయడం, పరిమితికి మించి బస్సుల్లో పిల్లలను ఎక్కించడం గుర్తించినట్లు ఆమె తెలిపారు. ఇలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. అదేవిధంగా ఇంకా ఫిట్‌నెస్ చేయించుకోకుండా ఉన్న బస్సుల యజమానులకు నోటీసులు జారీ చేస్తామని చెప్పారు. డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. తనిఖీలలో ఎంవీఐలు కిరణ్‌ప్రభాకర్, కె.రామచంద్రరావు, ఎల్.సురేంద్రప్రసాద్, కె.జయప్రకాష్ పాల్గొన్నారు.

నేడు హిందూ ఐక్యతార్యాలీ


మాట్లాడుతున్న సోమా సుబ్బారావు

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 13: బంగ్లాదేశ్‌లో మైనారిటీలు అయిన హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బుధవారం హిందూ ఐక్యతా ర్యాలీ నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ ప్రాంత సత్సంగ ప్రముఖ్ సోమా సుబ్బారావు తెలిపారు. మంగళవారం ఒంగోలులోని పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పలు హిందూ సంఘాల ప్రతినిధులు, స్వామీజీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ బుధవారం సాయంత్రం 4.30కు స్థానిక అంజయ్యరోడ్ ఆంధ్రకేసరి కాలేజీ దగ్గర నుంచి లంబాడీడొంక, పవర్‌ఆఫీస్, కర్నూల్ రోడ్డు, ఆర్టీసీ డిపో, అద్దంకి బస్టాండ్, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ వరకు ఈ ర్యాలీ జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని హిందూ ఐక్యతను చాటాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు తూనుగుంట మల్లిఖార్జునరావు, కార్యదర్శి ఇనమనమెళ్లూరి సీతారామయ్య, సహకార్యదర్శి ఈమని బలరాం, ఉపాధ్యక్షులు జిల్లెళ్లమూడి వెంకటేశ్వర్లు, గడ్డం శ్రీనివాసులు, భైరవానందస్వామి, పుట్ట స్వామి, పెరుమాళ్ల తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికులకు స్వేచ్ఛ కల్పించాలి : కలెక్టర్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ తదితరులు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 13: బాల కార్మికులకు పని నుంచి స్వేచ్ఛ కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలతో కార్మికశాఖ ప్రచురించిన పోస్టర్లను మంగళవారం కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల కార్మిక నిర్మూలనకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, జిల్లా ఉప కార్మిక కమిషనర్ ఎ.గాయత్రిదేవి, సార్ఢ్ జనరల్ సెక్రటరీ ఆర్.సునీల్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ప్రభుత్వశాఖల్లో పనిచేసే మహిళా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం ప్రతినిధులు కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం కలెక్టర్ తమీమ్ అన్సారియాను వారు మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల సమస్యలను తెలుసుకునేందుకు ప్రభుత్వ కార్యాలయాల్లో ఒక షీ బాక్సును ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో సంఘం చైర్‌పర్సన్ ఎస్.జయలక్ష్మి, సెక్రటరీ సీహెచ్.శ్రీదేవి, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు ఊతకోలు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు చీమకుర్తిలో అన్నక్యాంటీన్ ప్రారంభం

చీమకుర్తి, ఆస్టు 13 : చీమకుర్తి పట్టణంలోని నూతన మున్సిపల్ కార్యాలయం పక్కన అన్నక్యాంటీన్ ప్రారంభోత్సవానికి సంసిద్ధమైంది. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు ఇదే స్థలంలో అన్నక్యాంటీన్ విజయవంతంగా నిర్వహించారు. అయితే తరువాత జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నక్యాంటీన్‌ను మూసివేశారు. తరువాత దీనిని వార్డు సచివాలయంగా మార్చి వేశారు. మళ్లీ టీడీపీ కూటమి అధికారంలోకి రావటంతో అన్నక్యాంటీన్‌లను తిరిగి స్వాతంత్ర్య దినోత్సవం రోజున వంద అన్న క్యాంటీన్‌లను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా చీమకుర్తి పట్టణంలో గురువారం నుంచి అన్నక్యాంటీన్ సేవలను ప్రజలకు అందించటానికి సిద్ధం చేసినట్లు మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఈశ్వరరాజు పేర్కొన్నారు.

ఉత్సాహంగా ఇండియన్ మ్యూజిక్ సెలబ్రేషన్స్

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ఒంగోలు క్రిస్టియన్ ముజిషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మ్యూజిక్ సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ఒంగోలు టౌన్ డినామినేషన్ చర్చస్ సహకారంతో స్థానిక క్లౌపేటలోని క్లౌ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన సంగీత విభావరిలో జువెట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి పాస్టర్ డి.జాన్‌ఆగస్టీన్ వాక్యోపదేశం చేశారు. టి.పవిత్రన్ అధ్యక్షత వహించారు. హైదరాబాద్‌కు చెందిన క్రిష్టాఫర్, బెంగళూరుకు చెందిన ప్రకాష్ రెక్స్, చెన్నైకి చెందిన సురేష్ పలు క్రైస్తవ గీతాలను ఆలపించారు.

మెరుగైన విద్యను అందించాలి : ఎంఈవో

మద్దిపాడు, ఆగస్టు 13: విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేలా ఉపాధ్యాయులు విధులు నిర్వహించాలని ఎంఈవో ఆంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం ఇనమనమెళ్లూరు దళితవాడ మండల పరిషత్ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో మెనూ పాటించాలని సూచించారు. విద్యార్థి అభ్యసన విలువలను పెంచేవిధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మెడబలిమి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి యోగా శిక్షణకు ప్రవేశాలు

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 13: యోగా టీచర్స్ ట్రైనింగ్ ప్రవేశాలు ఈ నెల 15వ తేదీ నుంచి జరుగుతాయని పతంజలి యోగ రాష్ట్ర అధ్యక్షుడు గంధవళ్ల బాలసుబ్రహ్మణ్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగాలో అనుభవం ఉండి సర్టిఫికెట్ లేని వారు, బీఈడీ, బీపీఈడీ, టీటీసీ చేసిన వారికి, కనీస విద్యార్హత ఉన్న ఇతర టీచర్లకు ఇది మంచి అవకాశమన్నారు. దీనికోసం జిల్లాలోని అన్ని మండలాల నిరుద్యోగులు రిజిస్టర్ చేసుకోవచ్చని, ఇందులో శిక్షణ పొందినవారికి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. 120 గంటలపాటు శిక్షణ నిర్వహిస్తారని, మరిన్ని వివరాలకు 9885125053, 7780680121 సెల్ నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

నిబంధనలు పాటించని విద్యాసంస్థల బస్సులపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 13 : జిల్లాలో నిబంధనలు పాటించని విద్యాసంస్థల బస్సులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.వినోద్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిబంధనలు పాటించకుండా బడిబస్సులు ఇష్టారీతిగా తిరుగుతున్నాయని ఆరోపించారు. గతంలో ప్రమాదాలు జరిగిన ఘటనలు కూడా ఉన్నాయన్నారు. అందువల్ల ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని నిబంధనలు పాటించని విద్యాసంస్థల బస్సులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలు

● ఎమ్మెల్యే దామచర్ల


అధికారులు, నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 13 : ఒంగోలు, కొత్తపట్నం మండల పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, అలాగే అవసరమైన పనుల నివేదికను తనకు అందించాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కోరారు. మంగళవారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో అధికారులు, పార్టీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల వారితో మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి లింక్ రోడ్లు, కల్వర్టులు, డ్రైన్‌లు, రహదారులు, ఇతరత్రా అభివృద్ధి పనుల చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు సమస్య లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. అవసరమైన నిధులు రాబట్టే దిశగా తాను దృష్టిస్తానని తెలిపారు. సమావేశంలో నాయకులు పోవలవరపు వెంకట్రామయ్య, నల్లమోతు గంగాధర్, నరసింహారావు, పూర్ల, కొత్తపట్నం నుంచి ద్వారాపాకుల శ్రీనివాసరెడ్డి, రామచంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రవాణాపై నిఘా ఏర్పాటు చేయాలి

● కలెక్టర్ అన్సారియా ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా, పక్కన ఎస్పీ దామోదర్

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 13: జిల్లాలో మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలు రవాణా చేయకుండా గట్టి నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, డ్రగ్స్ వంటివి సాగు, రవాణా చేయకుండా చూడాలన్నారు. మాదకద్రవ్యాలు ఉపయోగించకుండా పాఠశాలు, కళాశాలలు, హాస్టళ్లలో అవగాహన సదస్సులను విస్తృతంగా ఏర్పాటు చేయాలని చెప్పారు. చెక్‌పోస్టుల వద్ద, జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో మాదకద్రవ్యాలపై ఎప్పటికప్పుడు నిఘా పెంచాలని సూచించారు. అవి ఎక్కడి నుంచి రవాణా జరిగే అవకాశం ఉందో పరిశీలించి ముఖ్యమైన బ్లాక్‌స్పాట్లను గుర్తించాలన్నారు. జిల్లాలో ఎక్కడా గంజాయి సాగు చేసేందుకు వీలు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గిద్దలూరు, యర్రగొండపాలెం తదితర మారుమూల ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండటంతో పాటు జిల్లాలో పలుచోట్ల పోస్టర్లను, ఐఈసీ మెటీరియల్‌ను ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. మెడికల్ షాపులో ఎక్కువగా మత్తు సంబంధిత మెడిసిన్స్ అమ్మకాలు జరుగుతున్నాయో డ్రగ్స్ కంట్రోల్ అధికారులు నిఘా ఉంచాలన్నారు అనంతరం ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, డ్రగ్స్ వినియోగం లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గంజాయి, డ్రగ్స్, అక్రమ మద్యం, నాటుసారా అమ్మకాలు, రవాణాపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ద్వారా తనిఖీలు నిర్వహిస్తున్నామని, డ్రగ్స్ పంపిణీ చేసే పెడ్లర్స్‌ను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పోలీస్, విద్య, మెడికల్, రెవెన్యూ అధికారులతో ప్రత్యేక బృందంగా ఏర్పాటు చేసి విద్యాలయాల్లో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్ర మాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో మైనింగ్ పనుల కోసం ఇతర ప్రాంతాల నుంచి కూలీలు ఇక్కడకు వస్తుంటారని, సంబంధిత పరిశ్రమల యాజమాన్యం వారిని సమన్వయం చేసుకొని కూలీలపై నిఘా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో గత నెలలో నాలుగు గంజాయి రవాణా కేసులను నమోదు చేసి 19 మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు. అలాగే 43.4 కేజీల గంజాయిని సీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఆగస్టు నెలలో ఒక కేసు నమోదు చేసి ఐదుగురిని అరెస్టు చేయడంతో పాటు ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్వో విశ్వేశ్వరరావు, డీటీసీ సుశీల, ఆర్డీవో సుబ్బారెడ్డి, వివిధశాఖల అధికారులు సురేష్‌కుమార్, శ్రీనివాస్, జగన్నాథరావు, లక్ష్మానాయక్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా వేడుకలు


ఒంగోలులో జాతీయజెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు


ఉప్పుగుండూరులో ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నాయకులు

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 13: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ (హర్ ఘర్ తిరంగా) వేడుకలు మంగళవారం ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా స్థానిక పీవీఆర్ ఉన్నత బాలికల పాఠశాల విద్యార్థులు జాతీయ జెండా ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే దేశభక్తిని అలవర్చుకోవాలన్నారు. ఉపగ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి మాట్లాడుతూ భరత జాతి ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలలో చాటిచెప్పేది మన జాతీయ జెండా అని, దానిపట్ల ప్రతి ఒక్కరూ గౌరవం కలిగి ఉండాలని చెప్పారు. అదేవిధంగా గ్రంథాయంలో ఉన్న పుస్తకాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కె.సంపూర్ణమ్మ, డి.సందీప్, నున్నా ఆంజనేయులు, ఐనంపూడి నరసింహం, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య పాల్గొన్నారు.

ఉప్పుగుండూరు గ్రామంలో..

నాగులుప్పలపాడు: స్వాతంత్రదినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాని నరేంద్రమోడీ ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన హర్‌ఘర్ తిరంగా ర్యాలీ ఉప్పుగుండూరు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ బాపట్ల పార్లమెంట్ యువ మోర్చా ప్రధాన కార్యదర్శి లచ్చంశెట్టి టేగ్రా ఆధ్వర్యంలో సర్వస్వతి హైస్కూల్, ఆక్స్‌ఫర్డ్ స్కూల్, జత్వ హైస్కూల్, జూనియర్ కాళాశాల విద్యార్థులతో మంగళవారం జాతీయ జెండాతో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లచ్చంశెట్టి టేగ్రా మాట్లాడుతూ ప్రతి పౌరుడిలో దేశభక్తి ఉండాలన్నారు. స్వాతంత్రం కోసం ప్రాణాలు విడచిన మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ప్రధాని మోదీ దేశ ప్రజల ప్రయోజనాలకు కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు సభ్యులు పొద వరప్రసాద్, బీజేపీ మండల అధ్యక్షులు పెంట్యాల సుబ్బారావు, సర్పంచ్ జయమ్మ, టీడీపీ నాయకుడు కాట్రగడ్డ చంద్రబాబు, జనసేన పార్టీ అధ్యక్షులు బాలిశెట్టి నాగేశ్వరరావు, పెంట్యాల శ్రీనివాసరావు, ఇమ్మిశెట్టి నరేంద్ర, చెంచురెడ్డి కళ్యాణ్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

వైద్యురాలిని హత్యాచారం చేసిన నిందితుడిని శిక్షించాలి

● జూనియర్ డాక్టర్ల డిమాండ్

● ఒంగోలులో కొవ్వొత్తులతో నిరసన



కొవ్వొత్తులు వెలిగించి నిరసన ప్రదర్శన చేస్తున్న జూనియర్ డాక్టర్లు

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 13: పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కత్తాలో మహిళా వైద్యురాలిని అత్యాచారం చేసి, దారుణంగా హతమార్చిన ఘటనపై జూనియర్ డాక్టర్లు ధ్వజమెత్తారు. ఈ మేరకు మంగళవారం ఒంగోలు నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్లు మాట్లాడుతూ పేదల ప్రాణాలు కాపాడేందుకు వైద్యులు సేవ చేస్తుంటే దేశంలో వైద్యులపైన దాడులు తీవ్రం అయ్యాయని ఆరోపించారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించి, వైద్య రంగం రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తేవాలని, మహిళా వైద్యురాలిని హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలో నిరసన ర్యాలీ చేపట్టనున్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్): కోల్‌కత్తాలోని ఆర్‌జీఆర్ ప్రభుత్వ మెడికల్‌కాలేజీలో పీజీ రెండో సంవత్సరం చదువుతున్న వైద్య విద్యార్థినిని అత్యంత దారుణంగా హింసించి, అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని స్త్రీ విముక్తి సంఘటనా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.లక్ష్మి, డాక్టర్ సి.విజయ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.లలితకుమారి, జిల్లా కార్యదర్శి పి.శాంతకుమారి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 36 గంటల పాటు డ్యూటీ చేసి విశ్రాంతి కోసం వెళ్ళిన ఆమెపై హాస్పటల్ ఆవరణలోని సెమినార్ హాల్‌లో ఈ ఘోరమైన దురాగాతానికి పాల్పడటం దారుణంగా ఉందన్నారు. ఇటువంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.


ఉలిచిలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన కాలువను చదును చేసిన ఆక్రమణదారులు

గుండ్లకమ్మ కాలువ గట్టు

పూడ్చి ఆక్రమించేస్తున్నారు..!

● పట్టించుకోని అధికారులు

ఒంగోలు మండలం ఉలిచి గ్రామంలో గుండ్లకమ్మ ప్రాజెక్టు రిజర్వాయర్ కాలువ గట్టును చదును చేసి, ఆర్‌అండ్‌బీ సైడు కాలు ను పూడ్చివేసి కొందరు ఆక్రమణకు సిద్ధ మయ్యారు. గత వారం పది రోజులుగా ఈ రోడ్డుమార్గంలో ఆక్రమణల పర్వం కొనసాగుతుండగా, అధికారులు కనీసం కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తున్నది. ఇదే విషయాన్ని పలువురు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ఎలాంటి స్పందన లేకపోవడంపై సమీప గ్రామ ప్రజలు తప్పు పడుతున్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ పైపులైను ద్వారా ఆ యా గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుందని, అయితే పైపులైను పూడ్చి చదును చేయడం ద్వారా తదనంతరం కట్టడాలు నిర్మించే అవకాశం ఉందని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీంతో భవిష్యత్‌లో తాగునీటి పైపులైను మరమ్మతు పనులకు ఆటంకాలు ఎదురు అవడమే కాకుండా, ప్రజల తాగునీటి సరఫరాకు ఇబ్బందులు వస్తాయని వెల్లడిస్తున్నారు. ఇప్పటికైనా ఉలిచిలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన జరుగుతున్న ఆక్రమణలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

- ఒంగోలు (కార్పొరేషన్)

అవీ..ఇవీ..

ఫోన్‌పే ద్వారా విద్యుత్ బిల్లులు : ఎస్ఈ

ఒంగోలు(క్రైం), ఆగస్టు 13: విద్యుత్ బిల్లులు ఫోన్‌పే ద్వారా చెల్లించవచ్చని ఆ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కేవీజీసత్యనారయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఇతర అప్లికేషన్ల ద్వారా కూడా కరెంటు బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకున్నామని, వినియోగదారులకు మెరుగైయని సేవలు అందిచేందుకు ఏపీసీపీడీసీఎల్ ముందు ఉంటుదని ఆయన పేర్కొన్నారు.

రాపర్ల రోడ్డు నిర్మాణానికి చర్యలు

● పంచాయతీరాజ్‌శాఖ వివరణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నాగులుప్పలపాడు, ఆగస్టు 13: మండలంలోని అమ్మనబ్రోలు-నాగులుప్పలపాడు ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి రాపర్ల రైల్వేస్టేషన్ వరకు పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని దెబ్బతిన్న రోడ్డును త్వరలోనే నిర్మిస్తామని పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12న ఆంధ్రజ్యోతి దినపత్రికలో రాపర్ల రోడ్డుకు మోక్షమెప్పుడో అనే కథనం ప్రచురితం అయ్యింది. దీనిపై సంబంధిత అధికారులు స్పందించారు. ఏఎంసీ, ఎస్‌డీఆర్ఎఫ్ నిధులతో త్వరలోనే టెండర్లు పిలిచి రాపర్ల రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేస్తామని వివరించారు.

ఉద్యోగోన్నతుల తర్వాతే సర్దుబాటు చేయాలి : ఏపీటీఎఫ్

ఒంగోలు(విద్య), ఆగస్టు 13 : ప్రాథమికవిద్యను అతలాకుతలం చేసిన 117 జీవోను రద్దు చేసి 53 జీవో ప్రకారం టీచర్లకు ఉద్యోగోన్నతులు ఇచ్చిన తర్వాతే సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.వెంకట్రావు, బి.అశోక్‌కుమార్, ఐఫియా కౌన్సిలర్ బీవీ.సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయ సంఘాలతో విద్యాశాఖ మంత్రి సమావేశం నిర్వహించి 117జీవోను రద్దు చేసి 3,4,5 తరగతులను ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయాలన్నారు. 53 జీవో ప్రకారం పని సర్దుబాటు చేయాలని, ఫ్యాప్టో ప్రతిపాదిత డిమాండ్లను పరిష్కరించిన తర్వాతే పని సర్దుబాటు చేపట్టాలని కోరారు.

పీవీఆర్ పాఠశాల ఆకస్మిక తనిఖీ


సూచనలు ఇస్తున్న ఇన్‌చార్జి డీఈవో

ఒంగోలు(విద్య), ఆగస్టు 13 : ఒంగోలులోని పీవీఆర్ బాలికోన్నత పాఠశాలను మంగళవారం ఇన్‌చార్జి డీఈవో సుబ్బారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే భోజనం రుచి చేశారు. స్కూలులో 328మంది విద్యార్థినులు చదువుతుంటే కేవలం 200మంది మా త్రమే మధ్యాహ్న భోజనం చేయడం పట్ల అసంతృప్తి వ్యక్తంచేశారు. పిల్లలు అం దరూ స్కూలులో భోజనం చేసేలా చూడాలని హెచ్ఎంను ఆదేశించారు.

నేడు ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశం

ఒంగోలు(విద్య), ఆగస్టు 13 : ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశం బుధవారం పాఠశాల విద్యా డైరెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఉదయం పదిన్నర గంటలకు ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు. ఉపాధ్యాయుల పని సర్దుబాటు నేపథ్యంలో సమావేశంలో ఏర్పాటు చేయాలని సంఘ నాయకులు కోరుతున్నందున కమిషనర్ ఈ మేరకు చర్యలు తీసుకున్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ


మొక్కలను నాటుతున్న అతిథులు

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 13: హరిత ప్రకాశం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యానశాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. మంగళవారం ఒంగోలులోని పాత రిమ్స్ ఆవరణంలో ఉద్యానశాఖ అధికారి గోపీచంద్ హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిలో వృక్ష సంపదను పెంచడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధికల్పనాధికారి టి.భరద్వాజ, సైనిక సంక్షేమ అధికారి వి.సుభాషిణి, ప్రోగ్రామ్ మేనేజరు రవితేజ, గంగరాజు నాగేశ్వరరావు, ఎస్ఎం.బాషా తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెస్ చాంపియన్‌షిప్ విజేతలు

ఒంగోలు(విద్య), ఆగస్టు 13: జిల్లాస్థాయి అండర్-13 చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఒంగోలు నగరం భాగ్యనగర్ నాల్గవలైనులోని దాసరి మిను చెస్‌హౌస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో బాలుర విభాగంలో సాయితనీష్ కందుల, షేక్ నాయబ్‌మన్సూర్ ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. బాలికల విభాగంలో ఎ.వెంకట మేఘనరెడ్డి, సీహెచ్.మోహనప్రియలు ప్రథమ,ద్వితీయ స్థానాల్లో నిలిచారని చెస్ అసోసియేషన్ సెక్రటరీ ఎస్కే.అబుల్‌నబీ తెలిపారు. ఆర్బిటర్‌గా బి.సుశాంత్ వ్యవహరించారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన


మాట్లాడుతున్న విజయభాస్కర్‌రెడ్డి

ఒంగోలు(విద్య), ఆగస్టు 13 : వైద్యరంగానికి, ఫార్మసీలో రానున్నరోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ ప్రయోజనకరంగా ఉపయోగపడుతుందని ఐపీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు పి.విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఒంగోలులోని క్విస్ ఫార్మసీ కళాశాలలో మంగళవారం జరిగిన ఫార్మసీ ప్రాక్టీసులో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ పాత్రపై నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. ఇండియన్ ఫార్మసీ గ్రేడియేట్ అసోసియేషన్, క్లీన్‌షాక్స్ ఇంటర్నేషనల్‌ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఫార్మసీ ప్రాక్టీసులో ఆర్టిఫిషియల్‌ఇంటెలిజెన్సీతో అనుసంధానం చేస్తూ కొన్ని విషయాలను విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ మేదరమెట్ల కిషోర్‌బాబు రోగి ఆధారిత వైద్యవిధానాన్ని సరైన నిర్వహణలో తేవడానికి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ ఉపయోగపడుతుందన్నారు కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నిడమానూరి సూర్యకళ్యాణచక్రవర్తి, వైస్‌చైర్మన్ ఎన్.గాయత్రి, ఐపీజీఏ రాష్ట్ర కో ఆర్డినేటర్ రేవతి పాల్గొన్నారు.

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 13: ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి, రెండు రోజుల పాటు జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. బుధవారం సాయంత్రం ఐదుగంటలకు స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. అనంతరం నగరంలో జరిగే పలు కార్యక్రమాలకు ఆయన హాజరవుతారు. గురువారం ఒంగోలులో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో ఎంపీ మాగుంట పాల్గొంటారు.

పేస్‌లో వర్క్‌షాపు


వెంకటరమణను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు(విద్య), ఆగస్టు 13: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న సీఎస్ఈ, సివిల్, ఈసీఈ విద్యార్థులకు మంగళవారం డిజైన్ థింకింగ్ అండ్ ప్రాబ్లమ్‌సాల్వింగ్‌పై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎల్ యూనివర్శిటీకి చెందిన డాక్టర్ జె.వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులకు కొత్తగా ఆలోచించడం, ఆలోచనా విధానలో మార్పు వంటి విషయాలను వివరించారు. కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ ఇలాంటి వర్క్‌షాపు ద్వారా విద్యార్థుల ఆలోచన శక్తి మారుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, ఎంబీఏ విభాగాధిపతి మేరీజోన్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.స్మిత తదితరులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టు తయారీపై అవగాహన


చెత్త సంపద కేంద్రం వద్ద సర్పంచ్‌లు, అధికారులు

చీమకుర్తి, ఆగస్టు 13 : వర్మీ కంపోస్టు తయారీ, మార్కెటింగ్‌పై సర్పంచ్‌లకు, కార్యదర్శులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. శిక్షణలో భాగంగా రెండోరోజు మండలంలోని పి.నాయుడుపాలెం వద్ద ఉన్న చెత్తసంపదకేంద్రాన్ని సర్పంచ్‌లు, కార్యదర్శులు, అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాఘవేంద్ర, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలను అరికట్టాలి

● కలెక్టర్ అన్సారియా ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా, పక్కన ఎస్పీ దామోదర్, ఏఎస్పీ నాగేశ్వరరావు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 13 : జిల్లాలో ఇసుక, మట్టి అక్రమతవ్వకాలు, రవాణాను పూర్తిగా అరికట్టేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఇసుక, మట్టి, అక్రమ తవ్వకాలు, రవాణాను పూర్తిగా నిరోధించడంతో పాటు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఇసుక రీచ్‌లను సంబంధిత అధికారులు తరచుగా పరిశీలించాలని, ప్రభుత్వ పాలసీకి అనుగుణంగా ఇసుక సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇసుక రవాణాకు సంబంధించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సహజ వనరులను సంరక్షించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. గ్రామ స్థాయిలో వీఆర్వో వీఆర్ఏలు, గ్రామ కార్యదర్శి, మహిళా పోలీస్ ఉంటారని, వారి సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలని మైనింగ్ అధికారులను ఆదేశించారు. డివిజన్, మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని చెప్పారు. అనంతరం ఎస్పీ దామోదర్ మాట్లాడతూ ఇసుక అక్రమ రవాణాకు ఏమాత్రం అవకాశం లేకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇసుక రీచ్‌ల వద్ద సీసీకెమెరాల ద్వారా నిఘా అమలు చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా, ఏఎస్పీ నాగేశ్వరరావు, ఆర్డీవో సుబ్బారెడ్డి, మైనింగ్ డీడీ జగన్నాథరావు, డీటీసీ సుశీల, అధికారులు పేరయ్య, ఉషారాణి, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఒకేచోట రెండు ప్రమాదాలు



నుజ్జునుజ్జయిన కారు



ప్రమాదంలో బోల్తాపడ్డ టెంపో



ప్రమాదం చోటుచేసుకున్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

హైవేపై కొద్ది నిమిషాల వ్యవధిలో సిమెంట్ దిమ్మెలను ఢీకొన్న కారు, మినీ వ్యాన్

ఇద్దరికి తీవ్ర, ఎనిమిది మందికి స్వల్ప గాయాలు

నవ దంపతులకు తప్పిన ప్రమాదం

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ దామోదర్

సింగరాయకొండ, జూలై 13 : జాతీయ రహదారిలోని ఎమర్జెన్సీ ల్యాండింగ్‌పై ఉంచిన సిమెంటు దిమ్మెలను కారు ఢీకొట్టింది. ఆ దిమ్మెలను పోలీసులు సరిచేస్తుండగా పెళ్లి బృందంతో వస్తున్న మినీ వ్యాన్ ఢీకొని బోల్తా పడింది. దీంతో మినీ వ్యాన్‌లో ఉన్న ఇద్దరికి తీవ్ర, ఎనిమిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. అందులో ఉన్న నవదంపతులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి 2.30 గంటలప్రాంతంలో సింగరాయకొండ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురంనకు చెందిన ఓ కుటుంబం తిరుపతి వెళ్లి దైవదర్శనం అనంతరం స్వగ్రామానికి బయల్దేరింది. వారు ప్రయాణిస్తున్న కారు సింగరాయకొండ జాతీయ రహదారి వద్దకు వచ్చే సరికి డ్రైవర్ కునుకు తీయడంతో అదుపుతప్పి రన్‌వే మధ్యలో ఉంచిన సిమెంటు దిమ్మెలను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. అందులో ఉన్న ఐదుగురు సురక్షితంగా బయటపడ్డారు. హైవే మొబైల్ సిబ్బంది, పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు ప్రమాదాన్ని గుర్తించి వెంటనే రోడ్డు మధ్యలోకి వచ్చిన సిమెంట్ దిమ్మెను పక్కకు తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. ఆసమయంలో తిరుమల నుంచి పెళ్లి బృందంతో వస్తున్న మినీ వ్యాన్ అదే సిమెంటు దిమ్మెను ఢీకొట్టి రోడ్డుపై తిరగబడింది. అందులో మొత్తం 12 మంది ఉన్నారు. వారంతా కొండపి మండలం పెరిదేపి గ్రామానికి చెందిన వారు. వారిలో నవవరుడు పుట్టా చైతన్య, నవ వధువుతో పాటు రాయపాటి బాపయ్య, శోభారాణి, రాయపాటి శ్రీకాంత్, లక్ష్మీప్రియ, మహేంద్ర, డ్రైవర్ వెంకారెడ్డికి స్వల్పగాయాలయ్యాయి. బ్రహ్మయ్య, మహీధర్‌సాయి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే పోలీసులు హైవే అంబులెన్స్, 108లో క్షతగాత్రులను ఒంగోలు రిమ్స్‌కి తరలించారు. అక్కడి నుంచి తీవ్ర గాయాలైన ఇరువురిని ప్రైవేట్ ఆసుపత్రులకు తీసుకెళ్లారు.

ఉలిక్కిపడిన పోలీసులు

రోడ్డు మధ్యలో అడ్డుగా ఉన్న సిమెంట్ దిమ్మెను నలుగురు పోలీసు సిబ్బంది తొలగించే క్రమంలో ఆకస్మాత్తుగా వారిపైకి టెంపో దూసుకురావడంతో ఉలిక్కిపడ్డారు. అప్రమత్తమై పక్కకు తప్పుకొన్నారు. పెనుప్రమాదం నుంచి బయటపడి ఊపిరిపీల్చుకున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్పీ దామోదర్ మంగళవారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రమాదానికిగల కారణాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రమాదాలు జరిగే ప్రదేశాలను డేంజర్ స్పాట్‌లుగా గుర్తిస్తామన్నారు. అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్పీ వెంట సీఐ చావా హజరత్తయ్య, ఎస్సై టి.శ్రీరాం, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సమస్యల సత్వర పరిష్కారం కోసమే విద్యుత్ అదాలత్‌లు

సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్‌ఇమ్మానియేలు



అర్జీ తీసుకుంటున్న చైర్మన్ విక్టర్ ఇమ్మానియేలు, అధికారులు

కొండపి, ఆగస్టు 13 : వినియోగదారుల పెండింగ్ సమస్యల సత్వర పరిష్కారం కోసమే విద్యుత్ అదాలత్‌లు నిర్వహిస్తున్నామని కన్స్యూమర్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ ఫోరం (సీజీఆర్ఎఫ్) చైర్మన్ విక్టర్ ఇమ్మానియేలు అన్నారు. మంగళవారం స్థానిక పొదిలిరోడ్డులోని కల్యాణ మండపంలో నిర్వహించిన విద్యుత్ అదాలత్‌లో ఆయన మాట్లాడారు. వినియోగదారుల సమస్యలను సిబ్బంది వీలైనంత వరకు స్థానికంగా పరిష్కరిస్తారన్నారు. మొండి, సాంకేతిక, దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను పరిష్కరించడం కోసం అదాలత్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలో సింగరాయకొండలో కూడా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. విద్యుత్ ఎస్ఈ కేవీజీ సత్యన్నారాయణ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో దాదాపు 480 జూనియర్ లైన్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు వచ్చాక వీలైనంత త్వరగా వాటిని భర్తీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వేదిక సాంకేతిక సభ్యుడు కె.వెంకటకృష్ణ, ఆర్థిక సభ్యుడు ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, సభ్యురాలు సునీత, ఈఈ హైమావతి, జిల్లా అకౌంట్స్ అధికారి కొత్తిమీర సుబ్బారావు, విద్యుత్‌శాఖ కందుకూరు డివిజన్ ఈఈ ఎ.వీరయ్య, సింగరాయకొండ సబ్ డివిజన్ అధికారి పి.యుగంధర్ పాల్గొన్నారు.

అక్కడికక్కడే ఆరు సమస్యలు పరిష్కారం

కొండపి, జరుగుమల్లి, సింగరాయకొండ, పొన్నలూరు, కందుకూరు, ఉలవపాడు, గుడ్లూరు, లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాలకు సంబంధించి నిర్వహించిన విద్యుత్ అదాలత్‌లో మొత్తం 13 అర్జీలు వినియోగదారుల నుంచి వచ్చాయి. వీటిలో బిల్లింగ్‌కు సంబంధించి ఇబ్బందులు పడుతున్న ఆరుగురు వినియోగదారుల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఇతర ఏడు సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామని వేదిక సభ్యులు తెలిపారు. కాగా కొండపి గ్రామ పంచాయతీలోని దాసరెడ్డిపాలెం, గొడుగులపాలెంలలో ఇళ్లమీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్లను మార్చాలని మునగల జాన్, సుబ్బయ్య వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఏఈలు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

ఆగని వైసీపీ నేతల ఇసుక దందా

అనుమతులు లేకున్నా యథేచ్ఛగా తవ్వకాలు

లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు

చోద్యం చూస్తున్న అధికారులు



గుండ్లకమ్మ వాగులో ఇసుక కోసం జరిపిన తవ్వకాలు

దొనకొండ, ఆగస్టు 13 : గత వైసీపీ ప్రభుత్వంలో ప్రకృతి సంపదను దోచుకోవడంపై ఆ పార్టీ నాయకులు తెగబోటీపడ్డారు. అడ్డూఅదుపు లేకుండా ఇసుకను తవ్వుకుని అమ్ముకున్నారు. మండలంలోని కొచ్చెర్లకోట పంచాయతీకి చెందిన ఆ పార్టీ నాయకుల ఇసుక దందా అంతాఇంతా కాదు. ఈ దోపిడీపై అప్పట్లో పలువురు టీడీపీ నాయకులు పోరాడితే పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పించి కేసులు నమోదు చేయించి తీవ్రఇబ్బందులకు గురిచేశారు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వైసీపీ నాయకులకు అడ్డేలేకుండా పోయింది. కొచ్చెర్లకోట పంచాయతీ పరిధిలోని సిద్ధాయిపాలెం సమీపంలోని గుండ్లకమ్మ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దొనకొండ నుంచి సిద్ధాయిపాలెం మీదుగా మార్కాపురం వెళ్లే ప్రధాన రహదారి నుంచి దాదాపు రెండు కిలోమీటర్లు లోపల సరైన రహదారి లేని ప్రదేశంలో ఈ ఇసుక రీచ్ ఉంది. అప్పట్లో ఈ ఇసుకకు పెద్దగా గిరాకీ లేకపోవటంతో తగిన గుర్తింపు లేకుండాపోయింది. ఇటీవల కాలంలో తవ్వేకొద్దీ నాణ్యమైన ఇసుక వస్తుండడంతో సిద్దాయిపాలెం ఇసుకకు డిమాండ్ ఏర్పడింది. గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ఇసుకను తోడి పరిసర ప్రాంతంలో డంపింగ్ చేస్తున్నారు. ఈ ఇసుకను ట్రాక్టర్ల ద్వారా మార్కాపురం, దొనకొండ తదితర ప్రాంతాలకు తరలించి ట్రక్కు సుమారు రూ.4 వేల నుంచి రూ.5వేల వరకు విక్రయిస్తున్నారు. సమీపంలో రూ.3 వేలకు విక్రయాలు చేస్తూ దర్జాగా సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు తమకేమీపట్టనట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా స్పందించి అక్రమార్కులపై తగిన చర్యలు చేపట్టి ప్రభుత్వ ఆస్తిని పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

‘ఉపాధి’లో అక్రమాలపై చర్యలు

» పీడీ అర్జునరావు

» ప్రజావేదికలో వెలుగుచూసిన వైనం

ముండ్లమూరు, ఆగస్టు 13: ఉపాధిలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ అర్జునరావు తెలిపారు. మంగళవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయం వద్ద జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఏపీవో కె.నాగరాజు అధ్యక్షత వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం ద్వారా 21 గ్రామ పంచాయతీల్లో పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. రూ.2,17,33,401 మేర అవినీతి జరిగినట్టు వెల్లడైంది. గ్రామ పంచాయతీల వారీగా పరిశీలిస్తే.. ముండ్లమూరులో రూ.48,56,643, నాయుడుపాలెంలో రూ.10,80,942, కెల్లంపల్లిలో 15 లక్షల 108 రూపాయలు, నూజెండ్లపల్లిలో 9 లక్షల 148 రూపాయలు, పోలవరంలో 28 లక్షల 764 రూపాయలు అవినీతి జరిగి నట్టు పీడీ అర్జునరావు తెలిపారు. అలాగే, సింగనపాలెంలో రూ.8,76,119, పులిపాడులో రూ.14,16,868, ఈదరలో రూ.11,11,978, శంకరాపురంలో రూ.9,23,742, జమ్మలమడకలో రూ.4,31,394, పసుపుగల్లు రూ. 28,97, 864 అవినీతి జరిగినట్టు వెల్లడైంది. పూరిమెట్లలో రూ.13,34,539, ఉమా మహేశ్వర అగ్రహారంలో రూ.5,83,942, మారెళ్ళలో రూ.16,34,091, భీమవరంలో రూ.6,00,502, వేములలో రూ.22,97,018, బొప్పూడివారిపాలెంలో 5 లక్షల 506 రూపాయలు, వేములబండలో 1002 రూపాయలు అవినీతి జరిగినట్టు పీడీ అర్జునరావు తెలిపారు. 2023 - 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.13,43,12,158 జరిగిన పనుల్లో రూ.2,17,33,401 అవినీతి జరిగినట్టు సామాజిక తనిఖీల్లో వెల్లడైందని, ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తప్పవని పీడీ అర్జునరావు తెలిపారు.

ఎమ్మెల్యే బీఎన్‌కు సత్కారం



ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు, ఆగస్టు 13: కనపర్తి ఎత్తిపోతల పథకం నూతన కమిటీ సభ్యులు మంగళవారం ఒంగోలులో ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల కనపర్తి ఎత్తిపోతల పథకం నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఆయకట్టు రైతులు టీడీపీ మద్దతుదారులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు ఈదర వెంకటకృష్ణారావు(నాని) ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు బొకే అందించి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కనపర్తి ఎత్తిపోతల పథకం అభివృద్ధికి కృషి చేయాలని, తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

ప్రత్యేకాధికారి ఉదయభాస్కర్



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ఉదయభాస్కర్

మర్రిపూడి, ఆగస్టు 13 : గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నదని మండల ప్రత్యేకాధికారి ఎ.ఉదయభాస్కర్ తెలిపారు. అందుకు అనుగుణంగా అధికారులు రికార్డులను సిద్ధం చేయాలని సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ సమగ్ర రికార్డులు సభలో ఉంచాలని ఈసందర్భంగా ఆయన సూచించారు. నిషేధిత భూములు, వాటి వివరాలను గ్రామ సభలో చదివి వినిపించాలన్నారు. గ్రామ సభలకు జిల్లాస్థాయి ఉన్నతాధికారులు కూడా హాజరవుతారని చెప్పారు. సమాచారం లేకుండా క్షేత్రస్థాయి అధికారులు సభలకు వస్తే ఉపేక్షించేది లేదని ఉదయభాస్కర్ హెచ్చరించారు. వివాదాస్పద భూముల వివరాలు అందుబాటులో ఉంచాలన్నారు. అర్జీలు అందజేసిన ప్రతి ఒక్కరికీ ఎండార్స్‌మెంట్ ఇవ్వాల్సిన బాధ్యత గ్రామ అధికారులదేనని, అన్ని శాఖల అధికారులు గ్రామసభలకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో తహసీల్దార్ జ్వాలా నరసింహారావు, డీటీ భూపతి, వీఆర్వోలు, సర్వేయర్లు సిబ్బంది పాల్గొన్నారు.

కిలో పొగాకు రూ.359

రూపాయి పెరిగిన గరిష్ఠ ధర



వేలంలో పాల్గొన్న అధికారులు

టంగుటూరు, ఆగస్టు 13 : టంగుటూరు వేలం కేంద్రంలో పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.359 పలికింది. వారం రోజులుగా నిలకడగా రూ.358 ఇస్తూ వచ్చిన వ్యాపారులు ఒక రూపాయి పెంచారు. మంగళవారం టంగుటూరు, జరుగుమల్లి, సాధువారిపాలెం, జరుగుమల్లి, వావిలేటిపాడు గ్రామాల రైతులకు చెందిన 1,024 బేళ్లను అధికారులు వేలానికి అనుమతించారు. అందులో 934 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించారు. గరిష్ఠ ధర కిలోకు రూ.359 లభించింది. కనిష్ఠ ధర రూ.205 నిలకడగా కొనసాగుతోంది. సరాసరి ధర రూ.315.09 దక్కింది.. కొనుగోళ్లలో 16 కంపెనీల బయ్యర్లు పాల్గొన్నారు.

నవధాన్యాల కిట్లు పంపిణీ



నవధాన్యాల కిట్లు, పట్టలను అందజేస్తున్న అధికారులు

మర్రిపూడి, ఆగస్టు 13 : మండలంలోని గుండ్లసముద్రం గ్రామానికి చెందిన ఎస్సీ రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన నవధాన్యాల కిట్‌లు, టార్పాలిన్ పట్టలు, డ్రమ్ములను ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ వై.మేరి మంగళవారం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులందరూ ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన పంటలు పండించి నికరాదాయాన్ని పొందాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గురిజాల మరియబాబు పాల్గొన్నారు.

పీడీసీసీబీలో ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించిన జేసీ



ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ

టంగుటూరు, ఆగస్టు 13 : టంగుటూరు పీడీసీసీ బ్యాంకులో జరుగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియను జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ మంగళవారం పరిశీలించారు. బ్యాంకు ఖాతాలు, రికార్డులు, రిజిస్టర్లు, డాక్యుమెంట్స్ ఆన్‌లైన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి ఆయన సూచించారు.

గ్రంథాలయంలో ఆజాదికా అమృత్ మహోత్సవ్

టంగుటూరు, ఆగస్టు 13 : టంగుటూరు గ్రంథాలయంలో మంగళవారం ఆజాదికా అమృత్ మహోత్సవ్ నిర్వహించారు. ముందుగా పింగళి వెంకయ్య, బళ్లారి రాఘవ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతవరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి లైబ్రరీలో పాఠకులు జాతీయ జెండాలు చేతబట్టి ర్యాలీ చేశారు.

టీడీపీ అభిమాని సైకిల్ యాత్రకు స్వాగతం



రామదాసుకు నేతల స్వాగతం

టంగుటూరు, ఆగస్టు 13 : ధర్మం గెలిచిందంటూ చిత్తూరుకు చెందిన టీడీపీ కూటమి అభిమాని రామదాసు అక్కడి నుంచి విజయవాడకు సైకిల్ యాత్ర చేపట్టి సోమవారం రాత్రి టంగుటూరు చేరుకున్నారు. ఆయనకు టంగుటూరుకు చెందిన చదలవాడ వెంకటేశ్వర్లు, శివాలయం పూజారి భవాని శర్మ స్వాగతం పలికారు. అనంతరం భోజనం, వసతి ఏర్పాటు చేశారు.

మర్రిపూడి తహసీల్దార్‌ను కలిసిన నేతలు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎంపీపీ దాసరి వెంకటేశ్వర్లు

మర్రిపూడి, ఆగస్టు 13 : ఇటీవల మర్రిపూడి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన జ్వాలా నరసింహారావును మాజీ ఎంపీపీ దాసరి వెంకటేశ్వర్లు మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు మంగమూరి నాగేశ్వరరావు, అంకేపల్లి రమణారెడ్డి, పాల్గొన్నారు.

బకింగ్‌హామ్ కాలువపై మాగుంట ప్రశ్న

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 13: రాష్ట్ర తూర్పు తీర ప్రాంతంలోకి బకింగ్‌హామ్ నౌకాయాన కాలువ పునరుద్ధరణ, వినియోగంలోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుందని ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి మంగళవారం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనిపై కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్‌శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ సమాధానం ఇస్తూ బకింగ్‌హామ్ నౌకాయాన కాలువను కాకినాడ నుంచి పుదుచ్చేరి వరకు పూర్తి వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అందుకోసం సవివర ప్రాజెక్టు, శో లింగనల్లూరు నుంచి తిరువన్‌మియూర్ వరకు దక్షిణ బకింగ్‌హామ్ కాలువ అభివృద్ధి ప్రాజెక్టు ప్రతిపాదనలు త యారీతో పాటు, తమిళనాడులోని శోలింగనల్లూరు- కల్పా క్కం మధ్య జలమార్గం అభివృద్ధికి ప్రాథమిక ఇంజనీరింగ్ పనులు మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్నాయని తెలిపారు. ఈ కాలువ ఎక్కువభాగం ఆక్రమణలకు గురికావడంతో పనులు చేపట్టలేదని, పునరుద్ధరణకు ఇంకా నిధులు కేటాయించలేదని కేంద్రమంత్రి వివరణ ఇచ్చారు.

53 జీవో ప్రకారం పనిసర్దుబాటు చేయాలి

ఒంగోలు(విద్య), ఆగస్టు 13: ప్రస్తుతం 117 జీవో ప్రకారం జరుగుతున్న టీచర్ల సర్దుబాటు ప్రక్రియను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఫ్యాప్టో మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నేపథ్యంలో టీచర్ల సర్దుబాటుకు సంబంధించి పలు సూచనలు చేస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు లేఖ రాసింది. ప్రధానంగా 117, 128 జీవోల ద్వారా కాకుండా 2020లో విడుదల చేసిన 53 జీవో ప్రకారం పనిసర్దుబాటు చేయాలని, సీనియర్‌కు విల్లింగ్ అవకాశం కల్పించాలని కోరింది. టీచర్ సీనియారిటీని లెక్కించేటప్పుడు ప్యానల్ నెంబరు లేదా ర్యాంకును పరిగణలోకి తీసుకోవాలి. సర్దుబాటు ప్రక్రియను మండల, డివిజన్ స్థాయికే పరిమితం చేయాలి. 70శాతం పైన అంగవైకల్యం ఉన్న టీచర్లను సర్దుబాటు నుంచి మినహాయించాలి. టీచరు సొంత మేనేజ్‌మెంట్‌లో ఖాళీలు భర్తీ అయిన తర్వాతే ఇతర మేనేజ్‌మెంట్లలో నియమించాలి. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పోస్టులను విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా కొనసాగించాలి. యూపీఏ స్కూళ్లలో జీవోనెంబరు 60 మేరకు స్కూలు అసిస్టెంట్ పోస్టులు కొనసాగించాలి. సీబీఎస్ఈ పాఠశాలల్లో పనిసర్దుబాటును మినహాయించాలి. ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించాకే సర్దుబాటుపై ముందుకు కదలాలని మంత్రిని విజ్ఞప్తి చేసింది.

నేటి నుంచి శ్రీశైలానికి అదనపు బస్సు

అద్దంకి, ఆగస్టు 13 : అద్దంకి నుంచి శ్రీశైలంకు బుధవారం నుంచి అదనంగా బస్ సర్వీసును నడపనున్నట్లు డీఎం బెల్లం రామ్మోహనరావు తెలిపారు.అద్దంకిలో ఉదయం 6-30 గంటలకు బయలుదేరి ముండ్లమూరు, తాళ్లూరు, తూర్పుగంగవరం, బొద్దికూరపాడు, రాజంపల్లి మీదుగా పొదిలికి 8-50 గంటలకు చేరుతుందన్నారు. అక్కడ 9-15కి బయలుదేరి మార్కాపురం మీదుగా మధ్యాహ్నం 1 గంటకు శ్రీశైలం చేరుతుందన్నారు. తిరుగు ప్రయాణంలో శ్రీశైలంలో మధ్యాహ్నం 2-15 గంటలకు బయలుదేరి పొదిలి 6-15 గంటలకు చేరుతుందన్నారు. అక్కడ నుంచి 6-30 గంటలకు బయలుదేరి రాజంపల్లి, బొద్దికూరపాడు, తూర్పు గంగవరం, తాళ్లూరు, ముండ్లమూరు మీదుగా రాత్రి 9 గంటలకు అద్దంకికి చేరుతుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.


మార్కాపురంలో జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వెల్లివిరుస్తున్న జాతీయత

● కొనసాగుతున్న హర్ ఘర్ తిరంగా ర్యాలీలు ● మార్కాపురంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో జాతీయ జెండాతో ప్రదర్శన

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏబీవీపీ వివేకానంద విద్యాపీఠం నుంచి విద్యార్థులతో 100 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ నెల్లూరు విభాగ్ ప్రచారక్ ప్రవీణ్, పాఠశాల ప్రిన్సిపాల్ మల్లికార్జునలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. 77 సంవత్సరాల స్వాతంత్ర్య దేశ ప్రజలందరూ జరుపుకునే గొప్ప పండుగ స్వాతంత్ర్య దినోత్సవం అన్నారు. ప్రతి ఇంటిపై జాతీయజెండా ఎగురవేసి దేశ సమైక్యతను చాటాలన్నారు. వివేకానంద విద్యాపీఠం నుంచి నాలుగు మాడవీధులలో విద్యార్థులు నినాదాలతో జాతీయ జెండాను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి దేవిశెట్టి చంద్రశేఖర్, ఆర్ఎస్ఎస్ నాయకులు అంజిరెడ్డి, ఆర్ఎస్ఎస్ జిల్లా సంపర్క్ రామకృష్ణ, ఏబీవీపీ నాయకులు పవన్, శశింద్రా, ఎస్ఎఫ్‌డీ నాయకులు నారాయణ, భాను, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిద్దలూరు : పట్టణంలోనిశాఖ గ్రంథాలయం ఆవరణలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ జెండా రూపకర్త దివంగత పింగళి వెంకయ్య, బళ్లాని రాఘవ త్యాగాలను స్మరించుకుంటూ వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హర్‌ఘర్ తిరంగ ప్రతిజ్ఞను సామూహికంగా నిర్వహించారు. గ్రంథపాలకు రాలు ఎస్.ఎం.ప్రసన్నకుమారి, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

గిద్దలూరుటౌన్ : బీజేవైఎం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బీజేవైఎం అధ్యక్షులు ఆలపాటి సాయిచరణ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడుడు భవనాశి వెంకట రామాంజనేయులు, పట్టణ పార్టీ అధ్యక్షులు అబ్బిశెట్టి ఉదయ్‌శంకర్, రాష్ట్ర కిసాన్‌మోర్చ కార్యవర్గ సభ్యులు పిడతల రమేష్‌రెడ్డి, సాహితి విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల్లో జాతీయ భావం పెంపొందించడానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ హర్‌ఘర్ తిరంగ కార్యక్రమానికి పిలుపునిచ్చారని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వారి ఇంటిపైన జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎం.రమణ, బండారి జయప్రసాద్, మారుతీ ప్రసాద్, కొప్పరపు నాగేశ్వరరావు, సంతోష్‌కుమాంర్, కె.తిరుపాల్‌రెడ్డి, వీరచక్రం తదితరులు పాల్గొన్నారు.




దోర్నాలలో విద్యార్థుల ర్యాలీ, గిద్దలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

పొదిలి : వీరిశెట్టి, బెల్లంకొండ విద్యాసంస్థల ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో విద్యార్థులతో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. మార్కాపురం అడ్డరోడ్డు నుంచి మండలపరిషత్ కార్యాలయం వరకు జాతీయ జెండాలతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతీయ నాయకులకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణారెడ్డి, సీఐ మల్లిఖార్జునరావ్, బెల్లంకొండ విద్యాసంస్థల అధినేతలు శ్రీనివాసరావు, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : స్థానిక గ్రంథాలయంలో ఆజాద్ కా అమృత్ మహోత్సవ కార్యక్రమాన్ని గ్రంథపాలకుడు డీవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో హర్ ఘర్ తిరంగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం త్రివర్ణ పతాకాలతో ర్యాలీ నిర్వహించారు.

అవీ..ఇవీ..

విద్యార్థులకు దుస్తుల పంపిణీ


దుస్తులతో విద్యార్థులు

కంభం, ఆగస్టు 13 : జంగంగుంట్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రూ.50వేల విలువైన ఏకరూప దుస్తులను నెమలిదిన్నె రంగారెడ్డి తల్లి వీరమ్మ ద్వారా అందజేశారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న రంగారెడ్డి గ్రామానికి వచ్చిన ప్రతిసారి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించడం అభినందనీయమని హెచ్ఎం గని.వెంకటేశ్వర్లు తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరంలో 10వ తరగతి ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థికి 2వేల చొప్పున ఇవ్వడమే కాక మొదటి స్థానాలు సాధించిన వారికి ప్రత్యేక నగదు పంపిణీ చేస్తుంటారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పిచ్చిరెడ్డి, జాన్, కాంతారావు నాయక్, నారాయణ, రవీంద్రనాయక్, లలిత, శివ, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా శైలేంద్రకుమార్


బాధ్యతలు చేపట్టిన శైలేంద్రకుమార్

పెద్దదోర్నాల, ఆగస్టు 13: దోర్నాల మండల ఇన్‌చార్జ్ తహసీల్దారుగా పీ శైలేంద్రకుమార్ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి అధికారులు, స్థానిక రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. 765వ నంబరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూమిని కోల్పోయి పరిహారం అందని వారు పూర్తి వివరాలతో కూడిన అర్జీలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో జాతీయ రహదారి డీఈ రాధిక, ఆర్ఐ నాగేశ్వరరావు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన టీడీపీ నాయకులు


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

గిద్దలూరు టౌన్, ఆగస్టు 13 : గిద్దలూరు తహసీల్దార్‌గా నియమితులైన ఆంజనేయరెడ్డిని మంగళవారం పలువురు టీడీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల నూతనంగా నియమితులైన ఆంజనేయరెడ్డి ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పట్టణ టీడీపీ కౌన్సిలర్లు బూనబోయిన చంద్రశేఖర్‌యాదవ్, గడ్డం భాస్కర్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షులు షానేషావలి, టీడీపీ నాయకులు దుత్తా బాలీశ్వరయ్య బిల్లా రమేష్‌యాదవ్, జాఫర్, బాలచెన్నయ్య కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

బాధితులతో నేడు సమావేశం

బేస్తవారపేట, ఆగస్టు13: అనంతపురం-అమరావతి జాతీయ రహదారి విస్తర్ణలో భాగంగా భూములు, నివేశన స్థలాలు కోల్పోయిన బాధితులతో సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ షేక్ పర్వీన్ తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా హాజరు కానున్నట్లు తెలిపారు. సమావేశానికి బాధిత రైతులు హాజరుకావాలన్నారు.

భూకబ్జాలపై ఫిర్యాదు

గిద్దలూరు టౌన్, ఆగస్టు 13 : మండలంలోని పలు గ్రామాలలో జరిగిన భూకబ్జాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఒంగోలుకు చెందిన దేశబోయిన వెంకటరాజు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాడు. మంగళవారం వెంకటరాజు గిద్దలూరు తహసీల్దార్ ఆంజనేయరెడ్డి కలిసి ఆ మేరకు వినతిపత్రం అందించారు. గడిచిన వైసీపీ హయాంలో మండలంలోని ఉయ్యాలవాడ, పొదలకొండ పల్లె, ఓబులాపురం గ్రామాలలో అసైన్డ్ భూములు, శ్మశాన స్థలాలను వైసీపీ నాయకులు కబ్జా చేశారని, ఈ అంశాల గురించి పలు దఫాలు తాను ఫిర్యాదు చేసినట్లు వెంకట్రావు ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. వందల ఎకరాలు కబ్జాలు చేసి వాటిని ఆన్‌లైన్‌లో దారి మర్లి విక్రయించేందుకు సదరు నాయకులు సిద్ధపడ్డారని తహసీల్దార్ ఆంజనేయరెడ్డి తెలిపారు. దీంతో స్పందించిన తహసీల్దార్ పూర్తి స్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

ఉద్యోగోన్నతులు చేపట్టాలి

గిద్దలూరు, ఆగస్టు 13 : ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు చేపట్టాలని, సిబ్బంది హెచ్చుతగ్గులు సరిచేయాలని ఏపీటీఎఫ్ నాయకులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ఉత్తర్వుల పట్ల నిరాశ వ్యక్తం చేశారు. విద్యారంగానికి గొడ్డలి పెట్టుగా ఉన్న నిబంధనలను సైతం రద్దు చేయాలని కోరారు. ఉద్యోగోన్నతులు చేపట్టిన అనంతరమే వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వై.శ్రీనివాసులు, జిల్లా అదనపు కార్యదర్శి ఎస్.హెచ్.కబీర్, గిద్దలూరు, కొమరోలు మండలశాఖ అధ్యక్షులు దేవసహాయం, పిచ్చయ్య కోరారు.

చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి


వివిధ రంగాలకు చెందిన వ్యక్తులను సన్మానిస్తున్న నిర్వాహకులు

గిద్దలూరు, ఆగస్టు 13 : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువు బి.ఎస్.నారాయణరెడ్డి అన్నారు. స్థానిక ఎన్‌జీవో భవనంలో ప్రపంచ యువజన దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నారాయణరెడ్డి మాట్లాడుతూ చెడువ్యసనాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. తొలి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి భారతరత్న ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వివిధ రంగాలలో సేవా కార్యక్రమాలు అందిస్తున్న డాక్టర్ లొక్కు శరత్‌బాబు, రాజశేఖర్, చల్లా అశోక్‌రెడ్డి, బాల కళాకారుడు సాయి, కరాటే గోల్డ్ మెడలిస్టు హేమలత, చిన్ని సేవాసంస్థ అధ్యక్షులు మాగులూరి శ్రీకాంత్‌లను సన్మానించారు. కార్యక్రమంలో కొమ్మునూరు సర్పంచ్ కర్నాటి రామసుబ్బారెడ్డి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జి.రవీంద్రనాథరెడ్డి, బీజేపీ రూరల్ మండల అధ్యక్షులు తిరుపాల్‌రెడ్డి, బీజేపీ నాయకులు రెడ్డి మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారికి జరిమానా

బేస్తవారపేట, ఆగస్టు 13 : బేస్తవారపేట మండలంలోని పలు గ్రామాల్లో గృహాలు, వాణిజ్య సముదాయాలపై మంగళవారం విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఈఈ కె.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 40 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. 1458 గృహ సర్వీసులు, 222 వాణిజ్య సముదాయాలు, 20 ఇతర సర్వీసులను తనిఖీ చేయగా 29 గృహాలలో అక్రమంగా విద్యుత్ వినియోగించుకుంటున్నారన్నారు. అదనపు లోడ్ వినియోగించుకుంటున్న వారికి రూ.338500 అపరాధ రుసుము విధించారు. ఈ దాడుల్లో మార్కాపురం, ఈఈ పీవీ.నాగేశ్వరరావు, డీఈ.వి.శ్రీనివాసరావు, మార్కాపురం డీఈఈ ఎస్.సియా నాయక్, గిద్దలూరు డి.ఈ శేషగిరి, తదితరులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు గాయాలు

గిద్దలూరు, ఆగస్టు 13 : రాచర్ల ఫారం సమీపంలోని బాలికల గురుకుల పాఠశాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా ఆచారి పనిచేస్తున్నాడు. మంగళవారం పాఠశాలలో విధులు ముగించుకొని స్వగ్రామమైన ఆకవీడుకు మోటార్ సైకిల్‌పై వెళుతుండగా రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. బొలెరో వాహనం ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకొంది. 108 సిబ్బంది గిద్దలూరు వైద్యశాలకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. రాచర్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రమశిక్షణతో చదువులను అభ్యసించాలి

● జూనియర్ సివిల్ న్యాయాధికారి ఓంకార్


విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయాధికారి ఓంకార్

గిద్దలూరు టౌన్, ఆగస్టు 13 : క్రమశిక్షణ కలిగిన చక్కని చదువులను బాల బాలికలు అభ్యసించాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.ఓంకార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పీఆర్ కాలనీలోని బాలసదన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ఉండే విద్యార్థినులతో ఆయన మాట్లాడారు. చిన్నారులకు అందుతున్న వసతుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బాలసదన్ నందు 14 సంవత్సరాలలోపు విద్యార్థులు చదువుతుండగా వారి స్థితిగతుల గురించి వివరాలు తెలుసుకున్నారు. జడ్జి ఓంకార్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం అందరికీ సమాన హక్కులు ఉన్నాయన్నారు. బడిఈడు పిల్లలు తప్పనిసరిగా చదువుకోవాలన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం ద్వారా ఉన్నత శిఖరాలు

గిద్దలూరు : ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత స్థితికి చేరేందుకు నిరంతరం శ్రమిస్తే ఉన్నత శిఖరాలు అందుకోవచ్చని మండల సేవాధికార సంస్థ చైర్మన్, న్యాయాధికారి ఎం.ఓంకార్ అన్నారు. రాచర్లలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయిన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పాఠశాల ప్రాంగణంలో సీసీ కెమెరాలు పని చేయడం లేదని తెలుసుకుని వెంటనే బాగు చేయించాలని ఆదేశించారు. ఎవరికైనా ఏ సమస్యలున్నా గిద్దలూరు కోర్టు ప్రాంగణంలోని మండల న్యాయసేవాధికార సంస్థకు అర్జీ రూపంలో తెలియజేయవచ్చని పేర్కొన్నారు. చట్టాలను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మాలకొండమ్మ, ఏఎస్సై ఆదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

కాపుదశలో మామిడిపై ప్రత్యేక శ్రద్ధచూపాలి

ఎర్రగొండపాలెం, ఆగస్టు 13 : మండలంలోని అంకమ్మ గిరిజనగూడెంలో నాబార్డు ఆర్థిక సహాయంతో గిరిజన రైతులు సాగుచేస్తున్న మామిడి తోటలను మంగళవారం నాబార్డు ఏజీఎం రవికుమార్ పరిశీలించారు. తోటలకు నీటి తడులు క్రమం తప్పకుండా ఇవ్వాలని మంచి దిగుబడుల కోసం సేంద్రీయ ఎరువులను వేసి చెట్లను పెంచాలని రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో వెలుగు కో-ఆర్డినేటరు లక్ష్మిరెడ్డి, గిరిజన రైతులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ పరిధిలోనే సర్దుబాటు చేయాలి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 13: మున్సిపల్ పాఠశాలల్లో సర్‌ప్లస్‌గా ఉన్న ఉపాధ్యాయులను ఆయా మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలల్లోనే సర్దుబాటు చేయాలని యూటీఎఫ్ నాయకులు మంగళవారం మండల విద్యాశాఖాధికారి రాందాస్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలోని 14 ప్రాథమిక, ఒక ప్రాథమికోన్నత, మూడు ఉన్నత పాఠశాలలు ఉన్నాయన్నారు. ఆయా పాఠశాలల్లో కొన్ని సంవత్సరాలుగా ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన సర్దుబాబు ప్రక్రియ చేపట్టిందన్నారు. ఆ ప్రక్రియ మున్సిపాలిటీ పరిధిలోనే ఉండేలా చూడాలని కోరారు.

రైల్వే గేటు మూతతో ప్రయాణికులకు అవస్థలు


మూతపడిన రైల్వే గేటు

తర్లుపాడు, ఆగస్టు 13: తర్లుపాడు నుంచి మార్కాపురం వెళ్లే రహదారిలోని రైల్వే గేటు ట్రాక్ మరమ్మతుల కారణంగా సోమవారం నుం చి మూత వేశారు. దీంతో 14 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ గేటు నుం చి నిత్యం వందలాది వాహనాలు మార్కాపురం వెళ్తుంటాయి. ఈ గేటు నుంచి తాడివారిపల్లి, మీర్జపేట, నాగెళ్లముడుపు, చెన్నారెడ్డిపల్లి, బొడి చర్ల, బొందలపాడు, సూరెపల్లి తదితర గ్రామాల నుంచి నిత్యం మార్కాపురానికి వివిధ పనులపై వెళ్తుంటారు. విద్యార్థులు కూడా వివిధ గ్రామాల నుంచి కళాశాలలు, పాఠశాలలకు వెళ్తుంటారు. ఈ గేటు మూత వేయడంతో సుమారు 25 కి.మీ చుట్టూ తిరిగి రావాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో ఆర్టీసీ బస్‌పూర్తిగా రద్దు చేయగా.. కళాశాలల బస్సులు కూడా కొన్ని రద్దు చేశారు. దీంతో విద్యార్థులు కళాశాలలకు వెళ్లకుండా ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ఈ గేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మించాలని పదేళ్లగా ప్రజలు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించు కుంటున్నారు. అయినా నేటికీ ఫ్లైవర్ నిర్మాణానికి అనుమతులు రాకపోవడంతో ప్రజలకు అగచాట్లు తప్పలేదు. ఇక్కడ ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రజలకు పేర్కొంటున్నారు. ఈ గేటు నుంచి నిత్యం 30 గూడ్స్, 15 ట్రైన్లు వెళ్తుంటాయి. రైలు వచ్చే సమయంలో గేటు వేస్తే 20 నిమిషాలు ఆగాల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి జోక్యం చేసుకుని రైల్వే అధికారులతో చర్చించి ఫ్లైఓవర్ నిర్మించాలని కోరుతున్నారు.

'ఉపాధి'లోనూ వలంటీర్ల మాయాజాలం


ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

కంభం (అర్థవీడు), ఆగస్టు 13 : అర్థవీడు మండలం యాచవరం పంచాయతీ పరిధిలో కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహాత్మగాంధీ ఉపాధి హామీ పథకం నిధులను అక్రమం మార్గంలో సొంత ఖాతాలకు మళ్లించుకున్నారు. మండలంలోని కొంతమంది అధికారులు, వైసీపీ నాయకుల అండదండలతో వలంటీర్లు దోచిపెట్టారని విమర్శలున్నాయి. ఉదాహరణకు భూములు లేని వారికి, 18 సంవత్సరాల వయస్సు నిండని వారికి, మొక్కలు నాటని రైతులకు బిల్లులు చేశారని తెలుస్తోంది. అవెన్యూ ప్లాంటేషన్ పథకం ద్వారా అసలు మొక్కలు నాటకుండానే మెటీరియల్ బిల్లులు, ప్రతి సంవత్సరం మొక్కల పెంపకం కోసం నిర్వహణ బిల్లులు, హార్టికల్చర్‌లో వివిధ పథకాలను సంబంధిత అధికారులతో కుమ్మక్కైన వలంటీర్లు బిల్లులు చేసుకున్నట్లు తెలిసింది. ఆ బిల్లులను రైతుల ఖాతాల నుంచి వారికే తెలియకుండానే ఆధార్ పేమెంట్ ద్వారా వలంటీర్ల బ్యాంక్ అకౌంట్లకు నిధులను మళ్లించుకున్నారు. యాచవరం గ్రామ వలంటీర్లు అనర్హులకు లబ్ధి చేకూర్చారని పలువురు ఆరోపిస్తున్నారు. భూయజమానికి తెలియకుండా బోగస్ కౌలుకార్డులు మంజూరు చేసి మొక్కలు నాటకుండానే నాటినట్లుగా బిల్లులు చేసుకున్నారు. ప్రభుత్వ భూముల సర్వేనెంబర్లు, చనిపోయిన వారి భూసర్వే నంబర్లు, ఇతరుల పేరు మీద కౌలు కార్డులు మంజూరు చేయించి బిల్లులు స్వాహా చేశారనే విమర్శలున్నాయి. ఈ విషయంపై అర్థవీడు ఎంపీడీవో సాంబశివరావును వివరణ కోరగా తన దృష్టికి ఈ విషయం వచ్చిందని, సంబంధిత ఏపీవోను అడిగి వివరాలు సేకరిస్తున్నట్లు ఆయన తెలిపారు.

అధిక వ్యయంతో పొగాకు సాగు చేయవద్దు

ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్‌బాబు


గోదాములను పరిశీలిస్తున్న శ్రీధర్‌బాబు

పొదిలి, ఆగస్టు 13 : రైతులు ఈ ఏడాది పొగాకు ధరలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం పొగాకు సాగుచేయవద్దని పొగాకుబోర్డ్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం పొగాకు బోర్డును ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. పొలాలు, బ్యారన్‌లకు అధిక ధరలు వెచ్చించి పొగాకు సాగు చేయవద్దని చెప్పారు. ఈ ఏడాది ధరలతో రైతులు అత్యుత్సాహంతో ఎక్కువ మొత్తంలో పొగాకు సాగు చేసి నష్టాలను కొని తెచ్చుకోవద్దన్నారు. ప్రతి రైతు ప్రత్యామ్నాయ పంటలపై కూడా దృష్టి పెట్టాలని కోరారు. రైతులు గమనించి పొగాకు బోర్డు అనుమతి మేరకే పొగాకు సాగు చేయాలని సూచించారు. ఆ విధంగా చేయడం వలన నాణ్యమైన పొగాకును పండించే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం వేలం ప్రక్రియను పరిశీలించి ధరల పై వాకబు చేశారు. ధరలు అన్నదాతలకు అనుకూలంగా ఉండడంతో రైతులు ఉత్సాహంతో ఉన్నారన్నారు. ఈ ఏడాది నూతనంగా నిర్మిస్తున్న పొగాకుబోర్డు గోదాములను, ఆధునికీ కరణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం రైతులతో, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతు సంఘ నాయకులు వీరనారాయణ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుండి అదనపు పంటపై అపరాధ రుసుము లేకుండా అమ్ముకునేందుకు అవకాశం కల్పించినందుకు రైతులందరి తరపున కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాకుండా పొగాకు సూర, ముక్క, పండుగుళ్ల అమ్మకాలకు అనుమతినివ్వడం శుభపరిణామమన్నారు. అన్నదాతలకు అండగా నిలబడిన శ్రీధర్‌బాబు ను రైతులు, నాయకులు ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి గిరిరాజ్‌కుమార్, కార్యదర్శి వేణుగోపాల్, ఇన్‌చార్జ్ రీజినల్ మేనేజర్ ఎం.కృష్ణ, సూపరిండెంట్ కేవీ.రామాంజనేయలు, రైతు నాయకులు బీరం కృష్ణారెడ్డి, ఆవులూరి కోటేశ్వరరావు, ఇంకొల్లు నర్సారెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై శిక్షణ


ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను సందర్శిస్తున్న సర్పంచులు, కార్యదర్శులు

మార్కాపురం రూరల్, ఆగస్టు 13: గ్రామాలలో అధికారులు, ప్రజాప్రతినిధులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ బండి లక్ష్మీదేవి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండవ రోజు ప్రజాప్రతినిధులకు, పంచాయతీ కార్యదర్శులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాలలో కుటుంబాల, సామాజిక స్థాయిలలో పారిశుధ్యం ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. పరిసరాల పరిశుభ్రతతోనే అనారోగ్యం దరిచేరకుండా ఉంటుందన్నారు. ఏపీ పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనలను శిక్షణ కార్యక్రమంలో డీఎల్‌డీవో సాయికుమార్ వివరించారు. మండలంలోని దరిమడుగు గ్రామంలోని చెత్త సేకరణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చందన మాట్లాడుతూ.. వ్యర్థాల ప్రాసెసింగ్, కంపోస్టు ఎరువు తయారీ విధానాన్ని ఆచరణాత్మకంగా వివరించేందుకు ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ సందర్శన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. గ్రామాలలో ప్రజలకు తడి, పొడి చెత్త వేరు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రామ్మోహన్‌రెడ్డి, రీసెర్స్ పర్సన్ కిషోర్, దరిమడుగు సర్పంచ్ బట్టగిరి గౌతమి, పంచాయతీ కార్యదర్శులు, క్లాత్ మిత్రలు పాల్గొన్నారు.

కంభం : ప్రభుత్వం నుంచి వచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా పంచాయతీలలో పనులు చేయాలని ఎంపీపీ చేగిరెడ్డి తులసమ్మ, ఎంపీడీవో మస్తాన్‌వలి తెలిపారు. మంగళవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను ఏ విధంగా బలోపేతం చేయాలని, వారి అధికారాల గురించి, వీధిదీపాల నిర్వహణ, పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. రెండవరోజు శిక్షణలో భాగంగా శానిటేషన్ కార్యక్రమాలపై వివరించారు. చిన్నకంభం గ్రామపంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. అన్ని గ్రామాలకు సంబంధించిన గ్రీన్‌అంబాసిడర్లు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు. ప్రతి ఇంటి నుంచి సేకరించిన చెత్తను ఒక దగ్గరకు చేర్చి ఏ విధంగా తడిపొడి చెత్తను వేరుచేసే జాగ్రత్తల గురించి ఎంపీడీవో మస్తాన్ వలి, ఈఓఆర్‌డీ విజయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తులసమ్మ, సర్పంచ్‌లు, కార్యదర్శులు, పాల్గొన్నారు.

త్రిపురాంతకం : గ్రామ పంచాయితీల అభివృద్ధి ప్రణాళికలపై మండలంలోని సర్పంచులకు, పంచాయితీ కార్యదర్శులకు క్లాప్‌మిత్రలకు శిక్షణ కార్యక్రమం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వరప్రాద్, ఈవోపీఆర్‌డీ మురళీమోహన్ మాట్లాడుతూ పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యుత్ వృథా కాకుండా జాగ్రత్తలు వహించాలని, వీధి దీపాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని మీటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. పారిశుధ్య కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలని తడిచెత్త, పొడి చెత్త వేరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : ప్రతి పంచాయతిలోని చెత్త సంపద కేంద్రంలో చెత్త నుంచి సంపద తయారు చేయాలని ఈవోపీఆర్‌డీ రాజశేఖరరెడ్డి అన్నారు. మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఎర్రగొండపాలెం గ్రామ పంచాయతి చెత్త సంపద కేంద్రంలో మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి గ్రామ పంచాయతిలో గ్రీన్ అంబాసిడర్లు తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా సేకరించాలన్నారు. చెత్తసంపద కేంద్రంలో కూడ తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరు బాక్సులలో నిల్వ చేయాలని సూచించారు. గ్రామపంచాయతీలో రోజువారిగా రికార్డులలో సేకరించిన చెత్త వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఎర్రగొండపాలెం గ్రామ పంచాయతి చెత్త సంపద కేంద్రంలో వర్మికంపోస్టు ఎరువుల తయారి యూనిట్స్‌ను పరిశీలించి, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వరప్రసాదు, ఈవోపీఆర్‌డీ రాజశేఖరరెడ్డి, శిక్షకులు పి.రామసుబ్బయ్య శిక్షణ ఇచ్చారు. సర్పంచులు, కార్యదర్శులు శిక్షణకు హాజరయ్యారు.

పొదిలి : గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజలు భాగస్వాములు కావాలని ఎంపీడీవో శ్రీకృష్ణ అన్నారు. సోమవారం నుంచి పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు జరుగుతున్న శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో ప్రధమపౌరుడిగా సర్పంచ్ అభివృద్ధి చేయడంలో ముందుండాలన్నారు. అదే విధంగా గ్రామం అభివృద్ధి చెందడానికి కావలసిన వనరులు ఎలా సమకూర్చుకోవాలనే విషయాన్ని అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నారు. అందులో భాగంగా మంగళవారం జువ్వలేరు గ్రామాన్ని సందర్శించారు. అనంతరం సేంద్రీయ ఎరువులు ఎలా తయారు చేయాలనే దానిపై అవగాహన కల్పించి తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మండల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


జువ్వలేరులో సేంద్రీయ ఎరువుల తయారీని పరిశీలిస్తున్న అధికారులు


త్రిపురాంతకంలో సర్పంచులు, కార్యదర్శులతో సమావేశం

అంకితభావంతో పనిచేసే వారికి గుర్తింపు


సీఐ రాంనాయక్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

పామూరు, ఆగస్టు 13: అంకితభావంతో విధులు నిర్వహించే వారికి ఎక్కడికెళ్లినా గుర్తింపు గౌరవం, ప్రజల నుంచి ఆదరాభిమానాలు లభిస్తాయని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పామూరు సీఐగా సేవలు అందించి గుంటూరు జిల్లాకు బదిలీపై వెళుతున్న సీఐని స్థానిక సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే ఉగ్ర కలిశారు. సీఐగా ఉత్తమ సేవలు అందించినందుకు సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డీవీ మనోహర్, ఉప్పలపాటి హరిబాబు, షేక్ గౌస్‌బాషా, పాలపర్తి వెంకటేశ్వర్లు, ఎం.గిడ్డయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పామూరు ఎంపీడీవోగా సురేష్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన సురేష్

పామూరు, ఆగస్టు 13: పామూరు ఎంపీడీవో బెల్లంకొండ సురేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ ఎన్నికల్లో భాగంగా గుంటూరు జిల్లా మాచవరం ఎంపీడీవోగా బదిలీ అయ్యారు. ఇక్కడ సేవలు అందించిన పి. పుల్లారెడ్డి పల్నాడు జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈసందర్భంగా కార్యాలయ పరిపాలనాధికారి వి.శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ కేఎల్ శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ నరసింహారావు, సిబ్బంది సురేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

పీసీపల్లి ఎంపీడీవోగా శ్రీనివాసరెడ్డి

పీసీపల్లి, ఆగస్టు 13: పీసీపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కె.శ్రీనివాసరెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఎన్నికలకు ముందు పీసీపల్లి ఎంపీడీవోగా చేస్తూ గుంటూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఎన్నికల అనంతరం తిరిగి పీసీపల్లికి పోస్టింగ్ రావడంతో ఎంపీడీవోగా రెండోసారి బాధ్యతలు చేపట్టారు.

రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

పామూరు, ఆగస్టు 13: పామూరు తహసీల్దార్ బీవీ రమణారావును మంగళవారం టీడీపీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయ భూములకు సంబంధించి ఎలాంటి అక్రమాలకు అవకాశం ఇవ్వకుండా రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏ.ప్రభాకర్‌చౌదరి, ఎం.హాసేన్‌రావు వై.ప్రసాద్‌రెడ్డి, ఖాజారహంతుల్లా, ఉప్పలపాటి హరిబాబు, పువ్వాడి రామారావు, పాలపర్తి వెంకటేశ్వర్లు, ఇర్రి కోటిరెడ్డి, మన్నం రమణయ్య, ఎన్. సాంబయ్య, డి. మాల్యాద్రి, ఎన్.నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.

రేషన్ షాప్ తనిఖీ


కొత్తపాలెం రేషన్ షాపును తనిఖీ చేస్తున్న ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు

తాళ్లూరు, ఆగస్టు 13: మండలంలోని కొత్తపాలెం రేషన్ షాపును ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. బియ్యాన్ని కార్డుదారులకు ఇవ్వకుండా అక్రమ మార్గంలో తరలిస్తున్నట్టు ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించగా బియ్యం వ్యత్యాసం ఉన్నట్టు గుర్తించారు. రికార్డులో ఉన్న రేషన్‌కు, పంపిణీ చేసిన తరువాత ఉన్న రేషన్ తక్కువగా ఉన్నట్లు నిర్ధారించారు. దీంతో రేషన్ డీలర్ సుబ్బారెడ్డిపై 6ఏ కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్సుమెంట్ డీటీలు సీహెచ్ కృష్ణమోహన్, కె.డేవిడ్, ఆర్వీ కృష్ణమోహన్, రామనారాయణరెడ్డి, వీఆర్వో నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలను శుభ్రపరిచిన కూటమి నాయకులు

పామూరు, ఆగస్టు 13: స్థానిక హైస్కూల్ వద్ద ఉన్న అంబేద్కర్, పూలే, జగ్జీవన్‌రావు విగ్రహాలను మంగళవారం కూటమి నేతలు నీళ్లతో శుభ్రపరిచారు. స్మారక విగ్రహాల చుట్టూ పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కేవీ రమణయ్య, జె.చినసుబ్బయ్య, ఉమ్మడిశెట్టి శ్రీను, చామల శ్రీనివాసరెడ్డి, పాడే అరవింద్, బి.హజరత్‌కుమార్, పి.విజయకుమార్, టీడీపీ నాయకులు డీవీ మనోహర్, డి.మాల్యాద్రి, కె.సుభాషిణి, ఎన్.సాంబయ్య, బి.నారాయణ, జి.కొండలరావు, జనసేన నాయకులు వై.రహీముల్లా, ఎన్.నరసింహారావు, ఎం.నాగేంద్ర పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులపై అవగాహన కల్పించాలి

పీసీపల్లి, ఆగస్టు 13: రెవెన్యూ సదస్సులపై ప్రజలకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ సీహెచ్ ఉష అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ సదస్సుల్లో రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై వచ్చే అర్జీలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. రైతు సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీటీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించాలి

ముండ్లమూరు, ఆగస్టు 13: మండలంలో భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలతో పాటు ఇటీవల నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత మీకోసం స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. రికార్డుల నిర్వాహణ సక్రమంగా ఉండేటట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు జి.పుల్లారెడ్డి, ఏ.స్రవంతి, సీనియర్ అసిస్టెంట్ శేషగిరిరావు, ఆర్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై చిరువ్యాపారి దాడి

కనిగిరి, ఆగస్టు 13: కనిగిరి మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై మంగళవారం చిరువ్యాపారి దాడి చేశారు. స్థానికుల కథనం ప్రకారం.. శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు స్థానిక చెప్పుల బజారులో పారిశుధ్య సిబ్బందితో మురుగు కాల్వల్లోని చెత్తను తొలగించే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో అదే రోడ్డులో గతంలో బంకు పెట్టుకుని కేశవ అనే వ్యక్తి జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఆక్రమణల తొలగింపులో భాగంగా అతని బంకును తీసివేశారు. ఇది మనసులో పెట్టుకుని పారిశుధ్య పనులు చేయిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై దుర్భాషలాడుతూ దాడి చేశారు. గాయాలపాలైన శానిటరీ ఇన్‌స్పెక్టర్ స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. మున్సిపల్ చైర్మన్ గఫార్, కమిషనర్ టీవీ రంగారావు, మేనేజర్ ప్రసాద్, మున్సిపల్ సిబ్బంది, అధికారులు పరామర్శించారు.

మోట్రావులపాడులో పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు


పోలేరమ్మ విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

పామూరు, ఆగస్టు 13: మండలంలోని మోట్రావులపాడులో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ దేవత శ్రీపోలేరమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు బుధవారం నుంచి మూడు రోజులపాటు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈసందర్భంగా మంగళవారం పామూరు సత్యదేవుని దేవస్థానం వద్ద నుంచి ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో పోలేరమ్మతల్లి విగ్రహాన్ని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వరకు గ్రామోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మహిళలు ప్రమిదలు చేత పట్టుకొని గ్రామోత్సవంలో నడిచారు. ఈసందర్భంగా నిర్వహించిన కోలాట నృత్య ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది.

ఆగని వైసీపీ నేతల ఇసుక దందా

- అనుమతులు లేకున్నా యథేచ్ఛగా తవ్వకాలు
- లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- చోద్యం చూస్తున్న అధికారులు

దొనకొండ, ఆగస్టు 13: గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు పెట్రేగిపోయారు. అడ్డూ అదుపులేకుండా మండలంలోని కొచ్చెర్లకోట పంచాయతీకి చెందిన ఆ పార్టీ నాయకులు ఇసుక దందా యథేచ్ఛగా కొనసాగించారు. అప్పట్లో పలువురు టీడీపీ నాయకులను పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పించి కేసులు నమోదు చేయించి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వైసీపీ నాయకులు ఆ ప్రాంతంలో అడ్డేలేకుండా పోయింది. ఇసుకను అక్రమంగా విక్రయించుకొని సొమ్ము చేసుకుంటున్నట్టు సమాచారం.

మండలంలోని కొచ్చెర్లకోట పంచాయతీ పరిధిలోని సిద్దాయిపాలెం గ్రామ సమీపంలోని గుండ్లకమ్మ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తూ రూ.లక్షలు గడిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకున్నా నాడు అధికార వైసీపీలో పలుకుబడి ఉన్న కొందరు పెట్రేగిపోతూ ఇసుక తవ్వకాలు జరుపుకుంటూ దర్జాగా విక్రయించుకున్నారు. ఆ ప్రాంతం వైపు వెళ్లిన, ఇసుక ట్రాక్టర్‌కు లోడ్ చేసిన పలువురు టీడీపీ నాయకులపై అప్పట్లో కేసులు నమోదు చేయించి ఇబ్బందులకు గురిచేసిన సంఘటనలు జరిగాయి. నేడు అధికారం కోల్పోయినా వైసీపీ నాయకులు మాత్రం ఇసుకను అక్రమంగా తోడేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మార్కాపురం నుంచి సిద్దాయిపాలెం మీదుగా పెద్దారవీడు మండలంలోకి గుండ్లకమ్మ వాగు ప్రవహిస్తుంది. దొనకొండ నుంచి సిద్దాయిపాలెం మీదుగా మార్కాపురం వెళ్లే ప్రధాన రహదారి నుంచి దాదాపు రెండు కిలోమీటర్లు లోపల సరైన రహదారి లేని ప్రదేశంలో ఈ ఇసుక రీచ్ ఉండటం గమనార్హం. గత కొన్ని సంవత్సరాలుగా ఈ వాగులో నుంచి కొందరు అక్రమార్కులు అడపాదడపా ఇసుకను తరలించుకుంటూ విక్రయాలు జరుపుకుంటున్నారు. అప్పట్లో ఈ ఇసుకకు పెద్దగా గిరాకీ లేకపోవటంతో తగిన గుర్తింపు లేకుండా పోయింది.


కుప్పలుగా పోసిన ఇసుక

ఇటీవల కాలంలో తవ్వేకొద్దీ నాణ్యమైన ఇసుక రావటంతో సిద్దాయిపాలెం ఇసుకకు ఈ ప్రాంతంలో గుర్తింపు వచ్చింది.


సిద్దాయిపాలెం వద్ద గుండ్లకమ్మ వాగులో జరిగిన తవ్వకాలు

గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ఇసుకను తోడి పరిసర ప్రాంతంలో డంపింగ్ చేస్తున్నారు. ఈ ఇసుకను ట్రాక్టర్ల ద్వారా మార్కాపురం, దొనకొండ తదితర ప్రాంతాలకు తరలించి ట్రక్కు సుమారు రూ.4 వేల నుండి రూ.5వేల వరకు విక్రయిస్తున్నారు. సమీపంలో అయితే రూ.3 వేలకు విక్రయాలు జరుపుకుంటూ దర్జాగా సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా స్పందించి అక్రమార్కులపై తగిన చర్యలు చేపట్టి ప్రభుత్వ ఆస్తిని పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ సొమ్ముతో ప్రైవేట్ భూమిలో బోరు

- గుడి అవసరాలకు నీరు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న వైనం
- పట్టనట్టుగా వ్యవహరిస్తున్న అధికారులు


ప్రభుత్వ సొమ్ముతో ప్రైవేట్ వ్యక్తి భూమిలో ఏర్పాటుచేసిన బోరు

దర్శి, ఆగస్టు 13: వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు వరుసగా వెలుగులోకి వస్తున్నాయి. భూములు, స్థలాల ఆక్రమణలతో పాటు బోర్లు కూడా అక్రమంగా వేశారు. మండలంలోని రాజంపల్లి పంచాయతీలోని శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద వేసిన బోరు వివాదం నెలకొంది. సుమారు రెండు సంవత్సరాల క్రితం వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆంజనేయస్వామి ఆలయంలో పూజలకు, భక్తుల అవసరాల కోసం అక్కడ బోరు వేశారు. అధికారుల విచక్షణతో వ్యవహరించకుండా ప్రైవేట్ వ్యక్తి స్థలంలో బోరు వేసి మోటారు బిగించారు. అప్పటివరకు మౌనంగా ఉన్న ఆ వ్యక్తి బోరు తన భూమిలో వేసినందున తనకే చెందుతుందని నీటిని సొంతానికి వాడుకుంటున్నారు. కనీసం గుడి అవసరాలకు కొద్దిపాటి నీరు కూడా ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక పూజారులు మౌనంగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమంగా బోరువేసిన విషయం బయటపడింది.

ప్రైవేట్ వ్యక్తి నీరు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను వివరణ కోరగా, ఆ బోరును ప్రభుత్వ నిధులతో వేసిన మాట వాస్తవమేనన్నారు. ప్రైవేట్ వ్యక్తి స్థలంలో బోరు వేసిన విషయాన్ని అప్పటి అధికారులు గుర్తించలేదన్నారు. ఆ వ్యక్తితో చర్చించి గుడి అవసరాలకు నీరు ఇప్పించే ఏర్పాటు చేస్తామన్నారు.

స్వయంకృషితో యువత రాణించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి


జాతీయజెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, కూటమి నాయకులు

కనిగిరి, ఆగస్టు 13: యువతీ యువకులు స్వయంకృషితో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. గురువారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముందస్తుగా ప్రముఖులు, వ్యాపారస్థులు, పార్టీ నాయకులతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటిపై త్రివర్ణపతాకం ఎగురవేయాలన్నారు. అమరవీరుల త్యాగాలను ప్రతిఒక్కరికీ తెలియజేయాలన్నారు. అందుకోసం తన వంతు బాధ్యతగా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు జాతీయ నాయకుల గొప్పతనాన్ని తెలియచేసేలా వారి చరిత్రలపై వ్యాసరచన, టాలెంట్‌టెస్ట్‌లను నియోజకవర్గంలోని ఆనే మండలాల్లోని హైస్కూల్‌లలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం విధ్వంస పాలనతో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని ధ్వజమెత్తారు. అందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం ఎలాంటి ఆర్భాటాలకు తావు లేకుండా అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర చెప్పారు. సమావేశంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాదాల పరిష్కారం తర్వాతే నష్టపరిహారం


రైతులతో మాట్లాడుతున్న అధికారులు

తాళ్లూరు, ఆగస్టు 13: కోటికొండ-ముప్పవరం ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు సంబంధించిన వివాదాలు పరిష్కారం తర్వాతే నష్టపరిహారం జమ చేస్తామని ఎక్స్‌ప్రెస్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరకుమార్ తెలిపారు. నష్టపరిహారం అందని రైతులతో మంగళవారం తాళ్లూరు రైతు సేవా కేంద్రంలో ఎక్స్‌ప్రెస్ హైవే అధికారులతో మాట్లాడారు. మండలంలోని పలుగ్రామాల్లో ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు నిర్మాణంలో రైతులు భూములు కోల్పోయారు. సంబంధిత భూమికి సంబంధిన వివరాలను సేకరించి నష్ట పరిహారం చెల్లించారు. నష్ట పరిహారం అందని రైతుల వద్ద ఉన్న భూమి రికార్డులను పరిశీలించారు. రికార్డులపరంగా భూమి యజమానుల పేర్లు ఆన్‌లైన్‌లో ఉంటేనే నష్టపరిహారం అందుతుందని వరకుమార్ చెప్పారు. కోర్టు వివాదాలు, భూసమస్యలు ఉంటే, అవి పరిష్కారమయ్యే వరకు నష్టపరిహారం జమ జరగదన్నారు. భూవివాదాలు, కోర్టు వివాదాలు పరిష్కారమయ్యాకే రైతులకు నష్ట పరిహారం జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎక్స్ ప్రెస్ హైవే డీటీ రాజు, తహసీల్దార్ సింగారావు, డీటీలు ఇమ్మానియేల్‌రాజు, ప్రశాంత్, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో అక్రమాలపై చర్యలు

- పీడీ అర్జునరావు
- ప్రజావేదికలో వెలుగుచూసిన వైనం


ప్రజా వేదికలో పాల్గొన్న పీడీ అర్జునరావు, అధికారులు

ముండ్లమూరు, ఆగస్టు 13: ఉపాధిలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ అర్జునరావు తెలిపారు. మంగళవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయం వద్ద జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఏపీవో కె.నాగరాజు అధ్యక్షత వహించారు. 2023 - 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం ద్వారా 21 గ్రామ పంచాయతీల్లో పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. పది రోజుల పాటు ఆయా గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీ సభలు నిర్వహించారు. మంగళవారం మండల స్థాయిలో జరిగిన సామాజిక తనిఖీలో రూ.2,17,33,401 మేర అవినీతి జరిగినట్టు వెల్లడైంది. గ్రామ పంచాయతీల వారీగా పరిశీలిస్తే.. ముండ్లమూరులో రూ.48,56,643, నాయుడుపాలెంలో రూ.10,80,942, కెల్లంపల్లిలో 15 లక్షల 108 రూపాయలు, నూజెండ్లపల్లిలో .9 లక్షల 148 రూపాయలు, పోలవరంలో 28 లక్షల 764 రూపాయలు అవినీతి జరిగినట్టు పీడీ అర్జునరావు తెలిపారు. అలాగే, సింగనపాలెంలో రూ.8,76,119, పులిపాడులో రూ.14,16,868, ఈదరలో రూ.11,11,978, శంకరాపురంలో రూ.9,23,742, జమ్మలమడకలో రూ.4,31,394, పసుపుగల్లు రూ. 28,97,864 అవినీతి జరిగినట్టు వెల్లడైంది. పూరిమెట్లలో రూ.13,34,539, ఉమామహేశ్వర అగ్రహారంలో రూ.5,83,942, మారెళ్లలో రూ.16,34,091, భీమవరంలో రూ.6,00,502, వేములలో రూ.22,97,018, బొప్పూడివారిపాలెంలో 5 లక్షల 506 రూపాయలు, వేములబండలో 1002 రూపాయలు అవినీతి జరిగినట్టు పీడీ అర్జునరావు తెలిపారు.

2023 - 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.13,43,12,158 జరిగిన పనుల్లో రూ.2,17,33,401 అవినీతి జరిగినట్టు సామాజిక తనిఖీల్లో వెల్లడైందని, ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తప్పవని పీడీ అర్జునరావు తెలిపారు. నివేదికలు అందిన వెంటనే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పథకం ద్వారా పని కల్పించాలని ఆదేశాలు ఇస్తున్నామన్నారు. అయితే, ఇష్టానుసారంగా ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సిబ్బంది కలసి అవినీతికి పాల్పడటం నేరమని తెలిపారు.

కార్యక్రమంలో జిల్లా డ్వామా విజిలెన్స్ అధికారిణి ఝాన్సీరాణి, ఏపీడీ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో ఆర్.జనార్దన్, ఏపీవోలు కె.నాగరాజు, కొండయ్య, మురళీ, ఈసీ ప్రసాద్, టెక్నిల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

మాన్యం భూములను దేవుడి పేరుపై ఆన్‌లైన్ చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఈవో నరసింహబాబు

పామూరు, ఆగస్టు 13: మాన్యం భూములను దేవుడి పేరుపై ఆన్‌లైన్ చేయాలని దేవస్థాన ఈవో గిరిరాజు నరసింహబాబు మంగళవారం తహసీల్దార్ బీవీ రమణరావుకు వినతిపత్రం అందజేశారు. పామూరు ప్రాంతంలో మదన వేణుగోపాలస్వామి, వల్లి భుజంగేశ్వర స్వామి, వరదరాజులు, అంజనేయ స్వామి వార్లకు పామూరు పరిసర ప్రాంతాల్లో భూములు ఉన్నాయి. వీటి వివరాలను రెవెన్యూ రికార్డుల్లో పరిశీలించి స్వామి వార్ల పేరుపై ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. ఎండోమెంట్ జిల్లా అధికారి కె.జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయా భూముల్లో ఉన్న ఆక్రమణదారులపై చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు.

కాగా, అర్చక, భజంత్రీ, దేవదాశి, మద్దెలకు చెందినవారు దేవాలయానికి సేవలు చేసి ఆ భూములపై వచ్చే కౌలును మాత్రమే అనుభవించాలి తప్ప క్రయవిక్రయాలకు హక్కు లేదని ఎండోమెంట్ జిల్లా అధికారి కె.జనార్దన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం కొంతమంది పామూరులో దేవుడు మాన్యం భూములను అన్యాక్రాంతం చేసి ప్లాట్లు వేసి అమ్మకాలు చేపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. అర్చకులు, భజంత్రీలు, దేవదాసి, మద్దెల వద్ద సర్వీస్ ఇనాం భూములు కొంటే చెల్లవని సూచించారు. దేవస్థాన భూములను దేవుడిపై ఆన్‌లైన్ చేసి 22ఏ 1సీగా నిషేధిత భూములుగా చేర్చాలని రెవెన్యూ అధికారులను కోరినట్లు ఈవో నరసింహబాబు తెలిపారు.

మురుగు కాల్వలను రెండురోజుల్లో బాగుచేస్తాం

తాళ్లూరు, ఆగస్టు 13: మండలంలోని తూర్పుగంగవరం గ్రామంలో నిర్మాణ పనుల కోసం పూడ్చిన కాల్వలను రెండురోజుల్లో తొలగిస్తామని పంచాయతీ కార్యదర్శి టి.అజయ్‌కీర్తి తెలిపారు. 'మురుగు కాల్వల పూడ్చివేత' శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి వివరణ ఇచ్చారు. కాల్వలను పూడ్చిన యజమానులతో మాట్లాడగా మురుగునీరు ప్రవహించేందుకు వీలుగా పైపు లైన్లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారని అజయ్‌కీర్తి తెలిపారు. రెండు రోజుల్లో కాల్వల పూడ్చివేతను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని తెలిపారు.

గ్రామ సచివాలయానికి ఫ్రీజర్ బాక్స్ బహూకరణ

తాళ్లూరు, ఆగస్టు 13: తూర్పుగంగవరం గ్రామ సచివాలయానికి జాష్టి శ్రీనివాసరావు డెడ్‌బాడీ ఫ్రీజర్ బాక్స్‌ను మంగళవారం బహూకరించారు. గ్రామం లో మృతి చెందిన వారిని బంధువులు వచ్చేవరకు భద్రపరిచేందుకు ఫ్రీజర్ బాక్స్‌లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో గ్రామానికి చెందిన జాష్టి శ్రీనివాసరావు తన వంతు సహాయం చేసేందుకు ముందుకు వచ్చారు. రూ.60 వేలు వెచ్చించి డెడ్ బాడీ ఫ్రీజర్‌ను కొనుగోలు చేసి గ్రామ పంచాయతీ కార్యదర్శి అక్షయ్‌కీర్తికి అప్పగించారు. కార్యక్రమంలో గోపిరెడ్డి వెంకటేశ్వర‌రెడ్డి, చాట్ల ఇమ్మానియేల్, గ్రేడ్-5 కార్యదర్శి ఆదామ్, గ్రామసచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులతో గ్రామ పంచాయతీలకు ఆదాయం

ముండ్లమూరు, ఆగస్టు 13: డంపింగ్ యార్డులతో గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని ఎంపీడీవో జనార్దన్ అన్నారు. మండలంలోని సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు రెండవ రోజు జరిగిన శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం డంపింగ్ యార్డులను పరిశీలించారు. మండలంలోని పెద ఉల్లగల్లులో డంపింగ్ యార్డును పరిశీలించిన బృందం సర్పంచ్‌లకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో జనార్దన్ మాట్లాడుతూ సర్పంచ్‌లు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ శ్రీదేవి, సర్పంచ్‌లు జనమాల నాగేంద్రం పిచ్చయ్య, జమ్ముల గురవయ్య, వరగాని బాల సుందరరావు, ముక్కమళ్ళ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలు వసూలుచేయాలి

ముండ్లమూరు, ఆగస్టు 13: మండలంలో పేరుకుపోయిన విద్యుత్ బకాయిలను స్పెషల్ డ్రైవ్ ద్వారా వసూలు చేయాలని దర్శి డివిజన్ విద్యుత్ ఏడీఈ కె.పిచ్చయ్య పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం మారెళ్ళ, ముండ్లమూరు సబ్‌స్టేషన్‌లను సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. మండలంలో రైతులకు తొమ్మిది గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. వ్యవసాయ కనెక్షన్‌ల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు మంజూరు చేస్తామన్నారు. గృహాల మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్‌లను మారుస్తామన్నారు. వినియోగదారులు ప్రతినెలా బిల్లును ఫోన్‌పే ద్వారా కూడా చెల్లించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈ వీరబ్రహ్మం, లైన్‌ఇన్‌స్పెక్టర్ సాంబయ్య, లైన్‌మెన్‌లు ఆంజనేయులు, నాయక్, కోటేశ్వరరావు, మస్తాన్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటిమీద జాతీయజెండా ఎగురవేయాలి

పీసీపల్లి, ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ప్రతి ఇంటిమీద జాతీయ జెండాను ఎగరవేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు దగ్గుమాటి బలరాంరెడ్డి అన్నారు. మండలంలోని పెదయిర్లపాడు పాఠశాలలో మంగళవారం జాతీయ జెండాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలు, సేవలను భావితరాలకు వివరించాలన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5

బుధవారం 14 ఆగస్టు 2024

ఎంపీడీవోలు వచ్చేశారు

- 30 మండలాలకు నియామకం
- గుంటూరు జడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీ

నరసరావుపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 30 మండలాలకు ఎంపీడీవోలను నియమించారు. ఈ మేరకు జిల్లా పరిషత్ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ప్రకాశం, కృష్ణాజిల్లాకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఎంపీడీవోలను బదిలీ చేసిన విషయం తెలిసిందే. వీరందరిని తిరిగి ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మండలాలకు నియమించారు. మండలాల వారీగా ఎంపీడీవోల వివరాలు..

పేరు	మండలం	జిల్లా
పీ ఉమాదేవి	అమరావతి	పల్నాడు
ఎస్ వెంకటేశ్వరరావు	నరసరావుపేట	పల్నాడు
పీ శివసుబ్రమణ్యం	అచ్చంపేట	పల్నాడు
షేక్ గౌసీయాబేగం	బొల్లాపల్లి	పల్నాడు
కే సమతావాణి	దుర్గి	పల్నాడు
వై హనుమరెడ్డి	యడ్లపాడు	పల్నాడు
ఆర్ఈవీ ఫణికుమార్	గురజాల	పల్నాడు
బీ మహేష్‌బాబు	క్రోసూరు	పల్నాడు
పీ పుట్టారెడ్డి	ముప్పాళ్ల	పల్నాడు
బీ శ్రీనివాసరెడ్డి	నకరికల్లు	పల్నాడు
కే నరసింహారావు	పెదకూరపాడు	పల్నాడు
జీ కాశయ్య	పిడుగురాళ్ల	పల్నాడు
కే మాథ్యూబాబు	రొంపిచర్ల	పల్నాడు
జీ సత్యనారాయణ	సత్తెనపల్లి	పల్నాడు
వీ సీతారామయ్య	శావల్యాపురం	పల్నాడు
ఎం శ్రీదేవి	వెల్దుర్తి	పల్నాడు
ఎం శోభారాణి	దాచేపల్లి	పల్నాడు
వై మహాలక్ష్మి	రెంటచింతల	పల్నాడు
టీ సుగుణమ్మ	చుండూరు	బాపట్ల
షేక్ మహబూబ్‌సుభాని	అమృతలూరు	బాపట్ల
ఐ సత్యనారాయణ	కొల్లూరు	బాపట్ల
జీ చంద్రశేఖరరావు	భట్టిప్రోలు	బాపట్ల
కే నాగలక్ష్మి	నిజాంపట్నం	బాపట్ల
బీ మారుతీశేషమాంబ	పిట్టలవానిపాలెం	బాపట్ల
కే శివపార్వతి	రేపల్లె	బాపట్ల
ఏ దీప్తి	తాడికొండ	గుంటూరు
ఏ శ్రీనివాసరావు	పొన్నూరు	గుంటూరు
బీ బాబురావు	చేబ్రోలు	గుంటూరు
పీజే విలియమ్స్	మంగళగిరి	గుంటూరు
వీ విజయలక్ష్మి	కొల్లిపర	గుంటూరు

అన్న క్యాంటీన్లు.. సిద్ధం

జిల్లాలో నాలుగు చోట్ల ఏర్పాటు

బాపట్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం అన్న క్యాంటీన్ల ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. దానిలో భాగంగా గురువారం వాటిని ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. తొలి విడతలో భాగంగా జిల్లాలో 4 చోట్ల క్యాంటీన్లు ఏర్పాటు చేసి పేదల ఆకలిని తీర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేవలం ఐదు రూపాయలకే టిఫిన్, భోజనాన్ని ఈ క్యాంటీన్ల ద్వారా ప్రజలకు అందుబాటులోకి తేనున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పురుడు పోసుకున్న ఈ పథకాన్ని వైసీపీ అధికారంలోకి రాగానే రద్దు చేసి పేదల పొట్ట కొట్టిన సంగతి తెలిసిందే. అధికారంలోకి వచ్చిన తర్వాత తిరిగి అన్న క్యాంటీన్లను పునరుద్ధరిస్తామని చెప్పిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం వాటికి శ్రీకారం చుట్టింది.

జిల్లాలో ఏర్పాటు చేసేది ఇక్కడే..

అద్దంకిలోని ఎన్ఎస్‌పీ కార్యాలయం ప్రాంగణంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయనున్నారు. బాపట్లలో మీ సేవ వెనుక ప్రాంతంలో, చీరాలలోని వాసవి క్లాత్ మార్కెట్ ఎదుట, రేపల్లెలో అంబేడ్కర్ పార్కు ఎదుట అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లోని అన్న క్యాంటీన్లు ప్రారంభానికి సిద్ధమయ్యాయి.

హాస్టళ్లలో.. హాహాకారాలు





భోజనం సక్రమంగా అందదు.. తలకు నూనె లేదు.. కప్పుకోవడానికి దుప్పటి లేదు.. లైటు కాలిపోతే మార్చే దిక్కులేదు.. మరుగుదొడ్ల నిర్వహణ లేదు.. ఇదీ ఉమ్మడి గుంటూరు పరిధిలోని హాస్టళ్లలో తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ చదువుకుంటోన్న విద్యార్థుల పరిస్థితి. ప్రభుత్వం నుంచి భోజన బిల్లులు విడుదల కాక.. వారికి సక్రమంగా ఆహారం అందక అర్ధాకలితో అలమటిస్తున్నారు. అయినా గత వైసీపీ పాలకులు.. ప్రస్తుత కూటమి పాలకులకు పట్టడంలేదు. పిల్లల ఆకలి కేకలు చూడలేక కొందరు సంక్షేమాధికారులైన హాస్టళ్ల నిర్వాహకులు అప్పులు చేసి ఆహార పదార్థాలను అందజేస్తున్నారు. వారు కూడా అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో సంక్షేమం సంక్షోభంలో చిక్కుకుపోయింది. వైసీపీ ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలపై నిర్లక్ష్యం చూపించింది. దీంతో వసతిగృహాలు సమస్యల వలయంలో చిక్కుకుపోయాయి. ఇక విద్యార్థులకు ఇవ్వాల్సిన కాస్మోటిక్ చార్జీలు, దుప్పట్లు, ఇతర సామగ్రి, చివరకు నోటు పుస్తకాలు వసతిగృహాలు ప్రారంభమై రెండు నెలలు దాటుతున్నా ఇంతవరకు వారికి అందలేదు. సంక్షేమ వసతి గృహాల్లోని సమస్యలతో అల్లాడు తున్న విద్యార్థులకు గత కొన్ని నెలలుగా ఆహారం కూడా సమస్యగా మారింది. ఇక హాస్టళ్ల నిర్వహణకు విడుదల కావాల్సిన కనీస నిధులు విషయంలోనూ ప్రభుత్వం అలక్ష్యం ప్రదర్శిస్తోంది.

- అర్ధాకలితో విద్యార్థుల అవస్థలు
- జనవరి నుంచి విడుదల కాని భోజన బిల్లులు
- వసతి గృహాల బిల్లుల బకాయి రూ.10 కోట్లు పైమాటే
- కాస్మోటిక్ చార్జీలు, దుప్పట్లు, సామగ్రి అంతే సంగతులు
- కూటమి ప్రభుత్వం వచ్చినా ఇంకా సంక్షేమం సంక్షోభమే

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థుల సంక్షేమం సంక్షోభంలో చిక్కుకుంటోంది. పాలకుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ వసతిగృహాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. పేద విద్యార్థులపై కనికరం చూపడం లేదన్న విమర్శలు తల్లిదండ్రులతో పాటు విద్యార్థి సంఘాల నుంచి వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం మొక్కుబడిగా వసతి గృహాలను నిర్వహిస్తోందన్న విమర్శలున్నాయి. పదో తరగతి లోపు, కళాశాల విద్యార్థులకు సంబంధించి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో పది వేలకుపైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతిగృహాలు ఉన్నాయి. జనవరి నుంచి భోజన బిల్లులు చెల్లించలేదు. రూ.10 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయి. ఎస్సీ, బీసీ, ఎస్టీ విద్యార్థులకు అందాల్సిన సౌకర్యాలకూ ప్రభుత్వం గండి కొడుతున్నది. కూరగాయలు, సరుకులు, గ్యాస్, పాలు అప్పు పద్ధతిలో కొనుగోలు చేసి బిల్లులు విడుదలైన సమయంలో వాటిని వసతి గృహాల అధికారులు సంబంధిత దుకాణదారులకు చెల్లించే వారు. వంద మంది విద్యార్థులు ఉన్న వసతిగృహానికి నెలకు రూ.1.40 లక్షలు భోజన బిల్లుగా చెల్లించాలి. అయితే జనవరి నుంచి ఆయా బిల్లులు విడుదల చేయకపోవడంతో సంక్షేమాధికారులు విద్యార్థుల ఆకలి తీర్చలేకపోతున్నారు. ఏడు నెలలకు పైగా వారు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. దుకాణాల్లో సరుకులు తేవాలని ప్రయత్నాలు చేస్తున్నా వారికి అప్పు పుట్టడంలేదు. అప్పులకు వడ్డీలు పెరుగుతుండటంతో నిర్వహణ అధికారులు ఆర్థిక వేతలు ఎదుర్కొంటున్నారు. బిల్లుల చెల్లింపుల్లో ఇలానే జాప్యం జరిగితే విద్యార్థులు భోజనాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి రానున్నది. వసతి గృహాలకు ప్రభుత్వం చెల్లించే సరుకుల ధరలకు మార్కెట్‌లో ఉన్న ధరలకు పొంతన ఉండటంలేదు. దీంతో నిర్దేశించిన భోజన పట్టిక(మెనూ)ను అమలు చేయలేక నిర్వహణ అధికారులు చేతులెత్తేస్తున్నారు. పాఠశాల స్థాయి విద్యార్థులకు నెలకు రూ.2,200 ఖర్చు అవుతుంటే ప్రభుత్వం రూ.1,400 చెల్లిస్తోంది. కళాశాల స్థాయి విద్యార్థులకు నెలకు రూ.1,600 చెల్లిస్తోంది. వీరికి ఉదయం టిఫిన్, రెండు పూటల భోజనం అందించాలి. కళాశాలల విద్యార్థులకు రోజుకు రూ.53.33, స్కూల్ విద్యార్థులకు రోజుకు రూ.46.66కు భోజనం, ఉదయం టిఫిన్ అందించాలి. పప్పులు, కూరగాయలు నూనె, గ్యాస్ అన్ని వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. అయితే ఆ స్థాయిలో ప్రభుత్వం వసతి గృహాలకు బడ్జెట్ పెంచడంలేదు. దీంతో నిర్దేశించిన భోజన పట్టిక(మెనూ)ను అమలు చేయలేక నిర్వహణ అధికారులు చేతులెత్తేస్తున్నారు. మార్కెట్‌లో ధరలను పరిశీలిస్తే ప్రభుత్వం చెల్లించే ధరకు ఆహార పదార్థాలను అందించలేని పరిస్థితి. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని పాలకులు చెబుతున్నా ఆచరణలో ఎక్కడా కనిపించడంలేదు. మెనూ ప్రకారం ఇవ్వాలంటే తమ జీతాలు కూడా సరిపోవని కొందరు నిర్వాహకులు వాపోతున్నారు. ప్రభుత్వం వసతి గృహాలలో భోజనానికి సంబంధించి మార్కెట్ కనుగుణంగా సరుకుల ధరలు పెంచకుండా విద్యార్థుల కడుపు కాల్చుతోంది. అసలే అరకొరగా నిధులు కేటాయించినా వాటిని సకాలంలో విడుదల చేయకపోవడంతో విద్యార్థులకు ఆహార పదార్థాలు సక్రమంగా అందడంలేదు.

బియ్యం కొనుగోలుకు చేయాల్సిందే..

వసతి గృహాలకు డీలర్ల ద్వారా బియ్యం పంపిణీ చేసే విధానాన్ని వైసీపీ ప్రభుత్వం ఎత్తి వేసింది. కిలో రూపాయి చొప్పున డీడీ రూపంలో చెల్లిస్తేనే బియ్యాన్ని వసతి గృహాలకు సరఫరా చేస్తారు. ఎంఎల్ఎస్ పాయింట్‌లో డీడీ అందజేసి బియ్యం వసతి గృహాలకు తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వసతిగృహాల నిర్వహణ అధికారులు సొంతంగా నగదు చెల్లించి బియ్యం కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. గ్యాస్ సిలెండర్ అప్పు లభించే పరిస్థితి లేదు. దీంతో దానిని కూడా నిర్వాహకులే కొనుగోలు చేస్తున్నారు. సరుకులు, పాలు, కూరగాయలు అప్పుపై సరఫరా చేసే అవకాశం ఉంది. అయితే నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో కొన్ని వసతి గృహాలకు వాటి సరఫరా నిలిచిపోయింది.

కనీస వసతులకూ నిధులు లేవాయే

ఆహారం, కాస్మోటిక్ చార్జీలు, సామగ్రి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ఎదో ఒకలా జరిగిపోతుంది. అయితే వసతి గృహాల నిర్వహణకు కూడా కొన్ని నెలలుగా నిధులు విడుదల కావడంలేదు. చివరకు హాస్టల్‌లో కరెంటు బల్బు మాడిపోయినా దానిని మార్చాలన్నా వార్డెన్లు వారి జేబులో నుంచి ఖర్చు చేయాల్సిందే. మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి, ఇతర మరమ్మతులకు కూడా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడంలేదని వార్డెన్లు వాపోతున్నారు. వైసీపీ పాలనలో వసతి గృహాలపై నిర్లక్ష్యపు గ్రహణం పట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వసతి గృహాలకు మహర్దశ పడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశించారు. అయితే కూటమి ప్రభుత్వంలో కూడా వసతి గృహాల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో తల్లి దండ్రుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

కాస్మోటిక్ చార్జీలూ కష్టమే..

ప్రభుత్వం వసతి గృహాల విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలను నెలవారీగా చెల్లించాలి. అయితే జనవరి నుంచి ఆ చార్జీలు ఇవ్వడం లేదు. దీంతో విద్యార్థులు తలకు నూనె కొనాలన్నా, స్నానానికి సబ్బు కావాలన్నా ఇంటి వైపు చూడక తప్పడం లేదు. కాస్మోటిక్ చార్జీల కింద 3 నుంచి 6వ తరగతి బాలికలకు రూ.110, బాలురకు రూ.100 అందజేయాలి. 7 నుంచి 10వ తరగతి బాలికలకు రూ.160, బాలురకు రూ.125 చొప్పున చెల్లించాలి. బాలురకు రూ.30 చొప్పున హెయిర్ కటింగ్ చార్జీ అదనంగా విడుదల చేయాలి. అయితే ఇవేవీ ప్రభుత్వం చెల్లించకపోతుండటంతో విద్యార్థులు తల్లిదండ్రులపై ఆధారపడుతున్నారు. ఇది వారికి భారంగా మారుతోంది. విద్యా సంవత్సరం ప్రారంభంలో వసతి గృహాల్లో చేరే విద్యార్థులకు కొంత సామగ్రిని ప్రభుత్వం పంపిణీ చేయాలి. అయితే వసతి గృహాలు తెరిచి రెండు నెలలు గడిచినా నేటి వరకు నోట్ పుస్తకాలు, దుప్పట్లు, ప్లేట్, గ్లాసు, ట్రంక్ పెట్టె తదితర సామగ్రిని నేటి వరకు విద్యార్థులకు అందజేయలేదు.

నరసరావుపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం



అట్టహాసంగా.. హర్ ఘర్ తిరంగ

- ఆకట్టుకున్న 50 మీటర్ల జాతీయ జెండాతో ప్రదర్శన
- దేశ సార్వభౌమత్వాన్ని కాపాడాలన్న ఎమ్మెల్యే వేగేశన



తిరంగా రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, కమిషనర్ వి.నిర్మల్‌కుమార్

బాపట్ల, ఆగస్టు 13: విద్యార్థుల దేశభక్తి నినాదాలు.. 50 మీటర్ల జాతీయ జెండా ప్రదర్శనతో బాపట్లలో మంగళవారం హర్ ఘర్ తిరంగ కార్యక్రమం ఆకట్టుకుంది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్‌ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా స్థానిక మున్సిపల్ హైస్కూల్ వద్ద ర్యాలీని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ప్రారంభించారు. ఈ ర్యాలీ గడియారస్తంభంసెంటర్ మీదగా అంబేద్కర్ సర్కిల్ చేరుకుని అక్కడి నుంచి భావన్నారాయణస్వామి దేవాలయం, తహసీల్దార్ కార్యాలయం మీదగా తిరిగి హైస్కూల్‌కు చేరుకుంది. విద్యార్థులు 50 మీటర్ల జాతీయ జెండాను ప్రదర్శిస్తూ ర్యాలీకి అగ్రభాగాన నిలిచారు. ఈ సందర్భంగా నరేంద్రవర్మ మాట్లాడుతూ దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను కాపాడాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ, ఎంఈవో ఎస్.నిరంజన్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు మందపాటి అంద్రేయ, భోగిరెడ్డి రమేష్‌రెడ్డి, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజని, కూచిపూడి ఝాన్సీరాణి, షేక్.నజ్మా, మండల మహిళా అధ్యక్షురాలు కాగిత నాగభూషణమ్మ, బీజేపీ నాయకులు మామిడి రమేష్‌కుమార్, బాలనారాయణ, వల్లూరి భావన్నారాయణ, మాజీ ఎంపీపీ యోహాను, మోదుగుల శంకరరెడ్డి, జి.గిరిజారాణి, ఎన్‌సీసీ ఆఫీసర్ కత్తి శ్రీనివాసరావు, పట్టణ సీఐ అహ్మద్‌జానీ పాల్గొన్నారు.



తిరంగా రన్‌లో 50 మీటర్ల జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

బాధితులకు లోకేశ్ భరోసా



దివ్యాంగుల సమస్యలు వింటున్న మంత్రి లోకేశ్



తాడేపల్లి టౌన్, ఆగస్టు 13: ఉండవల్లిలోని నివాసంలో మంగళవారం 25వ రోజు జరిగిన ప్రజా దర్బార్‌కు మంగళగిరితోపాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మంత్రి లోకేశ్‌ను నేరుగా కలిసి తమ సమస్యలు విన్నవించారు. ప్రతి ఒక్కరి విజ్ఞప్తి పరిశీలించిన మంత్రి సత్వర పరిష్కారానికి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లిలోని జామాయిల్‌తోట ప్రాంతంలో 300 మీటర్ల సిమెంటు రోడ్డు నిర్మాణంతోపాటు డ్రైనేజి సదుపాయం కల్పించాలని పి.సంపత్‌కుమార్ నారా లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తనకు ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన తిరువీధుల నాగశ్రావణి కోరారు. రోడ్డు ప్రమాదంలో తమ కుమారుడు మృతిచెందాడని ప్రమాదబీమా చెల్లింపుల్లో ఎదురవుతు న్న ఇబ్బందులను తొలగించాలని దుగ్గిరాలకు చెందిన ఎస్ దుర్గామల్లేశ్వరి విజ్ఞప్తి చేశారు. బ్రెయిన్‌ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్న తన కుమార్తెకు వైద్యసాయం అందించడంతోపాటు పెన్షన్ మంజూరుచేసి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన మహ్మ ద్ అబ్దుల్ ముజీవ్ విజ్ఞప్తి చేశారు. అద్దె ఇంటిలో జీవనం సాగిస్తున్న తనకు ఎ లాంటి ఆధారం లేదని ఇల్లు మంజూరు చేయాలని పోలకంపాడుకు చెందిన మోక నారాయణమ్మ కోరారు.





బాపట్లలో రెండు రాష్ట్రాల వేద సదస్సు



రెండు రాష్ట్రాల వేదసదస్సులో పండితులు, వేద విద్యార్థులు

బాపట్ల, ఆగస్టు 13: విశ్వాన్ని నడిపించగల మహత్తరమైన సంకల్పం సర్వజగత్తును నడిపించగల శక్తి ఒక్క వేదనాదానికి ఉందని మహర్షుల భావన అని, అటువంటి వేదనాద వ్యాప్తికి ప్రతి ఒక్కరు కృషిచేయాల్సిన అవసరం ఉందని పలువురు పండితులు అభిప్రాయపడ్డారు. శ్రీశంకర విద్యాలయ వ్యవస్థాపకులు శ్రీబ్రహ్మానంద తీర్థస్వామి 145వ జయంతి ఉత్సవాలలో భాగంగా బాపట్లలోని శ్రీశంకర విద్యాలయంలోని వేదపాఠశాలలో మూడురోజులపాటు జరిగిన రెండు తెలుగు రాష్ట్రా ల వేదసదస్సులో అనేకమంది పండితులు పాల్గొని ప్రవచనాలు చేశారు. 40మంది వేదపండితులు, వేదపాఠశాల విద్యార్థులు పాల్గొన్న ఈ సదస్సుకు కపిలవాయి రామశాస్త్రి అధ్యక్షత వహించగా గుళ్ళపల్లి చినఆంజనేయ ఘనాపాటి, తిరుమల తిరుపతి దేవస్థానంవారు పర్యవేక్షకులుగా వ్యవహరిచారు. వేదనాదాలతో ప్రతిధ్వనిం చే ఏ క్షేత్రంలోనైనా దేవతలు కొలువై ఉంటారన్నారు. రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అత్యుత్తమ వైదిక సంస్కృతి, ఆధ్యాత్మికత విద్య, విజ్ఞాన విద్యావ్యాప్తికి ప్రబోధ ప్రచారాల ద్వారా నాటి మహాతపస్వి పరమహంస పరివ్రాజకాచార్య బ్రహ్మానంద తీర్థస్వామి తెలుగురాష్ట్రాలలో విశేషంగా కృషిచేశారని కొనియాడారు. కొన్నివేలమంది పండితులుగా తయారుకావటానికి ఈ పాఠశాలలు అందించిన విద్యాబోధన ఉపకరించిందన్నారు. కార్యక్రమంలో శ్రీశంకర విద్యాలయ వేదపాఠశాల నిర్వాహకులు శిఖరం భుజగేంద్రమౌళి, చలపతిరావు, బి.బాబునాగేంద్ర, పండితులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు అరుదైన ఆహ్వానం



నాగమణి

బల్లికురవ, ఆగస్టు 13 : స్వాతంత్ర వేడుకల్లో పాల్గొనాలని ఢిల్లీ నుంచి బల్లికురవ మండలం కొత్తమల్లాయ పాలెం అంగన్‌వాడీ కార్యకర్త జీ నాగ మణికి ఆహ్వానం అందింది. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు జిల్లాల నుంచి ఐదు గురు అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆగస్టు 15న జరగనున్న వేడుకలలో పాల్గొనాలని ఢిల్లీ నుంచి పిలుపు వచ్చింది. బాపట్ల జిల్లా సంతమాగు లూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు తరపున కొత్త మల్లాయపాలెం అంగన్‌వాడీ కార్యకర్త విధుల్లో తనవంతు విశేష కృషి చేస్తుండడంతో ప్రభుత్వం గుర్తించి ఈ అవకాశం ఇచ్చింది. పోషణ్ స్కీం అమలులో బాధ్యతగా పనిచేసిన అయిదుగురికి ఆహ్వానం లభిం చింది. అంగన్‌వాడీ కార్యకర్త నాగమణిని ప్రాజెక్టు సీడీపీవో సుధ, సూప ర్వైజర్లు విజయనిర్మల, సహచర కార్యకర్తలు అభినందించారు.

నేటి నుంచి శ్రీశైలానికి అదనపు బస్సు

4 మండలాల ప్రయాణికులకు సౌకర్యం

అద్దంకి, ఆగస్టు 13 : అద్దంకి నుంచి శ్రీశైలంకు బుధవారం నుంచి అదనంగా బస్ సర్వీసును నడుపనున్నట్లు డీఎం బెల్లం రామ్మోహన రావు తెలిపారు. అద్దంకి, ముండ్లమూరు, తాళ్లూరు, దర్శి మండలాల లోని పలు గ్రామాల ప్రజలు నేరుగా శ్రీశైలం వెళ్లేందుకు బస్ సర్వీసును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అద్దంకిలో ఉదయం 6-30 గంటలకు బయలుదేరి ముండ్లమూరు, తాళ్లూరు, తూర్పుగంగవరం, బొద్దికూర పాడు, రాజంపల్లి మీదుగా పొదిలికి 8-50 గంటలకు చేరుతుందన్నారు. అక్కడ 9-15కి బయలుదేరి మార్కాపురం మీదుగా మధ్యాహ్నం 1 గంటకు శ్రీశైలం చేరుతుందన్నారు. తిరుగు ప్రయాణంలో శ్రీశైలంలో మధ్యాహ్నం 2-15 గంటలకు బయలుదేరి పొదిలి 6-15 గంటలకు చేరు తుందన్నారు. అక్కడ నుంచి 6-30 గంటలకు బయలుదేరి రాజంపల్లి, బొద్దికూరపాడు, తూర్పుగంగవరం, తాళ్లూరు, ముండ్లమూరు మీదుగా రాత్రి 9 గంటలకు అద్దంకికి చేరుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం రామ్మోహనరావు కోరారు.

సింథైట్ ఫ్యాక్టరీ పరిశీలన



ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాఘవరెడ్డి

మేదరమెట్ల, ఆగస్టు 13 : మేదరమెట్లలోని సింథైట్ ఫ్యాక్టరీని జాయింట్ కలెక్టర్ బీ సుబ్బారావు ఆదేశాల మేరకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాఘవరెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. మంగళ వారం మేదరమెట్లలో సింథైట్ ఫ్యాక్టరీకి వచ్చిన రాఘవరెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, అద్దంకి రూరల్ సీఐ శివరామకృష్ణారెడ్డితో కలిసి ఫ్యాక్టరీలోని వివిధ విభాగాలను పరిశీలించారు. మిరపకాయలను పొడి చేసే విభాగాన్ని పరిశీలించి కోరు రాకుండా కొత్తగా అక్కడ చేస్తున్న పనులను పరిశీలించారు. బాయిలర్ విభాగానికి కూడా ఆయన అధికా రులతో వెళ్లారు. ఫ్యాక్టరీని ఆపివేసి కోరు రాకుండా చేస్తున్న పనులను ఫ్యాక్టరీ ప్రతినిధులు వారికి వివరించారు. పరిసరాల్లో 200 చెట్లు నాటా లని నిర్ణయించారు. ఆర్ఐ పోతురాజు, వీఆర్వో రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు వసతులు కల్పించకుంటే చర్యలు

చట్టాలపై అవగాహన ఉండాలి : న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి

బల్లికురవ కస్తూర్బాలో ఆకస్మిక తనిఖీ



పాఠశాలను తనిఖీ చేస్తున్న న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి

బల్లికురవ, ఆగస్టు 13 : విద్యార్థినులకు అన్ని రకాల వసతులు కల్పించకుంటే చర్యలు తప్పవని అద్దంకి కోర్టు న్యాయాధికారి డీ నాగవెంకటలక్ష్మి హెచ్చరించారు. మంగళవారం రాత్రి బల్లికురవ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని న్యాయమూర్తి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలోని అన్ని గదులను పరిశీలించారు. వసతులను అడిగి తెలుసుకున్నారు. కొన్ని గదులలో సరైన వెలుతురు లేదని, వారి సామగ్రి ఉంచేందుకు సరిపడా కప్ బోర్డులు లేవని, వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేకపోవడాన్ని చూసి స్వీపర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం భోజనశాలను, భోజనాన్ని, కూరగాయలు నిల్వ చేసే గదిని పరిశీలించి నాణ్యమైన సరుకులు తెప్పించాలని సూచించారు. జనరేటర్ సౌకర్యం కల్పించాల్సిందిగా ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు. ఈ సందర్భంగా న్యాయాధికారి నాగ వెంకటలక్ష్మి న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. బాల్య వివాహాలు చేస్తే వెంటనే పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్ర మంలో ప్రిన్సిపాల్ సరళకుమారి, న్యాయవాదులు మార్తా శ్రీను, మహ్మద్ రఫి పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్




స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 13: ఒంగోలులోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో గురువారం జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను కలె క్టర్ తమీమ్ అన్సారియా పరిశీలించారు. మంగళవారం సాయంత్రం ఎస్పీ ఎఆర్.దామోదర్, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీట్ల కేటాయింపుతోపాటు వేడుకలను తిలకించేం దుకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జెండా ఆవిష్కరణతోపాటు మంత్రి డాక్టర్ స్వామి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించే ఏర్పాట్లపై చర్చించారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో స్టాల్స్‌తోపాటు శకటాల ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధి కారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్వో విశ్వేశ్వరరావు, ఏఎస్పీ నాగేశ్వరరావుతో పాటు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

అదుపుతప్పి ఒరిగిన స్కూల్ బస్సు

విద్యార్థులకు తప్పిన ప్రమాదం



అదుపుతప్పి ఒరిగిన స్కూల్ బస్సు

పామూరు, ఆగస్టు 13: మండలంలోని తూర్పుకట్ట కిందపల్లి వద్ద మంగళ వారం స్కూల్ బస్సు అదు పుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లి ఒక వైపునకు ఒరిగింది. విద్యార్థులు క్షేమంగా బయటపడ టంతో ఊపిరిపీల్చుకున్నారు. పామూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠ శాలకు చెందిన స్కూల్ బస్సు కట్టకిందపల్లి నుంచి సుమారుగా 40మంది విద్యార్థులతో వస్తుంది. ఈక్రమంలో అదుపుతప్పి గ్రామ పంట పొలాల్లోకి దూసుకెళ్లి ఓ వైపునకు ఒరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి.

ఉపాధిలో అనకొండ

ప్రహసనంలా సోషల్ ఆడిట్

వైసీపీ పాలనలో శీనారెడ్డి ఇచ్చిందే తీర్పు

నాలుగున్నరేళ్ల పాటు పీడీగా ఇష్టారాజ్యం

రూ.300 కోట్లపైనే నిధులు పక్కదారి

పంచుకుతిన్న సిబ్బంది, నాయకులు

పరిశీలనల్లో ఆడిట్ బృందాలు గుర్తింపు

ప్రజావేదికల్లో పది శాతానికి పీడీ కోత

ఆపై వ్యక్తిగత విచారణ అంటూ అవి కూడా రద్దు

చర్యలు, రికవరీలు శూన్యం.. ఫలితం రూ.కోట్లు స్వాహా

సిబ్బంది బదిలీలు, నియామకాల్లో అక్రమాలు, వసూళ్లు

ఉన్నతాధికారులకు భారీగా ఫిర్యాదులు, కొన్నింటిపైనే విచారణలు

ఒంగోలు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖల్లో ఆ పార్టీతో అంటకాగిన అధికారులు ఇష్టారా జ్యంగా వ్యవహరించారు. అందిన కాడికి వారు, వారికి వత్తాసు పలికే వారు పంచుకుతిన్నారు. అలాంటి ప్రభుత్వ శాఖల్లో జిల్లా నీటి యాజ మాన్య సంస్థ (డ్వామా) ఒకటి కాగా వైసీపీ పాలనలో నాలుగున్నరేళ్లు ఆ సంస్థ పీడీగా పనిచేసిన కే.శీనారెడ్డి ఇష్టారాజ్యాంగ వ్యవహరించాడన్న ఆరోపణలు సర్వత్రా ఉన్నాయి. ప్రభుత్వం మారిన తర్వాత ఆయనపై ఉన్నతాధికారులకు, పాలకపక్ష పెద్దలకు భారీగా ఫిర్యాదులు అందడం, వాటిల్లోకొన్నింటిపై విచారణకు కూడా ఆదేశించడం ఆ ఆరోపణలకు ఊతం ఇస్తున్నది. ప్రత్యేకించి ఉపాధి పథకం పారదర్శకంగా సాగేలా చేసేందుకు కేంద్రప్రభుత్వం చట్టంలో చేసిన ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీలు (సోషల్ ఆడిట్) జిల్లాలో పీడీగా శీనారెడ్డి పనిచేసిన కాలంలో ప్రహసనంలా సాగింది.

సగానికి సగం నిధులు స్వాహా

జిల్లాలో వైసీపీ ప్రభుత్వ పాలనలో 2019-24 వరకు రూ.3,383 కోట్ల మేర ఉపాధి పథకంలో ఖర్చుచేశారు. అందులో కూలీలకు వేతన రూపంలో రూ.2,110 కోట్లు, మెటీరియల్ రూపంలో మరో రూ.1,273 కోట్లు వ్యయం చేశారు. సాధారణంగా కనీసం 20శాతం నిధులు స్వాహా అన్నది ఆ పథకంలో సర్వసాధారణమే. వైసీపీ పాలనలో అంతకన్నా అధికంగానే స్వాహా జరిగింది. ఒక్క జగనన్న కాలనీల పేరుతో జిల్లాలో ఉపాధి నిధులు రూ.150కోట్ల మేర ఖర్చుచేయగా అందులో సగానికి సగం వైసీపీ నేతలు, డ్వామా సిబ్బంది తిన్నారనేది బహిరంగసత్యం. పలు మండలాల్లో కూలీలు రాకుండానే వచ్చినట్లు, అసలు గ్రామంలో లేకుండా ఇతర రాష్ట్రాలు, దేశాల్లోనూ ఉండేవారి పేర్లతోనూ మస్టర్లు వేసి పంచుకుతి న్నారు. అలాంటి అక్రమాలను అరికట్టేందుకు ఏడాదికి రెండుసార్లు సోషల్ ఆడిట్ బృందాలు మండలం యూనిట్‌గా తనిఖీలు చేయడం వారు గుర్తించిన అక్రమాలపై మండలకేంద్రంలో ప్రజా వేదిక నిర్వహించి బాధ్యులపై చర్యలకు సిఫార్సు చేసే వారు. అవ కతవకలు, అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించిన సిబ్బందిపై వేటు వేయడంతోపాటు రికవరీకి ఆదేశించేవారు. కొందరిని ఉద్యోగాల నుంచి తొలగించి వేసేవారు.

అక్రమార్కులకు ఒత్తాసు పలికి..

గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు సోషల్ ఆడిట్ పకడ్బందీగా సాగేది. ఒక్కొక్క మండలంలో రెండు, మూడు రోజులు కూడా సామాజికవేదిక సభలు సాగేవి. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ విధానం ప్రహసనంలా సాగిపోయింది. పకడ్బందీగా ప్రక్రియను కొనసా గేలా సహకరించి సిబ్బంది అక్రమాలను నియంత్రించాల్సిన డ్వామా పీడీ హోదాలో ఉన్న శీనారెడ్డే అవినీతికి గేట్లు ఎత్తారన్న ఆరోపణలు ఉన్నాయి.



ఉపాధి పనులను చేస్తున్న కూలీలు(ఫైల్)

క్షేత్రస్థాయిలో అక్రమాలకు పాల్పడిన వైసీపీ నేతలు, సిబ్బందికి సహకరిం చేలా బూటకపు ప్రజావేదికలను నడిపాడన్న విమర్శలు అప్పట్లోనే వచ్చాయి. అంతకుముందు ఒక్కొక్క మండలంలో రెండేసి రోజులు ప్రజా వేదిక సభలు జరపాల్సి ఉండగా శీనారెడ్డి హయాంలో రోజుకు రెండేసి మండలాల్లో నిర్వహించి మమ అనిపించేవారు. ఇక వైసీపీ పాలన ఐదేళ్ల కాలంలో రూ.3,383 కోట్ల మేర పనులు జరగ్గా కనీసం పదిశాతం వంతున దుర్వినియోగం అనుకున్నా రూ.300 కోట్లపైనే పక్కదారి పట్టి నట్లు ఆడిట్ బృందాలు గుర్తించాయి. అయితే సామాజిక తనిఖీల అనం తరం మండలస్థాయిలో జరిగే ప్రజావేదిక సభల్లో ఐదేళ్లలో కేవలం రూ.39.22 కోట్లు మాత్రమే దుర్వినియోగం జరిగినట్లు పీడీ తేల్చాడు.

> జిల్లాలో కీలకమైన ఉపాధి హామీ పథకంలో వందల కోట్ల నిధులు పక్కదారి పట్టడం, సిబ్బంది, వైసీపీ క్షేత్రస్థాయి నేతలు పంచుకుని తినడం బహిరంగ సత్యం. వాటిలో కొన్నింటిని సోషల్ ఆడిట్ బృందాలు తమ తనిఖీల్లో గుర్తించాయి. అయితే జిల్లాలో ఉపాధి పనులు పర్యవేక్షించే అధికారి డ్వామా పీడీ. ఆడిట్ బృందాల అభ్యంతరాలపై మండలస్థాయిలో జరిగే విచారణ జరిగే ప్రజావేదిక సభలో విచారణాధికారిగా పాల్గొని పీడీ శీనారెడ్డి తన చేతివాటం చూపేవారు. అక్కడే ఆడిట్ బృందం అక్రమాలుగా రాసిన మొత్తాన్ని ఇంచుమించు పదిశాతానికి తగ్గించడం, ఆపై వ్యక్తిగత విచారణ పేరుతో సిబ్బందిని పిలిచి ఆ కొద్దిమొత్తాలను కూడా తొలగించి వేశారు. తద్వారా వందలకోట్ల ఉపాధి నిధులు దుర్వినియోగం జరిగినా సిబ్బందిపై నామమాత్రపు చర్యలతో సరిపెట్టారు. రికవరీలు లేకుండా చేయడం చేసి తద్వారా భారీగా తాను లబ్ధిపొందాడన్నా చర్చ ఆ శాఖ వర్గాల్లో నేటికీ నడుస్తోంది.

ఆయన చెప్పిందే తీర్పులాగా ప్రజావేదిక సభలు కొనసాగాయి.ఇక ఆపై ఆ సభల్లో బాధ్యులుగా గుర్తించిన సిబ్బందిని వ్యక్తిగత విచారణ పేరుతో డ్వామా కార్యాలయానికి పిలిచి అక్కడ వారిపై ప్రజావేదిక సభలో నమోదు చేసిన మొత్తాన్ని పదిశాతంకు తగ్గించి వేయడం, చర్యలు లేకుండా తిరిగి కొనసాగించడం జరిగిపోయాయి.

రూ.కోటికి తగ్గించేశారు..

ఐదేళ్ల కాలానికి సంబంధించి ప్రజావేదికల్లో దుర్వినియోగంగా గుర్తించిన రూ.39.22 కోట్లను వ్యక్తిగత విచారణ అనంతరం ఆ మొత్తాన్ని కోటికి పీడీ తగ్గించి వేసినట్లు సమాచారం. వైసీపీ అధికా రంలోకి వచ్చిన 2019-20లో రూ.695 కోట్ల మేర ఉపాధి నిధులు వ్యయం జరిగాయి. అందులో రూ.50.67 కోట్లు మేర దుర్వినియోగ మైనట్లు సోషల్ ఆడిట్ బృందాలు గుర్తించినట్లు సమాచారం. అయితే ప్రజావేదికల్లో ఆ మొత్తాన్ని రూ.7.84 కోట్లకు వ్యక్తిగత విచారణ సమయంలో చివరకు రూ.10 లక్షలకు తగ్గించి వేసినట్లు తెలుస్తోంది. ఇలాంటి పరిస్థితే ఏటా కొనసాగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలు ఇతర విషయాలలో ప్రత్యేకించి వివిధ స్థాయిల్లోని డ్వామా సిబ్బంది బదిలీలు, సస్పెన్షన్లు ఎత్తివేత, పోస్టింగులు, ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాలు తదితర అంశాలలో నాటి పీడీ శీనారెడ్డి అప్పటి అధికార వైసీపీ ప్రభుత్వంలో ఉన్న పలుకుబడితో ఇష్టారాజ్యాంగా వ్యవహరించి అక్రమాలకు పాల్పడినట్లు సర్వత్రా చర్చ సాగుతోంది. ఇవే విషయాలతో ప్రస్తుతం కొందరు డ్వామా సిబ్బంది అటు గ్రామాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు ఇటు కలెక్టర్ ఇతర పాలకపక్ష పెద్దలకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేశారు. తదనుగుణంగా ప్రస్తుతం విచారణలు జరుగుతుండగా మరికొందరు ఇంకొన్ని ఆధారాలతో ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

బిల్లు.. ఘొల్లు!

లైన్ఇన్‌స్పెక్టర్ ఇంటికి రూ.1.20లక్షల కరెంటు బిల్లు

ఒక నెలలోనే 12,600 యూనిట్లు వినియోగించినట్లు రీడింగ్

మూడేళ్లుగా అధికారుల చుట్టూప్రదక్షిణలు

అయినా పట్టించుకోని వైనం

విద్యుత్ అదాలత్‌లో గోడువెళ్లబోసుకున్న వెంకటస్వామి

సమస్య పరిష్కారానికి హామీ ఇవ్వని అధికారులు



అధికారుల ముందు గోడు వెళ్లబోసుకుంటున్న వెంకటస్వామి

మద్దిపాడు, ఆగస్టు 13 : విద్యుత్ ఉద్యోగికే ఆశాఖ అధికారులు షాక్ ఇచ్చారు. ఆయన ఇంటికి ఒక నెలలో రూ.1.20లక్షల బిల్లు వేశారు. తాను ఆ ఇంటిలో ఉండటం లేదని, ఎప్పుడో ఒకసారి వచ్చి వెళ్తుంటానని ఆ ఉద్యోగి మొత్తుకున్నా వినిపించుకోకుండా రూ.40వేలు వసూలు చేశారు. విచారించి న్యాయం చేయాలని ఆయన అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా మూడేళ్లుగా పట్టిం చుకోలేదు. దీంతో మంగళవారం కొండపిలో నిర్వహించిన విద్యుత్ అదాలత్‌కు సింగరాయకొండ మండలం కలికివాయికి చెంది ప్రస్తుతం కె.ఉప్పలపాడు సబ్‌స్టేషన్‌లో లైన్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న హాజరై గోడువెళ్లబోసుకున్నారు. ఆయన కథనం మేరకు... కలికివా యిలో వెంకటస్వామికి సొంత ఇల్లు ఉంది. ఆయన పలు మండ లాల్లో ఉద్యోగం చేస్తూ ఎప్పుడో పండుగలకు, పబ్బాలకు సొంత ఊరికి వెళ్తుంటారు. ఒకట్రెండ్రోజులు ఉండి వెళ్లిపోతుంటారు. తాను సొంతూరికి వచ్చినప్పుడు ఇబ్బంది లేకుండా ఉండాలన్న ఉద్దేశంతో దాన్ని బాడుగకు కూడా ఇవ్వలేదు. తన ఇంటికి మినిమం బిల్లు వస్తుండగా అది నెలనెలా చెల్లిస్తున్నాడు. అటువంటి ఇంటికి 2021 ఏప్రిల్‌లో ఒక్కసారిగా 12,600 యూనిట్లు విద్యుత్ వినియోగించి నట్లు, అందుకు 1,20,000 చెల్లించాలని విద్యుత్ బిల్లు వచ్చింది. దీంతో విస్తుపోయిన ఆయన తన శాఖలోని సంబంధిత అధికారుల చుట్టూ తిరిగారు. క్షేత్రస్థాయిలో తన ఇంటిని పరిశీలించాలని, పూర్వపు బిల్లు లను చూడాలని, చుట్టు పక్కల వారి నుంచి తన ఇంటిలో ఎవరైనా ఉంటారా? లేదా? అన్న విషయమై విచారించాలని అధికారులను అప్పటి నుంచి వెంకటస్వామి వేడుకుంటున్నా పట్టించుకోలేదు. సాంకే తికంగా జరిగిన పొరపాట్లను శాఖ సరిచేసే వరకూ వినియోగదా రుడు కొత్త మీటర్‌కు దరఖాస్తు చేసుకుంటే ఇస్తారు. అలాగే వెంకట స్వామి కూడా కొత్త మీటర్ పొందారు. దాన్ని కూడా నాలుగు నెల ల్లోనే తొలగించారు. అప్పటి అధికారులు కేవలం పంతంతో.. వచ్చిన బిల్లు కట్టాల్సిందేనని పదేపదే తనను వెంటాడారని వెంకటస్వామి అదాలత్‌లో వాపోయారు. రీడింగ్‌లో తప్పు వల్ల జరిగిన దానికి తనకు వచ్చిన 1,20,000 లక్షల బిల్లులో రూ.40 వేలు వసూలు చేశా రని అధికారుల దృష్టికి తెచ్చారు. ఇప్పటికైనా తనకు వన్‌టైం సెటి ల్మెంట్‌గా కొంత తగ్గించి చెబితే బిల్లు కట్టేస్తానని, తన ఇంటికి విద్యు త్ కనెక్షన్‌ను పునరుద్ధరించాలని ఆయన కోరారు. అయితే అధికా రులు వెంకటస్వామి చెప్పిన విషయాలు విని తలలు ఊపి వెళ్లిపో యారు. ఆయనకు ఎలాంటి హామీ ఇవ్వలేదు. సామాన్య ప్రజలకు న్యాయం చేస్తున్న అధికారులు తనను విద్యుత్ వినియోగదారుడిగా నైనా గుర్తించి న్యాయం చేయాలని వెంకటస్వామి కోరారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ



మాట్లాడుతున్న ఎస్పీ తుషార్‌డూడీ

సంతమాగులూరు, ఆగస్టు 13 : సంతమాగులూరు పోలీస్‌స్టేషన్ ను ఎస్పీ తుషార్ డూడీ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పోలీస్ సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. అనంతరం ఎస్పీ రికార్డులను పరిశీలించారు. డీఎస్పీ మల్లికార్జున, సంతమాగులూరు సీఐ కె.వెంకటరావు పాల్గొన్నారు.

రేపు జిల్లాలో ఐదు అన్న క్యాంటీన్లు ప్రారంభం

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 13: పేదల అకలి తీర్చేందుకు తెలుగుదేశం పార్టీ కూటమి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రూ.5కే భోజనం 'అన్న' క్యాంటిన్లు గురువారం ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించనుంది. ఈ మేరకు తొలుతగా రాష్ట్రవ్యాప్తంగా 100 అన్న క్యాంటిన్లను ప్రారంభించనుంది. జిల్లాకు సంబంధించి ఒంగోలులో నాలుగు, చీమకుర్తిలో ఒకటి ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సహకారంతో ఒంగోలులో నాలుగు క్యాంటిన్లలో రెండు నెలలుగా ఉచితంగా పేదలకు అన్నం పెడుతు న్నారు. ఆగస్టు 15 నుంచి ఒంగోలులో దామచర్ల వీటిని ప్రారంభించనున్నారు.

కేసులొస్తే.. కాసులే...!

ఏస్ఈబీ కార్యాలయంలో మామూళ్ల దోపిడీ

మద్యం పట్టుకోకుండా సెటిల్‌మెంట్లు

బెల్టుషాపులు, హోటల్స్ నుంచి నెలవారి ముడుపులు

ప్రతి కేసుకు ముక్కుపిండి వసూలు

ఎన్నికల రైడింగ్‌లో దొరికిన

మద్యానికి రూ.10వేలకుపైగా వసూలు

పుల్లలచెరువు, ఆగస్టు 13: నియోజవర్గ స్థాయిలో మద్యాన్ని కంట్రోలు చేయాల్సిన ఓ అధికారికి కేసులు వస్తే కాసుల వర్షం కురు స్తోంది. ఎర్రగొండపాలెం కేంద్రంగా పనిచేస్తున్న సదరు అధికారి కాసులిస్తే కేసులు మాయం చేస్తున్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. నియోజకవర్గంలోని ఎర్రగొండపాలెం, త్రిపురాంతకం, పుల్ల లచెరువు మండలాల్లో వేకువజాము నుంచే బ్లాక్‌లో మద్యం జోరుగా దొరుకుతోంది. అయినప్పటికీ, సదరు అధికారి పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. మూడు మండలాల్లోని ప్రతి గ్రామంలో 3కిపైగా సుమారు 250 బెల్టుషాపులు ఉన్నాయి. సదరు అధికారి ప్రతి బెల్టుషాపు నుంచి రూ.5వేలు తీసుకొని గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు ఆ శాఖ ఉద్యోగులే గుసగుసలు అడుకుంటున్నారు. గ్రామాల్లోని బెల్టుషా పులతోపాటు చిన్న చిన్న హోటల్స్‌లో మద్యం అమ్ముకునేందుకు, ఎర్ర గొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం రెస్టారెంట్‌ల్లో మద్యం సేవించేందుకు వారి నుంచి భారీ మొత్తంలో నెలవారీ మామూళ్ల వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఏదైనా మద్యం కేసు వస్తే ముందుగా అధికారి మధ్యవర్తుల ద్వారా బేరం కుదుర్చుకొని వారి నుంచి అందినకాడికి దండుకుంటున్నారు. మామూళ్లు ముట్టజెప్పుకో లేని వారికి మాత్రమే కేసుల వేధింపులు ఉంటున్నాయని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇరుపార్టీల నుంచి భారీమొత్తంలో వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. మద్యం తీసుకెళ్తూ పట్టుబడిన ఇరుపార్టీల కార్యకర్తల నుంచి రూ.10 వేల నుంచి రూ.15వేలు వసూలు చేసి కేసులు లేకుండా చేశారు. ఎర్రగొం డపాలెం పట్టణంలోని వైసీపీ ప్రజాప్రతినిధి ప్రభుత్వ దుకాణాల నుంచి మంచి బ్రాండ్‌ల మద్యం బ్లాక్‌కు తరలించి ప్రత్యేక వ్యక్తుల ద్వారా వేకువజాము నుంచి వైపాలెం పట్టణంలోని వినుకొండ రోడ్డు, పుల్లలచెరువు రోడ్డుల్లో జోరుగా విక్రయిస్తున్నారు. ఈ విషయం తెలి సినా, సదరు అధికారి మాత్రం కన్నెత్తి కూడా చూడటం లేదు. ఇప్ప టికైనా ఉన్నాతాధికారులు దృష్టిసారించి ఎర్రగొండపాలెం నియోజకవ ర్గంలో అక్రమ మద్యానికి అడ్డుకట్ట వేసి ఆ అధికారిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆగని వైసీపీ నేతల ఇసుక దందా

అనుమతులు లేకున్నా

యథేచ్ఛగా తవ్వకాలు

లక్షలాది రూపాయలు సొమ్ము

చేసుకుంటున్న అక్రమార్కులు

చోద్యం చూస్తున్న అధికారులు



గుండ్లకమ్మ వాగులో ఇసుక కోసం జరిపిన తవ్వకాలు

దొనకొండ, ఆగస్టు 13 : గత వైసీపీ ప్రభుత్వంలో ప్రకృతి సంపదను దోచు కోవడంపై ఆ పార్టీ నాయకులు తెగపోటీపడ్డారు. అడ్డూఅదుపులేకుండా ఇసుకను తవ్వుకుని అమ్ముకున్నారు. మండలంలోని కొచ్చెర్లకోట పంచా యతీకి చెందిన ఆ పార్టీ నాయకుల ఇసుక దందా అంతాఇంతా కాదు. ఈ దోపిడీపై అప్పట్లో పలువురు టీడీపీ నాయకులు పోరాడితే పోలీస్‌స్టే షన్ చుట్టూ తిప్పించి కేసులు నమోదు చేయించి తీవ్రఇబ్బందులకు గురిచేశారు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వైసీపీ నాయకులకు అడ్డేలేకుండా పోయింది. కొచ్చెర్లకోట పంచాయతీ పరిధిలోని సిద్ధాయిపాలెం సమీపంలోని గుండ్లకమ్మ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దొన కొండ నుంచి సిద్ధాయిపాలెం మీదుగా మార్కాపురం వెళ్లే ప్రధాన రహదారి నుంచి దాదాపు రెండు కిలోమీటర్లు లోపల సరైన రహదారి లేని ప్రదేశంలో ఈ ఇసుక రీచ్ ఉంది. అప్పట్లో ఈ ఇసుకకు పెద్దగా గిరాకీ లేకపోవ టంతో తగిన గుర్తింపు లేకుండాపోయింది. ఇటీవల కాలంలో తవ్వేకొద్దీ నాణ్యమైన ఇసుక వస్తుండడంతో సిద్ధాయిపాలెం ఇసుకకు డిమాండ్ ఏర్పడింది. గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ఇసుకను తోడి పరిసర ప్రాంతంలో డంపింగ్ చేస్తున్నారు. ఈ ఇసుకను ట్రాక్టర్ల ద్వారా మార్కాపురం, దొనకొండ తదితర ప్రాంతాలకు తరలించి ట్రక్కు సుమారు రూ.4 వేల నుంచి రూ.5వేల వరకు విక్రయిస్తున్నారు. సమీపంలో రూ.3 వేలకు విక్రయాలు చేస్తూ దర్జాగా సొమ్ము చేసుకుం టున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు తమకేమీపట్టనట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా స్పందించి అక్రమార్కులపై తగిన చర్యలు చేపట్టి ప్రభుత్వ ఆస్తిని పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి .. అధికార మార్పిడి

నేడు మంత్రి గొట్టిపాటిని కలవనున్న మున్సిపల్ కౌన్సిలర్‌లు

అద్దంకి, ఆగస్టు 13 : అద్దంకి మున్సిపాలిటీలో పలువురు కౌన్సిలర్‌లు అందరూ ఒకే సారి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసేందుకు బుధవారం అమరావతి వెళ్లనున్నారు. టీడీపీకి చెందిన 7గురు కౌన్సిలర్‌లతో పాటు ఎన్నికల ముందు టీడీపీలో చేరిన ఇద్దరు కౌన్సిలర్ మొత్తం 9 మంది కౌన్సిలర్‌లు బుధవారం మంత్రి రవికుమార్‌ను కలవనున్నారు. ఆయా వార్డులలో అభివృద్ధి పనుల గురించి మాట్లాడేందుకు వెళ్తున్నట్లు కౌన్సిలర్‌లు చెప్పుతున్నప్పటికీ అసలు విషయం వేరే ఉందని పలువురు అభిప్రాయపడుతన్నారు. ఆయా వార్డులలో తమ మాటకే ప్రాధాన్యత ఇచ్చే విధంగా అధికారులకు చెప్పాలని కోరనున్నట్లు తెలుస్తుంది. వాటన్నింటికంటే టీడీపీ కూటమి అధికారంలో ఉన్నందున అద్దంకి మున్సిపాలిటీ కూడా టీడీపీ పాగా వేసే విధంగా చేయాలని కోరనున్నట్లు సమాచారం. అద్దంకి మున్సిపాలిటీలో మొత్తం 20 మంది కౌన్సిలర్‌లు కాగా, ప్రస్తుతం టీడీపీ పక్షాన 9 మంది



అద్దంకి మున్సిపల్ కార్యాలయం

ఉన్నారు. మరో ఇద్దరు కౌన్సిలర్‌లు సంపూర్ణ మద్దతు తెలిపేందుకు సంసిద్ధంగా ఉన్నారు. దీంతో వైసీపీ కౌన్సిలర్‌ల బలం 9కి పడిపోయే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తమకున్న బలంతో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌ల పదవులు కైవసం చేసుకోవాలని టీడీపీ కౌన్సిలర్ లు ఉవ్విల్లూరుతున్నారు. మంత్రి తొందరపడి ఎలాంటి నిర్ణయం తీసుకోరనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. అవిశ్వాసం పెట్టడానికి రాష్ట్ర స్థాయిలో విధాన పరమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉండడంతో పాటు భవిష్యత్‌లో ఎదురయ్యే అడ్డంకులను కూడా బేరీజు వేసుకొని మంత్రి రవికుమార్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో గొట్టిపాటిని కలిసిన సమయంలో కౌన్సిలర్‌లకు ఎలాంటి హామీ లభిస్తుందో వేచి చూడాల్సి ఉంది. అభివృద్ధి పనుల మాటున అధికార మార్పిడి కోసమే ఈ కలయిక అన్న సంకేతాలు విన్పిస్తున్నాయి.



నగదు అందిస్తున్న ఉప్పుగుండూరు వాసులు

గోమాతల మేతకు సాయం

ముందుకొస్తున్న దాతలు

అద్దంకి, ఆగస్టు 13 : అద్దంకిలోని హరిహర గోకులంలో ఆవుల మేతకు పలువురు దాతలు ముందుకు వచ్చి 33వేల రూపాయల నగదు అందజేశారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన గోమాతల ఆక్రందన అనే కథనానికి స్పందించిన ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరుకు చెందిన సింగు శ్రీనివాసరావు రూ.20 వేలు, జీఎస్ శర్మ, జీవీఆర్, బెల్లం సుబ్బారావు, సీతారామయ్య, అమరా వెంకటేశ్వరరావు, కిషోర్, పావులూరి సుబ్బారావు, తేలప్రోలు వెంకట శేషారావు రూ.13వేలను ఇవ్వగా ఆ మొత్తాన్ని మంగళవారం అద్దంకి వచ్చి గోశాల నిర్వాహకుడు సుబ్బారావుకు అందజేశారు. గోవులకు మేత, నగదు అందజేయాలనుకునే దాతలు 73825 06115 నెంబర్‌కు సంప్రదించాలని సుబ్బారావు కోరారు.



గోతులతో ఉన్న కొణిదెన రోడ్డుకు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

కొణిదెన రోడ్డు బాగు

మార్టూరు ఎన్‌హెచ్-5 వరకు మరమ్మతులు

బల్లికురవ, ఆగస్టు 13 : నరకప్రాయంగా మారిన కొణిదెన రోడ్డుకు స్వల్ప ఉపశమనం కలుగుతుంది. ఈరోడ్డు పూర్తి స్థాయిలో వర్షాలతో దెబ్బతినడంతో గత డిసెంబరులో దెబ్బతిన్న రోడ్డుకు ప్యాచ్‌లు వేసేందుకు అర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపగా ఇప్పుడు నిధులు మంజూరు కావడంతో మంగళవారం నుంచి రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. బల్లికురవ నుంచి వయా కొణిదెన గ్రామాల మీదుగా ఎన్‌హెచ్ 5 వరకు ఉన్న అర్ అండ్‌బీ రోడ్డు సుమారు 12 కిలోమటర్ల వరకు పూర్తిగా దెబ్బతింది. ఈ రోడ్డులో మోకాటి లోతు గోతులు ఉండడంతో వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత కొంత కాలం నుంచి ఈ రోడ్డులన ప్రయాణించే ప్రజలు రోడ్డు అభివృద్ధి పరచాలని గగ్గోలు పెడుతున్నారు. అధికారులు గతంలో పంపిన ప్రతిపాదనకు ఇప్పుడు రోడ్డు బాగా దెబ్బతినడంతో వచ్చిన నిధులతో కొంత వరకు పెద్ద పెద్ద గోతులను కొణిదెన గ్రామం నుంచి ఎన్‌హెచ్-5 వరకు ప్యాచ్‌లు వేసేందుకు పనులు చేపడుతున్నారు. కొణిదెన నుంచి బల్లికురవ వరకు ప్యాచ్‌లు కూడా చేపట్టేందుకు నిధులు లేవు. ఈ రోడ్డును పూర్తి స్థాయిలో మరలా పగటగొట్టి వెట్ మిక్స్ వేసి అభివృద్ధి పరచాలని ప్రజలు కోరుతున్నారు. అర్‌అండ్‌బీ అధికారులు కూడా రోడ్డును పరిశీలించి రోడ్డు బాగా దెబ్బతిందని వెంటనే నిధులు మంజూరు చేయించేలా ఉన్నతాధికారులకు నివేదికను పంపుతున్నారు. ప్యాచ్ వర్క్ పనులు చేపట్టిన ఉపయెగం లేదని రోడ్డు మెత్తం అధ్వానంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే దెబ్బతిన్న రోడ్లకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

ప్రతి పాఠశాలకు బిస్కెట్ ప్యాకెట్లు



బిస్కెట్లను అందజేస్తున్న దాత

పంగులూరు, ఆగస్టు 13 : స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనే విద్యార్థులకు తమ ట్రస్ట్ ద్వారా బిస్కెట్ ప్యాకెట్లు సరఫరా చేసినట్లు అజిత్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ తెలిపారు. మండలంలోని 31 ప్రాథమిక, 7 ప్రాథమికోన్నత, 6 ఉన్నత పాఠశాలలతో పాటు అద్దంకి మం డలం చక్రాయపాలెం పాఠశాలకు సోమ, మంగళవారాలలో విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లను అందచేసినట్లు తెలిపారు. ఏటా ఆగస్టు 15, జనవరి 26న విద్యార్థులకు ట్రస్ట్ ద్వారా బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

గ్రామాలపై నిఘా పెంచాలి



మాట్లాడుతున్న ఎస్ఐ చౌదరి

బల్లికురవ, ఆగస్టు 13 : గ్రామాలలో ఎలాంటి చిన్న పాటి ఘర్షణలు కూడా జరగకుండా గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్ఐ జీవీ చౌదరి తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో 19 గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న మహిళ పోలీసులతో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాలలో ఎవరైన కొత్త వ్యక్తులు తిరిగితే వారి వివరాలను సేకరించాలన్నారు. అలానే చోరీలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలానే గ్రామాలకు కేటాయించిన డ్యూటీలను క్రమం తప్పకుండా చేయాలన్నారు. గతంలో నమోదై ఉన్న రౌడీషీటర్ల కదలికలను గమనించాలన్నారు. గ్రామాలలో ఉన్న దుకాణాల వివరాలను సేకరించాలన్నారు. అలానే క్వారీలు ఫ్యాక్టరీలలో పనిచేసేందుకు ఇతర రాష్ట్రాల కూలీలు వస్తే వారి వివరాలు కూడా సేకరించి ఉంచాలని, గ్రామాలలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఎస్ఐ కోరారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

చీరాల, ఆగస్టు 13 : ఎస్టీయూ సభ్యత్వ నమోదు ప్రక్రియ వేగంగా జరుగుతోంది. అందులో భాగంగా మంగళవారం పలు పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులు ప్రభాకరరావు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి కల్పించాలని ఇతర సమస్యలను ప్రస్తావిస్తూ, వాటిపై ప్రభుత్వం వెంటనే స్పందించేందుకు ఎస్టీయూ తన వంతు ప్రయత్నం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ చీరాల మండల బాధ్యులు ఏసురత్నం, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, పాండురంగారావు, వరదారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ప్రణీత్‌కుమార్

ఇంకొల్లు, ఆగస్టు 13 : ఆహార పదార్థాలలో కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఫుడ్‌సేఫ్టీ అధికారి పి.ప్రణీత్ కుమార్ హెచ్చరించారు. ఆహార భద్రతపై మంగళవారం వాసవీ పరమేశ్వరి కల్యాణ మండపంలో వ్యాపారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రణీత్ కుమార్ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందజేయాలన్నారు. లేనిపక్షంలో అపరాధ రుసుం విధిస్తామన్నారు. కల్తీ అహారం ద్వారా ఎవరికైనా ప్రాణహాని జరిగితే ఆ దుకాణదారుడికి రూ.10లక్షల జరిమానా విధిస్తారన్నారు. కార్యక్రమంలో ఫోస్టాక్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అనిల్, కె.సురేంద్ర, సునీల్, వ్యాపారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పర్చూరు, ఆగస్టు 13: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందిచారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యద్దనపూడి మండలం పోలూరు గ్రామానికి చెందిన తానేటి శివరామకృష్ణ(39) తన ద్విచక్రవాహనంపై గత నెల 22న పర్చూరు నుంచి స్వగ్రామం పోలూరు వెళ్తుండగా పెదివారిపాలెం ఆర్‌అండ్‌బీ రోడ్డు మలుపు వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్ఐ సురేష్ రెడ్డి తెలిపారు. అతనికి భార్య ఇద్దకు కుమారులు ఉన్నారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గేర్ బాక్సులు దొంగలించిన వ్యక్తికి రిమాండ్

చినగంజాం, ఆగస్టు 13 : రొయ్యల చెరువుల్లో ఉపయోగించే ఏరియేటర్ గేర్ బాక్సులను దొంగిలించిన వ్యక్తికి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ ఎస్.రమేష్ మంగళవారం తెలిపారు. చినగంజాం ప్రాంతంలోని చెరువుల వద్ద గేరుబాక్సులను దొంగిలిస్తున్నట్లు ఆక్వా రైతు రాజులపూడి సూర్యనారాయణస్వామి ఈ నెల 12వ తేదీన పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మంగళవారం టీజంక్షన్ వద్ద వెళ్తున్న ఆటోని తనిఖీ చేయగా గేర్ బాక్సులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఒంగోలులోని నెహ్రూనగర్‌కు చెందిన కందిపాటి వెంకటేష్‌ని అరెస్ట్ చేసి, సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దాని విలువ రూ.28వేలు ఉంటుందని తెలిపారు. అరెస్ట్ చేసిన వ్యక్తిని చీరాల కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

గ్రానైట్ కార్మికుడు మృతి

బల్లికురవ, ఆగస్టు 13 : మండలంలోని వేమవరం గ్రామ సమీపంలో గ్రానైట్ ఫ్యాక్టరీలో ప్రమాదవశాత్తు పనులు చేస్తుండగా చైను తెగి బండరాయి పడి రాజస్థాన్‌కు చెందిన రాజు (20) కార్మికుడు మృతి చెందాడు. రోజు మాదిరిగానే ఫ్యాక్టరీలో పనులు చేస్తుండగా ఎక్స్‌కవేటర్ చైన్ తెగిపోవడంతో కటింగ్ కోసం ఉంచిన బండరాయి పడి రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే ఏఎస్ఐ బాలకృష్ణ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాద వివరాలను నమోదు చేశారు.



సంధ్యారాణి, పవన్ గోపీకృష్ణ, హితేంద్ర

కొండమంజులూరు విద్యార్థుల ప్రతిభ

పంగులూరు, ఆగస్టు 13 : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బాపట్లలో విద్యా శాఖ నిర్వహించిన వక్తృత్వ, క్విజ్ పోటీలలో కొండమంజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథములుగా నిలిచారు. జీవవైవిధ్య పరిరక్షణలో యువత పాత్ర అనే అంశంపై జరిగిన వక్తృత్వ పోటీలో పాల్గొన్న కొండమంజులూరు ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థిని యల్లంకి సంధ్యారాణి ప్రతిభ కనబరిచి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఇదే పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు ఛాత రాజుపల్లి పవన్ గోపీకృష్ణ, పంచుమర్తి హితేంద్ర క్విజ్ పోటీలో మొదటి స్థానంలో నిలిచారు. ఈ విద్యార్థులకు ఈనెల 15న జరిగే స్వాతంత్ర్య వేడుకలో కలెక్టర్ ప్రశంసాపత్రం, నగదు బహుమతులను అందజేస్తారని హెచ్‌ఎం ఐ.అణిత తెలిపారు. జిల్లా స్థాయి పోటీలలో సత్తాచాటి పాఠశాలకు పేరు తెచ్చిన విద్యార్థులను ఎస్‌ఎంసీ చైర్మన్ గోలి సంధ్య వైస్ చైర్మన్ నరసింహారావు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

రెవెన్యూ సమస్యలపై బాధ్యతగా వ్యవహరించాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 13 : త్వరలో జరగనున్న రెవెన్యూ సదస్సులకు సంబంధించి ముందస్తుగా అధికారులు, సిబ్బందికి మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి, తహసీల్దార్ పార్వతి తదితరులు మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సంబంధించి సదస్సులలో నిర్వహించాల్సిన పనితీరుపై అవగాహన కల్పించారు. అధికారులు, సిబ్బంది సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో వీఆర్వో, వీఏస్‌లు, వ్యవసాయ, దేవాదాయ, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

అధికారులకు జనసేన నాయకుల శుభాకాంక్షలు



ఎంపీడీవో స్వరూపరాణిని సన్మానిస్తున్న నాయకులు

చినగంజాం, ఆగస్టు 13 : మండలంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్ఐలను జనసేన పార్టీ నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ జీ ప్రభాకరరావు, ఎంపీడీవో కే.స్వరూపరాణి, ఎస్ఐ ఎస్.రమేష్‌ను వారి కార్యాలయాలకు వెళ్లి వారిని శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి విజయ్‌కుమార్, ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి తుమ్మలపెంట సతీష్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సందు శ్రీనివాసరావు, కుర్రి వాసుదేవరావు, నాయకులు తోట అశోకచక్రవర్తి, వోవా, గంటా వెంకటేష్, సీహెచ్ లక్ష్మణ్, బి.శ్రీనివాసరావు, ఎస్.సురేష్, బి.సాయి పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

అద్దంకి, ఆగస్టు 13 : జాతీయ లోక్ అదాలత్ సెప్టెంబరు 14వ తేదీన జరుగుతుందని అద్దంకి సీనియర్ సివిల్ న్యాయాధికారి డి.నాగవెంకటలక్ష్మి తెలిపారు. రాజీ చేయదగిన క్రిమినల్ కేసులతో పాటు సివిల్, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ వివాద కేసులు పరిష్కారం చేసుకోవాలని కోరారు.

సంతమాగులూరు ఎంపీడీవోగా లక్ష్మీదేవి

సంతమాగులూరు, ఆగస్టు 13 : సంతమాగులూరు ఎంపీడీవోగా జి.లక్ష్మీదేవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎంపీడీవో కాశియ్య గుంటూరుకు బదిలీ అయ్యారు. లక్ష్మీదేవిని కార్యదర్శులు, సర్పంచ్‌లు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ-పంట నమోదు చేసుకోవాలి

అద్దంకిటౌన్, ఆగస్టు 13: పంటలు సాగు చేసిన రైతులు ఈ-పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మంగళవారం అద్దంకి మండలంలోని శింగరకొండపాలెంలో సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఈ పంట నమోదు చేసుకున్న రైతులందరికీ బీమా, గిట్టుబాటు ధరలు, వడ్డీ రాయితీ, పంట నష్టపరిహారం, అన్నదాత సుఖీభవ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. కౌలు రైతులందరు తప్పనిసరిగా కౌలు గుర్తింపు కార్డులు తీసుకోవాలని, వారు సాగు చేసిన పంటల పేర్లు నమోదు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు తూమాటి సాయిబాబు, రైతులు పాల్గొన్నారు.

వేటపాలెం(చీరాల) : పంటలు సాగు చేసిన రైతులు ప్రతి ఒక్కరూ ఈ-పంట నమోదు చేసుకోవాలని ఏవో కాశీవిశ్వనాథ్ తెలిపారు. మంగళవారం పాపాయిపాలెంలో పంటను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏల్చూరి రోడ్డులో చిన్నారి

సంతమాగులూరు, ఆగస్టు 13 : మండలంలోని అద్దంకి - నార్కెట్‌పల్లి ప్రధాన రహదారిపై ఏల్చూరు వద్ద అమానుష ఘటన చోటుచేసుకుంది. ఏల్చూరు గ్రామం వద్ద సోమవారం రాత్రి గుర్తుతెలియని మహిళ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఏల్చూరు గ్రామంలో దర్గా బావి దగ్గర పసి బిడ్డను వదిలి వెళ్లింది. చుట్టుపక్కల వారు గమనించి అంగన్‌వాడీ కార్యకర్తలకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు వచ్చి 108లో అద్దంకికి తరలించారు.

ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



బల్లికురవలో జైహింద్ అని రాస్తున్న అధికారులు, చినగంజాం, మార్టూరులో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బల్లికురవ, ఆగస్టు 13 : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు మంగళవారం బల్లికురవలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేపట్టారు. ఉన్నత పాఠశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు విద్యార్థులు, పలుశాఖల అధికారులు భారత్‌మాతాకీ జై అంటు, జైహింద్ అంటు నినాదాలు చేశారు. అనంతరం తెల్ల పేపర్‌పై జైహింద్ అంటూ సంతకాలను చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ దేశం కోసం తమ ప్రాణాలను అడ్డు పెట్టిన మహనీయుల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలన్నారు. పంద్రాగస్టు వేడుకలను ఈ ఏడాది ఘనంగా జరపాలని అయన కోరారు. కార్యక్రమంలో ఎంఈవోలు వస్త్రం నాయక్, రమేష్, సర్వే డీటీ ప్రహర్ష, ప్రధానోపాధ్యాయుడు హనుమంతురావు, ఏఎస్‌వో ఆమరనాథ్, వీఆర్వోలు యార్లగడ్డ శ్రీనివాసరావు, వీరయ్య వెంకటేశ్వర్లు, మీనా, ఆశోక్ పాల్గొన్నారు.

చినగంజాం : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఎన్‌సీసీ విద్యార్థులు పంద్రాగస్టు సందర్భంగా చినగంజాం గ్రామంలో తిరంగా ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఆగస్టు 15వ తేదీన ప్రతి ఇంటిపైనా జాతీయ జెండాను ఎగురవేయాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కను నాటాలని నినాదాలు చేస్తూ విద్యార్థులు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం డి.రత్నకుమారి, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు, కార్యక్రమంలో పాఠశాల ఎన్‌సీసీ అధికారి ఎన్. సుబ్బారావు, ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

మార్టూరు : మండలంలోని వలపర్ల గ్రామంలో గురువారం జెండా పండుగ సందర్భంగా మంగళవారం జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. హైస్కూల్‌లోని ఎన్‌సీసీ కెడెట్ అధికారి కేశినేని వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రధాన వీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని హైస్కూల్‌లో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ నిర్మలాదేవి ప్రారంభించారు. ప్రజలంతా తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. హైస్కూల్ నుంచి పాత సినిమాహాలు వరకు ర్యాలీ సాగింది. ర్యాలీ ప్రారంభంలో పెద్ద జాతీయ జెండా ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో పీఈటీ రవి దేవరాజ్‌తో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



ట్యాంకుకు భూమి పూజ చేస్తున్న టీడీపీ నాయకులు

మంచినీటి ట్యాంకుకు భూమి పూజ

మార్టూరు, ఆగస్టు 13 : మార్టూరులో పడమర బజారున 20వ బూత్ పరిధిలో మంచినీటి ట్యాంకు నిర్మాణానికి తెలుగుదేశం పార్టీ నాయకులు మంగళవారం భూమి పూజ చేశారు. గ్రామ పంచాయతీ నిధులతో 10 వేల లీటర్ల కెపాసిటీ కలిగిన మంచినీటి ట్యాంకును నిర్మిస్తున్నారు. గతంలో 10 ఏళ్ల కిందట పంచాయతీ వారు మంచినీటి ట్యాంకును తాత్కాలికంగా నిర్మాణం చేశారు. దానికి కుళాయిలను కూడా ఏర్పాటు చేయడంతో ప్రజానీకం ఈ ట్యాంకు ద్వారా నీటిని వినియోగించుకున్నారు. అయితే అది శిథిలం కావడంతో ప్రస్తుతం ఆయా పరిసరాల ప్రజానీకం అవసరాలు కోసం ఆర్‌సీసీ మంచినీటి ట్యాంకును నిర్మించాలని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబ శివరావు పంచాయతీ కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావుకు సూచనలు చేశారు. దాంతో ట్యాంకు నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో కామినేని జనార్దన్, షేక్ రజాక్, కమ్మ శివనాగేశ్వరరావు, గొట్టిపాటి వెంకట్రావు, తగెడ్ల ఆంజనేయులు, కన్నెగంటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వీధి కుక్కలతో జాగ్రత్త

చీరాలటౌన్, ఆగస్టు 13 : చీరాల పురపాలక పరిధిలోని వీధి కుక్కల నుంచి ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కుక్కల బెడదను తొలగించేందుకు అన్ని విధాలుగ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈక్రమంలోనే తల్లిదండ్రులు పిల్లలను వాటికి దూరంగా ఉంచాలన్నారు. అలాగే వాటిపట్ల ఆకతాయియంగా ఉండరాదన్నారు. సమస్యలు ఉన్నట్లయితే నేరుగా సమాచారం అందించాలన్నారు.

పేద మహిళలకు కుట్టు మిషన్ అందజేత

అద్దంకిటౌన్, ఆగస్టు 13: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో పేద మహిళకు కుట్టుమిషన్‌ను అందజేశారు. మంగళవారం రోటరీ మాజీ అధ్యక్షుడు అద్దంకి లేవి ప్రసాద్ ఆర్థిక సాయంతో అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్‌కు చెందిన పేద మహిళ పూండ్ల కోటేశ్వరమ్మకు కుట్టు మిషన్‌ను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, అళహరి హరిప్రసాద్, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, దివాకర్‌దత్తు, పువ్వాడ కోటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, నర్రా శ్రీలక్ష్మి, కొల్లా భువనేశ్వరి, పసుపులేటి ఆంజనేయులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న చైల్డ్ ఫండ్ లింక్ వర్కర్స్

వ్యాధులపై అవగాహన

చినగంజాం, ఆగస్టు 13 : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చైల్డ్ ఫండ్ లింక్ వర్కర్స్ ఆధ్వర్యంలో మీకు తెలుసా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులకు, గ్రామస్థులకు హెచ్ఐవీ, ఎయిడ్స్, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యాధులు సంక్రమించడానికి గల కారణాలు, నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ సందర్భంగా వ్యాధుల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఇంటెన్సిఫైడ్ ఐఈసీ జిల్లా రిసోర్సుపర్సన్ జీ.స్వరూప్ కుమార్ అన్నారు. పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటించడం అత్యంత ముఖ్యమన్నారు. అలాగే వ్యాధులు సోకిన వారు ప్రతిరోజూ తీసుకోవాల్సిన పోషకాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రత్నకుమారి, సూపర్‌వైజర్ వినయ్, విజయశాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఏఎన్‌ఎం, ఆశాలు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఆగస్టు 13 : అక్రమ రవాణా, అసాంఘిక కార్య కలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈపూరుపాలెం ఎస్సై శివకుమార్ పేర్కొన్నారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం ఎస్సై వాహన తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా పలు వాహనాల రికార్డులను పరిశీలించారు. నేర నియంత్రణకు ప్రజలు, వాహనదారులు సహకరించాలని సూచించారు. అలాగే స్ట్రయిట్‌కట్ వద్ద ప్రజలతో శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. ఎస్సై వెంట స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

ఉమ్మడి రిజర్వేషన్‌లను కాపాడుకుందాం

అద్దంకిటౌన్, ఆగస్టు 13: ఎస్సీల ఉమ్మడి రిజర్వేషన్‌లను కాపాడుకుని, రాజ్యాంగాన్ని రక్షించుకుందామని దళిత ఐక్యవేదిక రాష్ట అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు అన్నారు. మంగళవారం అంబేడ్కర్ సామాజిక భవనంలో మాలమహానాడు అద్దంకి నియోజకవర్గ కమిటీ అత్యవసర సమావేశం అధ్యక్షుడు అంకం కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని, పునర్ పరిశీలించి రాజ్యాంగాన్ని కాపాడాలన్నారు. 14న విజయవాడలో జరిగే వర్గీకరణ వ్యతిరేక సమావేశానికి తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, శ్రీకృష్ణ, రాజశేఖర్, వెంకటేశ్వర్లు, సుబ్బారావు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగించుకోవాలి



పంగులూరులో మాట్లాడుతున్న కార్యదర్శి సునీత

బల్లికురవ, ఆగస్టు 13 : చెత్త సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకు రావడంద్వారా గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పడుతుందని ఈవోపీఆర్డీ సుమతి తెలిపారు. శానిటేషన్, చెత్త సంపద కేంద్రాలపై రెండో రోజు శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. ఈసందర్భంగా నక్కబొక్కల పాడు చెత్త సంపద కేంద్రాన్ని సర్పంచ్‌లు, కార్యదర్శులతో కలిసి పరిశీలించారు. చెత్త సంపద కేంద్రాలను వెంటనే వినియెగంలోకి తీసుకు రావాలని గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులకు ఆమె సూచించారు.

పంగులూరు : గ్రామ పంచాయతీల పరిధిలో చెత్తను సేకరించి సంపదగా మార్చే విధానాలపై క్లాప్ మిత్రలు దృష్టి సారించాలని కార్యదర్శి సునీత సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవా రం జరిగిన సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణ కార్యక్రమంలో చెత్తను సంపదగా మార్చే విధానాలపై పలు సూచనలు చేశారు. డం పింగ్ యార్డ్‌ల నిర్వహణతో గ్రామాలలో పారిశుద్ధ్యం కాపాడుకోవడంతోపాటు సంపదను సృష్టించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో రమేష్‌బాబు కోరారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ రామ్‌కుమార్, ఈవోఆర్డీ రాంబాబు, సర్పంచ్ నాగేంద్రం పాల్గొన్నారు.

మేదరమెట్ల : సర్పంచ్‌లు గ్రామంలోని అన్ని విభాగాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని ఏపీ ఎస్ఐఆర్డీ డిప్యూటీ డైరెక్టర్ రామనాథం అన్నారు. రెండవ రోజు మంగళవారం మేదరమెట్లలో చెత్త సంపద కేంద్రాన్ని శిక్షణలో ఉన్న సర్పంచ్‌లతో కలిసి పరిశీలించారు. తడి, పొడి చెత్తను సేకరించడం, వాటిని ఎరువుగా మార్చడం వంటి విషయాలను వివరించారు. గ్రామాలల్లో పారిశుధ్య నిర్వహణ, పారిశుధ్య కార్మికుల జీతాలు చెల్లింపుపై మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ట్రైనింగ్ మేనేజర్ అమర్‌బాబు, ఇన్‌చార్జి ఈవోఆర్డీ కోటేశ్వరమ్మ, మేదరమెట్ల పంచాయతీ కార్యదర్శి జె. లక్ష్మీకాంత్, మేదరమెట్ల, కుర్రవానిపాలెం, రావినూతల, యర్రబాలెం తదితర గ్రామాల సర్పంచ్‌లు ఏలీశమ్మ, దశరధరామయ్య, విజయవీణ, నాగరాజు, విజయకుమార్ పాల్గొన్నారు.

సోమశిలకు 10,117 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



అనంతసాగరం, ఆగస్టు 13: సోమశిల జలాశయా నికి ఎగువ నుంచి మంగళ వారం 10,117 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 19.490 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టా, ఉత్తర, దక్షిణ కాలువలకు 210 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

9 చోట్ల అన్న క్యాంటీన్లు

- రేపటినుంచి ప్రజలకు అందుబాటులోకి..



నెల్లూరులో సిద్ధమైన అన్న క్యాంటీన్

నెల్లూరు (సిటీ) : టీడీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అన్న క్యాంటీన్లను పంద్రాగస్టున ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. జిల్లావ్యాప్తంగా తొమ్మిది చోట్ల ఈ క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నారు. నెల్లూరులో ఏసీ కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్, ఇరిగేషన్ సర్కిల్, ఇందిర భవన్, బాలభవన్, పాతమున్సిపల్ కార్యాలయం, పొదలకూరురోడ్డులోని సెరికల్చర్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేస్తున్నారు. అలాగే కందుకూరులోని పాత చేపల మార్కెట్, కావలిలోని తహసీల్దారు కార్యాలయం వద్ద అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ క్యాంటీన్లలో సామాన్య ప్రజానీకానికి రూ.5లకే భోజనం అందివ్వనున్నారు.

స్వాతంత్ర్య వెలుగులు



విద్యుద్దీప వెలుగుల్లో కలెక్టరేట్

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు కలెక్టరేట్ ముస్తాబయ్యింది. రంగు రంగుల విద్యుద్దీపాల అంకరణతో కలెక్టరేట్ వెలుగులు విరజిమ్ముతోంది. ఈ నెల 15వ తేదీన కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్ పతాకావిష్కరణ చేయనున్నారు. అలాగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగే పోలీస్ కవాతు మైదానంలోనూ ఏర్పాట్లు విస్తృతంగా జరుగుతున్నాయి. ఉదయం 9 గంటలకు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ జాతీయ జెండాను ఎగరవేస్తారని కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం మంత్రి సందేశం, ప్రజాప్రతినిధులు, సమరయోధులు, వివిధ రంగాలలో సేవలందించిన ప్రముఖుల పరిచయ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఆ తర్వాత ప్రచార శకటాల ప్రదర్శన, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, విశిష్ట సేవలందించిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు.

\- నెల్లూరు (హరనాథపురం)



పోలీస్ కవాతు మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లు

రంగడి సన్నిధిలో

పవిత్రోత్సవాలు ప్రారంభం



నెల్లూరు (సాంస్కృతికం) : తల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలో జరిగే నిత్యపూజలు, ఉత్సవాలలో తెలిసో, తెలియక జరిగిన దోష నివారణల కోసం నిర్వహించే పవిత్రోత్సవాలు ఆరంభమయ్యాయి. సాయంత్రం అంకురార్పణ, హోమాలు జరిగాయి. విశేష అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి ఆకట్టుకున్నారు. బుధవారం సాయంత్రం 4.30 గంటలకు పవిత్ర ప్రతిష్ఠ, తిరుమంజనం, హోమాలు, పవిత్ర సమర్పణ జరగనున్నట్లు ఆ ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

నగర పరిధిలోని అక్కచెరువుపాడులో రూ.కోట్లు విలువైన ఆస్తిపై చాలాకాలంగా కొందరి కళ్లు పడ్డాయి. గత ప్రభుత్వంలో ఒక దొంగ పట్టా సృష్టించి, రెవెన్యూ రికార్డుల్లోకి తమ పేర్లు ఎక్కించుకున్నారు. ఇప్పుడు ఏకంగా ఆ భూమిని లేఅవుట్‌గా మార్చి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందుకు సంబంధించి ల్యాండ్ కన్వర్షన్‌కు కూడా దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నికల సమయంలో పక్క జిల్లాకు చెందిన తహసీల్దార్ ఈ అక్రమాలకు బ్రేకులు వేయగా ఇప్పుడు చకచకా ఫైలు కదులుతున్నట్లు రెవెన్యూ వర్గాలు చెప్పుకుంటున్నాయి.

ప్రభుత్వ భూమికి

ఫేక్ పట్టా!

- అక్కచెరువుపాడులో బరితెగించిన అక్రమార్కులు
- పదెకరాలను అమ్మేసే ప్రయత్నాలు
- పాత పట్టా సృష్టి.. కొత్త సర్వే నెంబర్‌తో రికార్డులు
- లేఅవుట్ వేసేందుకు కన్వర్షన్‌కు దరఖాస్తు
- రెవెన్యూ వర్గాల తర్జనభర్జన

నెల్లూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలం అక్కచెరువుపాడు రెవెన్యూ పరిధిలో పదెకరాల ప్రభుత్వ భూమిపై వివాదం కొనసాగుతోంది. టిడ్కో గృహాలకు సమీపంలోని విలువైన ఈ భూమిని చాలా కాలం నుంచి ఓ ఉన్నత వర్గానికి చెందిన వ్యక్తి తన ఆధీనంలో పెట్టుకొని ఉన్నారు. వాస్తవానికి ఈ భూమి ఉన్నది ఒక సర్వే నెంబర్లో అయితే సదరు వ్యక్తి ఆ భూమిని తనకు ఎప్పుడో దశాబ్దాల క్రితం ఇచ్చారంటూ మరో సర్వే నెంబరుతో కూడిన ఓ పట్టాను తీసుకొచ్చారు. అయితే అక్కచెరువుపాడు రెవెన్యూ రికార్డుల్లో ఆ సర్వే నెంబరే లేకపోవడం గమనార్హం. అసలు డైగ్లాట్‌లో లేని సర్వే నెంబర్లో భూమి ఉన్నట్లుగా పట్టా ఎలా ఇచ్చారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ పట్టాను ఆధారం చేసుకొని గత ప్రభుత్వంలో ఓ వివాదాస్పద సర్వేయర్ సదరు భూమి ఆ వ్యక్తిదేనంటూ రిపోర్టు కూడా ఇచ్చారని తెలిసింది. దాని ఆధారంగా వెబ్‌ల్యాండ్‌లో కూడా పేర్లు ఎక్కించినట్లు సమాచారం. అది కూడా సబ్ డివిజన్ చేస్తూ పేర్లు ఎక్కించడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. డైగ్లాట్‌లో లేని ఒక కొత్త సర్వే నెంబర్‌ను సృష్టించి ఆ సర్వే నంబర్లో భూమి వారికి ఇచ్చినట్లుగా చూపించి పాసుపుస్తకాలు కూడా జారీ చేసినట్లు తెలుస్తోంది. ఇప్పుడు దర్జాగా లేఅవుట్ వేసి ఆ ప్రభుత్వ భూమిని అమ్మేయాలని కుట్ర చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకుగానూ లేఅవుట్ కన్వర్షన్‌కు దరఖాస్తు కూడా చేసుకున్నారు. కానీ ఎన్నికల సమయంలో బాపట్ల జిల్లా నుంచి వచ్చిన తహసీల్దార్ ఈ కన్వర్షన్‌కు అనుమతు ఇచ్చేందుకు నిరాకరించినట్లు సమాచారం. ఈ విషయాన్ని అప్పటి జిల్లా ఉన్నతాధికారులకు కూడా తెలియజేసినట్లు తెలుస్తోంది. అదే సమయంలో కొందరు గ్రామస్థులు కూడా ఈ ప్రభుత్వ భూమి వివాదాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. కానీ ఫలితం లేకపోవడంతో ఇప్పుడు తెరవెనుక రాజకీయ నేతలు ఈ భూమికి కన్వర్షన్ చేయించేందుకు ఉన్నత స్థాయిలో పావులు కదు పుతున్నట్లు కలెక్టరేట్ వర్గాల్లో గుస గుసలు వినిపిస్తున్నాయి. దీంతో ఈ కన్వర్షన్‌పై రెవెన్యూ సిబ్బంది తర్జనభర్జన పడుతున్నారు. ఇది ప్రభుత్వ భూమి అంటూ వివాదం జరుగుతుంటే ఉన్నతాధికారులు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కాగా దీనిపై నెల్లూరు రూరల్ తహసీల్దార్ లాజరస్‌ను వివరణ కోరగా తాను రాకముందు ఏవైనా ఫైళ్లు వచ్చాయో పరిశీలించి చర్యలు తీసుకుంటామని అన్నారు.




దారి మళ్లిన జన వికాస్!

- ముస్లిం ప్రాంతాల అభివృద్ధి కోసం కేంద్ర పథకం
- నిధులను దారి మళ్లించిన అప్పటి వైసీపీ సర్కారు
- బిల్లులు రావన్న ఉద్దేశంతో పనులు ఆపేసిన కంట్రాక్టర్లు

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 13 : ముస్లింల కోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను గత వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించింది. ప్రధానమంత్రి జన్ వికాస్ పథకం కింద ముస్లింల నివాస ప్రాంతాలలో ప్రాథమిక సౌకర్యాల కోసం నాలుగేళ్ల క్రితం రూ.10 కోట్లు మంజూరు చేసింది. అయితే, ఈ నిధులను కూడా అప్పటి ప్రభుత్వం లాగేసుకోవడంతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు అర్ధంతరంగా ఆపేసి వెళ్లిపోయారు.

● పథకం ఉద్దేశం

మైనార్టీల సామాజిక ఆర్థిక స్థితిని పెంపొందించడం, వారి జీవన నాణ్యతను మెరుగుపరచడానికి, అసమానతలు తగ్గించి ప్రాథమిక సౌకర్యాలు కల్పించటం ఈ పథకం ముఖ్యఉద్దేశం. విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి రంగాలలో మౌలిక సదుపాయాలు సృష్టించడానికి అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. అదే విధంగా ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్లు, సాంకేతిక వసతి గృహాలు, పాఠశాలల్లో అదనపు తరగతి గదులు నిర్మించాల్సి ఉంది. ప్రభుత్వ గుర్తింపు పొందిన మదరసా పాఠశాలల్లో కంప్యూటర్ల ఏర్పాటుతోపాటు ఇంటర్నెట్ వంటి సౌకర్యాలు కల్పించాలి.



10 యూనిట్ల మంజూరు

2011 జనాభా లెక్కల ప్రకారం మైనార్టీలు అధికంగా ఉండే ప్రాంతాలను కేంద్ర మైనార్టీ సంక్షేమ మంత్రిత్వ శాఖ గుర్తించింది. ఈ ప్రాంతాలలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి పూర్తి చేయాల్సి ఉంది. జిల్లాలో ఈ కార్యక్రమం కింది 2019-20 ఆర్థిక సంవత్సరంలో 10 యూనిట్ల పనులు మంజూరవగా, రూ.10 కోట్లు విడుదలయ్యాయి. నిధులతో ముస్లింలు ఎక్కువగా నివసిస్తున్న ఉదయగిరి ప్రాంతంలో తొలుత పనులను ప్రారంభించారు. అయితే, విడుదలైన నిధులు వైసీపీ ప్రభుత్వం తిరిగి తీసేసుకున్నట్లు సమాచారం. దీంతో కాంట్రాక్టర్లు నిధులు రావన్న ఉద్దేశంతో పనులను అర్ధంతరంగా ఆపేసినట్లు తెలిసింది.

3 యూనిట్ల పనులే

జిల్లాకు మంజూరైన పది యూనిట్లలో మూడు యూనిట్ల పనులే ప్రారంభమయ్యాయి. మిగిలిన పనులకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రానట్లు సమాచారం. ప్రారంభమైన మూడు యూనిట్ల పనులలో ఉదయగిరి మండలంలోని గండిపాళెం ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం, ఉదయగిరిలోని పాలిటెక్నిక్ కళాశాలలో పరిపాలనా భవన నిర్మాణం, ఉదయగిరిలోని వెంగళరావునగర్‌లోని జడ్పీహైస్కూల్లో నిర్మాణ పనులు ఉన్నాయి.

ఈ పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్లు నిధులు దారి మళ్లాయని తెలిసి పనులను అర్ధంతరంగా వదిలి వెళ్లినట్లు సమాచారం. నూతనంగా కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావటంతో జిల్లాలో ప్రధాన మంత్రి జనవికాస్ కార్యక్రమం మళ్లీ ప్రారంభమై తమ ప్రాంతాలలో అభివృద్ధి పనులు జరుగుతా యన్న ఆశతో ముస్లింలు ఉన్నారు. ఈ వ్యవహారంపై జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రధాన మంత్రి జనవికాస్ కింద ఉదయగిరి ప్రాంతంలో మూడు పనులను ప్రారంభించామని, పనులు పూర్తి కావాల్సి ఉందన్నారు.

గతంలో జరిగిన నీరు-చెట్టు పనుల బిల్లులన్నింటినీ చెల్లించేందుకు ప్రస్తుత ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తొలుత కోర్టుల్లో ఉన్న బిల్లుల చెల్లింపునకు రూ.256 కోట్లు విడుదలకు ఉత్తర్వులిచ్చింది. ఈ బిల్లులను వెంటనే అప్‌లోడ్ చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించింది. జిల్లాకు సంబంధించి ప్రస్తుతం కోర్టుల్లో 748 కేసులు పెండింగ్‌లో ఉండగా, వాటికి రూ.65 కోట్లు చెల్లించాల్సి ఉంది. తొలి విడత ఈ బిల్లులను చెల్లించనున్నారు. ఆ తర్వాత మిగిలిన బిల్లులను కూడా చెల్లించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

\- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

హమ్మయ్య.. బిల్లులొచ్చాయ్!

- ఐదేళ్ల తర్వాత చెల్లింపులకు కూటమి ప్రభుత్వం నిర్ణయం
- 'నీరు-చెట్టు'కు రూ.256 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు
- జిల్లాలో రూ.100 కోట్లకుపైగా బకాయిలు
- కోర్టుకేసు బిల్లుల్ని వెంటనే అప్‌లోడ్ చేయాలని ఆదేశం

2014-19 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వంలో జిల్లాలో నీరు-చెట్టు పథకం కింద 13,780 పనులు మంజూరవగా సుమారు పది వేల వరకు పనులు పూర్తయ్యాయి. సుమారు రూ.711 కోట్లతో పనులు చేశారు. చివరి రెండేళ్లలో జరిగిన పనులకే ఎక్కువగా బిల్లులు పెండింగ్ ఉన్నాయి. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి జిల్లాలో 3,398 వర్కులకుగానూ సుమారు రూ.226 కోట్ల వరకు నీరు - చెట్టు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవన్నీ టీడీపీ నాయకులు చేసిన పనులని భావించి వైసీపీ ప్రభుత్వం బిల్లులు ఆపేసింది. ఐదేళ్లపాటు ఎన్ని ఆందోళనలు చేసినా పట్టించుకోలేదు. దీంతో కాంట్రాక్టర్లు ఒక్కొక్కరుగా హైకోర్టును ఆశ్రయించారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన ధర్మాసనం బిల్లుల చెల్లింపునకు ఆదేశించింది. ఇలా హైకోర్టు నుంచి బిల్లుల చెల్లింపునకు ఆదేశాలు వస్తుండడంతో నాటి ప్రభుత్వం విచారణలను తెరమీదకు తెచ్చింది. నీరు-చెట్టు పనులపై విచారణ జరుపుతున్నాం.. పూర్తయ్యాక బిల్లులు చెల్లిస్తాం.. అంటూ హైకోర్టుకు నివేదించారు. ఇలా విచారణల పేరుతో బిల్లులు చెల్లించకుండా కాలయాపన చేస్తూ వచ్చింది.

● పోరాడి సాధించుకున్న కాంట్రాక్టర్లు



వైసీపీ ప్రభుత్వ కక్షసాధింపుతో విసిగెత్తిపోయిన నీరు-చెట్టు కాంట్రాక్టర్లు హైకోర్టు మెట్లెక్కి విజయం సాధించారు. రిట్ పిటిషన్ దాఖలయ్యాక హైకోర్టు ఆదేశించినా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో మళ్లీ కోర్టు ధిక్కరణ పిటిషన్లు వేశారు. అప్పటికిగానీ ప్రభుత్వం దిగి రాలేదు. ఇలా గడిచిన రెండేళ్లుగా అనేకమంది హైకోర్టు ద్వారా సుమారు రూ.105 కోట్ల బిల్లులు సాధించుకున్నారు. అయితే సుమారు రూ.100కోట్ల వరకు బిల్లులు రావాల్సి ఉంది. ఇంకా వేల కేసులు కోర్టులో ఉన్నాయి. కొన్ని కంటెంప్ట్ దశలో, మరికొన్ని రిట్ పిటిషన్ స్థాయిలో నమోదై ఉన్నాయి. ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వం బిల్లులు చెల్లించాలని నిర్ణయం తీసుకోవడంతో వీరంతా ఊపిరి పీల్చుకుంటున్నారు. నీరు-చెట్టు కేసులు ఇరిగేషన్ అధికారులను కూడా అతలాకుతలం చేశాయి. ఒక్క నెల్లూరు జిల్లాలోనే 1,266 వరకు కేసులు నమోదయ్యాయి. వీటికి కౌంటర్లు వేసుకోవడం, కంటెంప్ట్ కేసులకు జేబుల్లో నుంచి వకాలత్ ఖర్చులు భరించడం ఇరిగేషన్ అధికారులను మానసికంగా, ఆర్థికంగా తీవ్రంగా కుంగదీసింది. తాజాగా ప్రభుత్వ నిర్ణయంతో వీరికి కూడా ఉపశమనం లభించింది.

'సర్దుబాటు' కాని వ్యవహారం

తప్పుల తడకగా వివరాలు ● ఉపాధ్యాయ సంఘాలు నిరసన ● తప్పులు సవరించాలని ఆదేశాలు ● 17 నుంచి కౌన్సెలింగ్ నిర్వహణ



నెల్లూరు (విద్య), ఆగస్టు 13 : జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియపై టీచర్లు, సంఘాలు నిరసనలు తెలియచేయడంతో విద్యాశాఖ కమిషనర్ ఈ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేశారు. అన్ని తప్పులను సవరించాక 17వ తేదీన కౌన్సెలింగ్ చేపట్టాలని ఆదేశించారు. టీచర్ల సర్దుబాటుకు సంబంధించి తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం విడుదల చేసిన జాబితాల్లో, ఖాళీల ప్రకటనలు అంతా అస్తవ్యస్తంగా ఉన్నాయని, వైసీపీ ప్రభుత్వంలో జరిగిన పద్ధతిలోనే ఈ కౌన్సెలింగ్ నిర్వహించడం తాము వ్యతిరేకిస్తున్నామంటూ ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేపట్టాయి. తమతో చర్చలు జరపకుండా, తమ సూచనలు పరిగణలోకి తీసుకోకుండా సర్దుబాటు చేపడితే అంగీకరించమని నాయకులు తేల్చి చెప్పారు. జిల్లావ్యాప్తంగా నిరసనలు వ్యక్తం కావడంతో విద్యాశాఖ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కమిషనర్ ఆదేశాల మేరకు కౌన్సెలింగ్‌ను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నెల 15న టీచర్ల నుంచి వినతులు స్వీకరించి, 16న కొత్త సీనియారిటీ జాబితాలు విడుదల చేయనున్నారు. వీటిలో అభ్యంతరాలు స్వీకరించి 17న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని అధికారులు ప్రకటించారు.

● ఎస్ఎంసీ ఎన్నికలకు రెండో షెడ్యూల్

నెల్లూరు (విద్య) : జిల్లాలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలకు సంబంధించి ద్వితీయ షెడ్యూల్ విడుదలైంది. జిల్లావ్యాప్తంగా 2,622 పాఠశాలలు ఉండగా వీటిలో 2611 పాఠశాలలు ఎన్నికలకు ఎంట్రీలు నమోదు చేసుకోగా 8వ తేదీన జరిగిన ఎన్నికల్లో 1980 పాఠశాలల్లో ఏకగ్రీవం అయ్యాయి. 604 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వ హించి చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఎన్నుకున్నారు. పలు రకాల కారణాలతో వాయిదా పడిన 27 పాఠశాలల్లో తిరిగి ఎన్నికలు నిర్వహిం చేందుకు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా మంగళవారం ఆయా పాఠశాలల ప్రధానో పాధ్యాయులు, ఎంఈఓలతో డీఈఓ రామారావు సమీక్షించారు. ఇటీవల జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఎస్ఎంసీ ఎన్నికల తీరుపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా ఎన్నికలు వాయిదా పడిన అంశాలను సీరియస్‌గా తీసుకుని అందుకు గల కారణాలను వెంటనే తెలియచేయాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. దీనిపై డీఈవో సమీక్షించి ఆ నివేదికలను అధికారులకు, ప్రజా ప్రతి నిధులకు అందచేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.



వైట్‌స్పాట్‌తో పట్టేసిన రొయ్యలు

వామ్మో.. వైట్ స్పాట్!

- రొయ్యల సాగుదారులను వణికిస్తున్న వైరస్
- నష్టాలను మూటగట్టుకుంటున్న రైతులు

అల్లూరు, ఆగస్టు 13 : ఆక్వా రంగాన్ని వైరస్ వణికిం చేస్తోంది. ఇందుకూరుపేట మండలం నుంచి కావలి మండలం తీరప్రాంతం వరకు సాగులో ఉన్న రొయ్యలపై 'వైట్ స్పాట్' తన ప్రభావం చూపుతోంది. మహమ్మారి కరోనా విజృంభణ తర్వాత రొయ్యల సాగు ఆశాజనకంగా లేదు. ఈసారి కూడా దాదాపు 30 వేల ఎకరాల్లోనే రొయ్యల సాగు చేపట్టారు. సాగులో ఉన్న వెనామీ రకం రొయ్యలకు వైట్‌స్పాట్ సోకుతోంది. ఈ వైరస్ ఒక్క దగ్గర ప్రభావితమైతే తీరప్రాంతమంతా విస్తరిస్తోంది. క్రీక్‌లో ఈ వైరస్ విస్తరించడం వల్ల నీటి మార్పుల్లోనూ, పక్షులు, మూగజీవాల సంచారం కారణంగా ఈ వైరస్ సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అల్లూరు మండలం తీరప్రాంతమైన కుర్రు ప్రాంతంలోని రొయ్యల గుంతల్లో ఈ వైరస్ సోకి ఓ రైతుకు చెందిన అరటన్ను రొయ్యలు మృతి చెందాయి. దీంతో అప్పటికప్పుడే ఆ రొయ్యలను పట్టుకోవాల్సి వచ్చింది. సుమారు రూ.12 లక్షల మేర నష్టం వాటిల్లినట్టు బాధిత రైతు వాపోయాడు.

● స్వల్పంగా పెరిగిన ధరలు

ఇటీవల వెనామీ రకం రొయ్యలను అత్యధికంగా సాగు చేస్తున్నారు. గతంతో పోల్చితే ప్రస్తుతం వెనామీ ధరలు కొంత మేర పెరిగాయి. 100 కౌంట్ ధర ప్రస్తుతం రూ.250 వరకు పలుకుతుండటంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ఈదఫా రొయ్యల సాగు చేస్తే అప్పుల్లో నుంచి బయట పడవచ్చనే సదుద్దేశంతో రొయ్యల సాగు చేపట్టగా, 'వైట్‌స్పాట్' సాగుదారులను ముంచేసింది.



రొయ్యలు పట్టేసి గుంటను ఖాళీ చేస్తున్న కూలీలు

● పెరిగిన పెట్టుబడులు

ఆక్వా రంగంలో ప్రధానంగా చెప్పుకునేది రొయ్యల పెంపకమే. ఐదేళ్ల క్రితం వరకూ ధరలు నియంత్రణలో ఉండగా రైతులకు కిలోకు రూ.20 నుంచి 30 మిగులుతూ ఉండేది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. సాగులో పెట్టబడి వ్యయం పెరగడం ఆదాయం తగ్గడంతో రొయ్యల పెంపకం ముగించుకుంటున్నారు. ఒక ఎకరా విస్తీర్ణంలో రొయ్యల సాగు చేపట్టేందుకు రొయ్య పిల్లల ధర గతంలో రూ.50 వేలు ఉండగా ప్రస్తుతం రూ.80 వేలు అవుతోంది. గతంలో ఫ్యాక్టరీ మేత ధర కిలో రూ.64 ఉండగా ప్రస్తుతం రూ.84 ఉంటోంది. ఇక ఆరువు అయితే రూ.94 చెల్లించాల్సిందే. ఆక్వా రంగంలో కీలకమైన విద్యుత్ సరఫరా కూడా ఖర్చుతో కూడుకున్నదిగా మారిపోయింది. గతంలో యూనిట్ ధర రూ.2 ఉండగా ప్రస్తుతం రెండు గ్రేడ్లుగా విభజించి ఆక్వా జోన్‌కు రూ4.20, నాన్ ఆక్వా జోన్‌కు రూ.6.50 చెల్లించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇలా ధరలు పెరగడంతో రొయ్యల సాగు చేపట్టేందుకు రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు.

● వైట్‌స్పాట్‌తో భారీ నష్టాలు

నాలుగేళ్ల క్రితం ఇదే వైట్ స్పాట్ వైరస్ విజృంభణతో రైతులకు భారీ నష్టాలు వాటిల్లాయి. ప్రస్తుతం అదే పరిస్థితి పునరావృతమైంది. అల్లూరు మండలం తీరప్రాంతంలో వైట్‌స్పాట్ ధాటికి రైతులు ఆందోళనకు గురవుతున్నారు. రూ.లక్షలు వెచ్చించి చేపట్టిన రొయ్యల సాగు ఏ క్షణం ఏమవుతుందోననే భయంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

అప్పులన్నా తొలుగుతాయని సాగు చేపట్టాం



పదేళ్లుగా రొయ్యల సాగు చేస్తున్నారు. గతంలో నష్టాలు వచ్చాయి. ఈ ఏడాదైనా ఆశాజనకంగా సాగు ఉంటుందని, అప్పులైనా తీరుతాయని భావించాము. కానీ పరిస్థితి భయానకంగా ఉంది. వైట్‌స్పాట్ వైరస్ ధాటికి దేవుడిని తలుచుకుంటున్నాం.

\- కత్తుల విజయ్‌కుమార్, అల్లూరు

ఒక్కపూటకి అరటన్ను చనిపోయాయి!



వైట్‌స్పాట్ ధాటికి అరటన్ను రొయ్యలు మృతి చెందాయి. ఈ వైరస్‌ను గుర్తించేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. వ్యయప్రయాశలకోర్చి చేపట్టే రొయ్యల సాగులో తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. ఈ విధంగా రెండు దఫాలు నష్టాలు ఏర్పడితే ఉన్న ఆస్తులు అమ్ముకోవాల్సిందే.

\- నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, అల్లూరు

వసతే లేదు.. ఇంకేం చదువు?

- మూతపడిన ఉదయగిరి బీసీ, ఎస్సీ హాస్టళ్లు
- బాలికల వసతిగృహం మూసి వేసేందుకు చర్యలు
- చదువుకు దూరమవుతున్న విద్యార్థులు.. ఆందోళనలో తల్లిదండ్రులు



ఉదయగిరిలో మూతపడిన డీఎన్‌టీ బాయ్స్ హాస్టల్

ఉదయగిరి రూరల్, ఆగస్టు 13: పట్టణంలోని బీసీ,ఎస్సీ హాస్టళ్లు మూతపడగా తాజాగా విద్యార్థులు లేరనే నెపంతో ఇంటిగ్రేటెడ్ బాలికల వసతిగృహం సైతం మూసివేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. మెట్టప్రాంతంలో వలసలు అధికం. స్థానికంగా ఉండేవారు అధికశాతం మంది రోజువారి కూలీపనులు చేసే కుటుంబాన్ని పోషించేవారు. ఈ నేపథ్యంలో తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చేర్పించినా గ్రామాల నుంచి రోజు పాఠశాలలు, కళాశాలలకు పంపేందుకు ఆర్థికభారం అవుతుండడంతో తమ పిల్లలను మధ్యలోనే చదువులు మాన్పించేస్తున్నారు. వసతిగృహాలుంటే అక్కడే పిల్లలు విద్యనభ్యసించే అవకాశం ఉంది. ఇవి లేకపోవడంతో చాలామంది విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారు.

విద్యార్థులు లేరన్న నెపంతో..: విద్యార్థులు లేరనేనెపంతో అధికారులు గత కొన్నేళ్ల కిందట పట్టణంలోని ఎస్సీ బాయ్స్ హాస్టల్స్‌ను మూసివేశారు. అదే తరహాలో గతేడాది డీఎన్‌టీ బీసీ బాయ్స్ హాస్టల్స్‌ను మూసివేశారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో స్థానిక పిల్లలే వసతిగృహాల్లో జాయిన్ అవుతుంటారు. ఆయా హాస్టల్స్‌లో లోకల్ విద్యార్థుల సంఖ్య అధికంగా ఉందనే అధికారులు హాస్టల్స్‌ను మూసివేయడం దారుణమని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పలు వసతిగృహాల్లో విద్యార్థులు లేకపోయినా కొందరు వార్డెన్లు ప్రధానోపాధ్యాయులతో చేతులు కలిపి ఆ పాఠశాలలో విద్యార్థుల పేర్లను తమ హాస్టల్‌లో ఉంటున్నట్లు రికార్డులు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఆ హాస్టల్స్‌కు వర్తించని నిబంధనలు ఉదయగిరి హాస్టల్స్‌కు వర్తిస్తాయా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇలా చేస్తే పరిష్కారం: పట్టణంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలతో పాటు వ్యవసాయ కళాశాల ఉంది. ఆయా కళాశాలలకు దగ్గరలోనే డీఎన్‌టీ బాయ్స్ హాస్టల్ ఉంది. అధికారులు చొరవ తీసుకొని హాస్టల్‌ను ప్రారంభిస్తే ఇటు ఉన్నత పాఠశాల, అటు కళాశాల విద్యార్థులకు సౌకర్యంగా ఉండడంతో పాటు వసతి కష్టాలు తీరి సమస్య పరిష్కారమవుతుంది. గతంలో టీఎన్ఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ విద్యార్థి సంఘాలు ఉదయగిరిలో వసతిగృహాలు ప్రారంభించాలని ఆందోళనలు చేయడంతో పాటు అధికారులు, పాలకులకు వినతిపత్రాలు అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ సమస్యపై పట్టించుకున్న పాపానపోలేదు. కూటమి ప్రభుత్వమైనా ఉదయగిరిలో హాస్టల్స్‌ను పునః ప్రారంభించి వసతి కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

రెండవరోజు క్షేత్రస్థాయిలో అవగాహన

సంగం, ఆగస్టు 13: సర్పంచులు, కార్యదర్శులకు జరుగుతున్న శిక్షణ రెండోరోజుకు చేరింది. మంగళవారం కోలగట్ల చెత్త సంపద కేంద్రంలో నిర్వహణపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈవోఆర్డీ అప్పాజీ ఆధ్వర్యంలో సర్పంచులు, కార్యదర్శులు బృందంగా కోలగట్లకు వెళ్లి చెత్త సంపద కేంద్రంలో తడి, పొడిచెత్త, వర్మికంపోస్టు గురించి అవగాహన కల్పించారు.

ఉదయగిరి రూరల్: గండిపాళెం చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో సర్పంచులు, కార్యదర్శులు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు కేంద్రం నిర్వహణపై అవగాహన కల్పించారు. ఇంటింటా సేకరించిన తడి, పొడి చెత్తను కేంద్రానికి తరలించాలన్నారు. కేంద్రంలో నిర్మించిన తొట్లలో వర్మీకంపోస్టు ఎరువు తయారీకి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మల్లికార్జున, కార్యదర్శులు అమర్‌నాథ్‌రెడ్డి, కరీముల్లా, నాగూర్‌బీ, చంద్రశేఖర్, ఖాదర్‌కరీముల్లా పాల్గొన్నారు.

సీతారామపురం: ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రశేఖర్, ఈవోపీఆర్డీ భార్గవిలు సర్పంచులు, కార్యదర్శులకు చెత్తను ఏవిధంగా సేకరించాలి, సంపద ఎలా తయారు చేయాలి, ఉత్పత్తి చేసిన సేంద్రీయ ఎరువుతో పంటలకు కలుగు ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచులు, భాగ్యకుమారి, వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: వేంపాడు చెత్త సంపద తయారీ కేంద్ర ప్రాంగణంలో డీఎల్పీవో కృష్ణమోహన్, ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి మాట్లాడారు. అన్ని పంచాయతీల్లోను కేం ద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చి పంచాయతీల అభివృద్ధికి సంపదను సమకూర్చుకోవాలన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలి

వింజమూరు, ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవంరోజు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుల్లల్లా నారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వివేకానంద స్కూల్ నుంచి పాత బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులతో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు డేగ మధుయాదవ్, మద్దూర్ గోపాల్‌రెడ్డి, అర్వి కృష్ణారెడ్డి, మెంటా రమేష్ పాల్గొన్నారు.

గుండెపోటుతో హాస్టల్ వార్డెన్ అంకయ్య మృతి

మర్రిపాడు, ఆగస్టు 13: కంపసముద్రం ఎస్సీ హాస్టల్ వార్డెన్ ఎం.అంకయ్య మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఉదయం మర్రిపాడులోని ఇంటి నుండి కంపసముద్రం హాస్టల్‌కు బైక్‌పై వెళ్తుండగా పెగళ్లపాడు సమీపంలో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. బైక్‌ను పక్కన ఆపి సొమ్మసిల్లి ప్రాణాలు వదిలినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవం

చేజర్ల, ఆగస్టు 13: నాగులవెల్లటూరులోని వెంకయ్యస్వామి ఆశ్రమంలో మూడురోజులుగా నిర్వహిం చిన భగవాన్ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు మంగళ వారం ముగిశాయి. చివరి రోజు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి భక్తులకు అన్నదానం చేసి సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. రాత్రి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అన్నదాన దాతలుగా వేలూరు కిష్టయ నాయుడు దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో ఆశ్రమ చైర్మన్ వేలూరు కేశవచౌదరి, వైస్ చైర్మన్ చావా ఇందుశేఖర్ నాయుడు, వేలూరు నారాయణ నాయుడు ఉన్నారు.

అర్హులందరికీ సీసీఆర్సీ కార్డులు : ఆర్డీఓ



వ్యవసాయశాఖ అధికారులతో సమావేశమైన ఆర్డీఓ మధులత

ఆత్మకూరు, ఆగస్టు 13: అర్హులైన కౌలు రైతులందరికీ సీసీఆర్సీ కార్డులను అందజేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో మధులత తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయశాఖ అధికారులతో సమావేశమై పలుఅంశాలపై చర్చించారు. కౌలురైతుల కార్డులతో భూ యజమానులకు ఇబ్బందులు ఉండవని అవగాహన కల్పించాలన్నారు. కార్డులు కాలపరిమితి ముగిసిన వారికి పునరుద్ధరించేలా చూడాలని సూచించారు. ఈ- క్రాప్ నమోదును వేగవంతం చేయాలని ఆదేశించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు, ఆగస్టు 13: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉదయం 10-30 గంటలకు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హాజరవుతారన్నారు. అన్నిశాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు

ప్రైవేట్ స్కూల్ వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎంవీఐ రాములు

ఆత్మకూరు, ఆగస్టు 13: ఫిట్‌నెస్ లేకుండా స్కూల్ బస్సులు నడుపుతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ రాములు హెచ్చరించారు. జిల్లా డీటీసీ ఆదేశాల మేరకు మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. స్కూల్ వాహనాలను ఎంవీఐ శ్రీరాములు స్వయంగా నడిపి పూర్తిస్థాయిలో తనిఖీ చేశారు. అతివేగంగా వాహనాలు నడపకూ డదని డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. 18ఏళ్లు నిండిన వారు డ్రైవింగ్‌లైసెన్సు తీసుకుని వాహనాలను నడపాలన్నారు. తనిఖీల సమయంలో డ్రైవింగ్ లైసెన్సు లేకుంటే చర్యలు తప్పవన్నారు.

మాదక ద్రవ్యాలు వాడొద్దు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 13: విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, వాటికి దూరంగా ఉండి భవిష్యతుకు బంగారుబాటలు వేసుకోవాలని ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఏ.నరసింహులు అధ్యక్షతన నషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలు విక్రయించినా, సేవించినా చర్యలు తప్పవన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ షేక్ అన్నార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెంకటసుబ్బయ్య, ఐక్యూ ఏసీ కేసీ విక్రమ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి

రచయిత పైడిమర్రికి నివాళి

అనంతసాగరం, ఆగస్టు 13: చిలకలమర్రి ఉన్నత పాఠశాల, అనంతసాగరం శాఖ గ్రంథాలయంలో మంగళవారం దేశం నా మాతృభూమి రచయిత పైడిమర్రి వెంకటసుబ్బారావు వర్ధంతిని నిర్వహించారు. విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం సురేష్, గ్రంథాలయాధికారి నారాయణరావు, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

ఆత్మకూరు, ఆగస్టు 13: మున్సిపాలిటీలోని 28వార్డు సయ్యద్ అన్వర్‌బాష, 2వ వార్డు శానంపూడి ఓబమ్మ, 23వార్డులో గంగవరపు చౌడయ్యలు మరణించారు. వారి కుటుంబాల సభ్యులను మంగళ వారం సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి పరామర్శించారు. ఒక్కొ కుటుంబానికి రూ.10వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్): విద్యార్థిదశ నుంచే కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి అంజయ్య చెప్పారు. జిల్లా న్యాయస్థానం సూచన మేరకు మంగళవారం నందిపాడు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడారు. చిన్నతనం నుంచే మంచి నడవడిక, ప్రవర్తన అలవర్చుకోవాలన్నారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు చెప్పే అంశాన్ని క్షుణ్ణంగా వినాలన్నారు. అనంతరం వంటగదిని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉమా శంకర్, ప్రిన్సిపాల్ అంజలీదేవి, న్యాయవాది సందిరెడ్డి రామారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి అంజయ్య

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

నీటి పథకాలకు గ్రహణం!

- రాళ్లపాడు ఆధారిత మంచినీటి పథకాల నుంచి కలుషిత నీరు సరఫరా
- కాంట్రాక్టరు, అధికారుల నిర్లక్ష్యం
- నిర్వహణ లోపంతో 114 గ్రామాల ప్రజలకు శాపం
- ఆందోళన చెందుతున్న గ్రామీణులు



రాళ్లపాడు రిజర్వాయరులో నిర్మించి ఉన్న గుడ్లూరు మంచినీటి పథకం ఇన్‌టేక్‌వెల్

కందుకూరు, ఆగస్టు 13 : నియోజకవర్గంలోని సింహభాగం గ్రామాలకు తాగునీరందిస్తున్న సీపీడబ్ల్యూ స్కీమ్‌ల నిర్వహణ అధ్వానంగా మారటంతో కలుషిత నీరు సరఫరా అవుతోంది. పేరుకు రక్షిత తాగునీటి పథకం అయినా కనీసం గృహావసరాలకు కూడా వాడుకోటానికి ఇబ్బంది పడే రీతిలో నీటి సరఫరా జరుగుతున్నది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నీరు దుర్వాసనతోపాటు కలుషితమై రంగుమారి వస్తున్నాయి. దీంతో స్నానాలు, ఇతర కార్యక్రమాలకు ఈ నీటిని వాడుకోవాలన్నా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేగాక ఈ నీటిని వినియోగిస్తే శరీరంపై దురద, సన్నటికురుపులు కూడా వస్తున్నాయని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడటం, ఈ స్కీంల నిర్వహణ చూస్తున్న కాంట్రాక్టర్ జలశుద్ధి ప్రక్రియను పాటించకుండా, రాళ్లపాడు రిజర్వాయరులోని నీటిని యథాతథంగా సరఫరా చేస్తుండటమే ఈ దుస్థితికి కారణమనేది సుస్పష్టం. ఎంతోకాలంగా ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. రాళ్లపాడు ప్రాజెక్టు ఆధారంగా చుండి-చెర్లోపాలెం మంచినీటి పథకం, రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకం, గుడ్లూరు ఫేస్-1, ఫేస్-2 మంచినీటి పథకాల నుంచి సరఫరా అయ్యే మంచినీరు పచ్చగా, మడ్డిగా వస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ నాలుగు మంచినీటి పథకాల నుంచి లింగసముద్రం, వలేటివారిపాలెం, గుడ్లూరు, ఉలవపాడు మండలాల్లోని సుమారు 114 గ్రామాల ప్రజలకు నీరు సరఫరా అవుతోంది. ఈ పథకాలను నిర్వహించే కాంట్రాక్టరు పెద్దగా ఈ చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.గత జూన్‌లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోపాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు ఈ మంచినీటి పథకాల నిర్వహణకు టెండర్లు పిలిచారు. దీంతో కాంట్రాక్టరు వీటి నిర్వహణను వదిలేశారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.ప్రస్తుతం ప్రాజెక్టులో కూడా కేవలం ఏడు అడుగుల నీటిమట్టం ఉంది. ఇందులోని నీరు కూడా పచ్చగా ఉంటోంది.సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అన్న పెళ్లి కోసం వచ్చి...

- మోటారుబైకు అదుపుతప్పి పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు



పృథ్వీచంద్ర మృతదేహం

వలేటివారిపాలెం, ఆగస్టు 13 : అన్న పెళ్లికి వచ్చిన తమ్ముడు రెండు రోజుల్లో వివాహ వేడుకలు జరగనుండగా ఇంతలో రోడ్డు ప్రమాదానికి గురై దుర్మరణం చెందాడు. దీంతో పెళ్లింటి విషాదం నెలకొంది. వివరాల మేరకు.. కందుకూరు పట్టణంలోని కోటారెడ్డి నగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు ముల్లూరి మల్లికార్జున, ప్రమీలారాణి దంపతుల కుమారుడు ముల్లూరి పృథ్వీచంద్ర (27) హైద్రాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 15వ తేదీ ఆయన అన్నకు వివాహం జరగనుండ డంతో పృథ్వీచంద్ర స్వగ్రామానికి వచ్చాడు. ఈ నేపథ్యంలో వలేటివారి పాలెం మండలం అత్తింటివారిపాలెంలో జరుగుతున్న పోలేరమ్మ తిరునాళ్లకు వెళ్లేందుకు కోటారెడ్డి నగర్‌కు చెందిన ఉన్నం వెంకటరాంభూల్ చౌదరితో కలిసి సోమవారం అర్ధరాత్రి మోటారు బైకుపై బయలుదేరారు. అదే సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ నేప థ్యంలో మార్గమధ్యంలో మండలంలోని కాకుటూరు గ్రామ సమీపంలోని హెరిటేజ్ డెయిరీ, ఐటీఐ కాలేజీ మధ్యలో మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే క్రమంలో అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లోకి దిగి పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పృథ్వీచంద్ర తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న వెంకటరాంభూలచౌదరికీ తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ బాలమహేంద్రనాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కందుకూరు ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ముల్లూరి మల్లికార్జున ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కందుకూరులో విషాదం

కందుకూరు : సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ముల్లూరి పృథ్వీచంద్ర రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో కందుకూరు పట్టణంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. పృథ్వీచంద్ర అన్నయ్యకు ఈనెల 15న వివాహం జరగనుండడంతో వివాహానికి ఏర్పాట్లన్నీ పూర్తి చేసుకున్న తరుణంలో ఈ ఘటన జరగడంతో ద్రిగ్భాంతి చెందిన వారి బంధువులు, స్నేహితులు, సహచర ఉపాధ్యాయ మిత్రులు పెద్దసంఖ్యలో మృతదేహాన్ని సందర్శించి మల్లికార్జున, ప్రమీలారాణి దంపతులను ఓదార్చారు. అలాగే ముల్లూరి పృథ్వీచంద్ర మృతదేహాన్ని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య తదితరులున్నారు.

అమృత్ పైలాన్ కూల్చిన చోట 100 అడుగుల జెండా

- కావలిలో రేపు ప్రారంభోత్సవం



ప్రారంభానికి సిద్ధమైన కావలి ఐకాన్

కావలి, ఆగస్టు 13: కావలి పట్టణానికి తాగునీటి సరఫరా కోసం అమృత్ పథకం కింద కేంద్రంనిధులు మంజూరు చేయగా ఆ నిధులకు చిహ్నంగా నిర్మించిన అమృత్ పైలాన్‌ను వైసీపీ ప్రభుత్వంలో రాత్రికి రాత్రి అప్పటి ఎమ్మెల్యే సహకారంతో కూల్చివేసి తెల్లారేసరికి దా ని నామరూపాలు లేకుండా చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పైలాన్ కూల్చిన ప్రదేశంలో కావలికి గుర్తుండే విధంగా 100 అడుగుల ఎత్తులో జాతీయ జెండాను స్వీయ నిధులతో ఏర్పాటు చేశారు. అక్కడే ఎదురుగా నందమూరి తారక రామారావు, మహాత్మగాంధీల ఫొటోలు, జాతీయనాయకుల ఫొటోలు, మరో పక్క ఇప్పటి వరకు కావలి ఎమ్మెల్యేలుగా కొనసాగిన వారి ఫొటోలను ఏర్పాటు చేశా రు. కలర్‌ఫుల్ లైటింగ్ జెండా స్తంభానికి వెనుక వాటర్ పాల్, దాని ముందు ఐలవ్ కావలి అక్షరాలు ఏర్పాటు చేశారు. కావలికి వచ్చిన ప్రజలు అక్కడకు వచ్చి ఆహ్లాదకరమైన ఆ వాతావరణాన్ని సందర్శించి సెల్ఫీ తీసుకునే విధంగా తీర్చి దిద్దారు. ఆగస్టు 15న దానిని సుమారు 10,000 మంది విద్యార్థులతో కలిసి ప్రారంభించనున్నారు. ఇది కావలికి ఒక ఐకానిక్‌గా నిలవనుండటంతో కావలి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలి



నారా లోకేష్‌తో పువ్వాడి మౌనిక

కందుకూరు, ఆగస్టు 13: కందుకూరులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని నియోజకవర్గ తెలుగు ప్రొఫెషనల్ వింగ్స్ అధ్యక్షురాలు పువ్వాడి మౌనిక ఐటీ శాఖామంత్రి నారా లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం పలువురు ప్రొఫెషనల్ వింగ్ ప్రతినిధులతో వెళ్లి మంగళగిరిలో నారా లోకేష్‌ను కలిశారు. ఆమె వెంట ప్రొఫెషనల్ వింగ్ ప్రతినిధులు మందలపు నాగేశ్వరరావు తదితరులున్నారు.

వేళాంగిణి మాలధారుల పాదయాత్ర



వేళాంగిణికి బయలుదేరిన మాలధారులు

బిట్రగుంట, ఆగస్టు 13: ఈనెల 29న వేళాంగిణిలో జరిగే వేళాంగిణి మాత జెండా పండుగకు పాదయాత్రతో చేరుకుంటామని వేళాంగిణి మాలధారులు తెలిపారు. బోగోలు అంతోణివారి వీధికి చెందిన వేళాంగణిమాత మాలధారులు మంగళవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక ప్రార్థనల అనపంతరం పాదయాత్ర ప్రారంభించారు. 680 కిలోమీటర్ల పాదయాత్ర 16 రోజుల్లో పూర్తి చేసుకుని వేళాంగణి చేరుకుని అక్కడ జరిగే వేళాంగణిమాత జన్మదిన జెండా పండగలో పాల్గొంటామన్నారు. పాదయాత్రికులకు సంఘీభావంగా శివమాల ధారణ భక్తుడు బీ.రవిచంద్ర బిస్కెట్ పాకెట్లను అందచేశారు.

చెత్తతో సంపద.. పంచాయతీలకు లాభం



చెత్తతో సంపదపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కలిగిరి, ఆగస్టు 13: చెత్త నుంచి సంపద కేంద్రాలు పంచాయతీలకు ఆదాయవనరులని ఎంపీడీవో రంగసుబ్బరాయుడు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం నాగసముద్రం పంచాయతీ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పనితీరును పరిశీలించారు. గ్రామంలో తడి, పొడ చెత్తలను వేర్వేరుగా సేకరించి తద్వారా వర్మికంపోస్టు ఎరువు తయారీ, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణాధికారి వెలుగోటి మధు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలి

కావలిటౌన్, ఆగస్టు 13: బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలని వీహెచ్‌పీ కావలి శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పుటూరి కొండపనాయుడు, ఇంటూరు రమణయ్యలు పేర్కొన్నారు. మంగళవారం ముసునూరులోని హనుమత్ క్షేత్రంలో వీహెచ్‌పీ సమావేశం జరిగింది. వక్తలు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో ప్రధాని దేశం విడిచిపెట్టి వెళ్లిపోయిన తరువాత అరాచక శక్తులు పేట్రేగిపోతున్నాయని, హిందు ఆలయాలను ధ్వంసం చేశారని, హిందువులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ప్రధాన అర్చకులు వేదగిరి సూర్యనారాయణాచార్యులు, కోశాధికారి ఆర్‌వీ కృష్ణయ్య, సభ్యులు పాల్గొన్నారు.

దాడిపై కేసు నమోదు

కావలి రూరల్, ఆగస్టు 13: భార్యాభర్తల కుటుంబ కలహాల నేపథ్యంలో భర్తపై బంధువులతో కలసి దాడి చేసిన ఘటనలో పోలీసులు మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. కావలి 1వ పట్టణ ఎస్ఐ జమాల్‌వలి కథనం మేరకు.. బాపట్ల జిల్లా జె.పంగులూరుకు చెందిన దేవరకొండ చిరంజీవి, గుడ్లూరు మండలం ఏలూరుపాడుకు చెందిన కళ్యాణి భార్యాభర్తలు. వీరు మనస్పర్థలతో గత కొంతకాలంగా కళ్యాణి పుట్టింట్లో, చిరంజీవి తన కుమారైతో కలసి జె.పంగులూరులో వేర్వేరుగా ఉంటున్నారు. కావలిలో చదువుకున్న కుమారై టీసీ కోసం చిరంజీవి గత నెల 26వ తేదీన కావలికి వచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న భార్య, ఆమె బంధువులు 10మందితో కలసి కావలికి వచ్చి అతనిపై దాడి చేశారు. అక్కడ నుంచి ఏలూరుపాడు తీసుకువెళ్లి కొట్టారు. ఈ మేరకు బాధితుడు గత వారం పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. దీనిపై కావలి 1వ పట్టణ ఎస్ఐ జమాల్‌వలి విచారణ చేపట్టి ఇరంజీవి భార్య కళ్యాణితో పాటు ఆమె కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

కావలి, ఆగస్టు 13: టిడ్కో గృహ సముదాయంలో ప్రతి నెలా ఉచిత వైద్యశిబిరం నిర్వహించాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం మద్దూరుపాడులోని టిడ్కో గృహ సముదాయంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గృహ సముదాయాలకు ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకున్న కావలి టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్ ఆధ్వర్యంలో వైకుంఠపురంకు చెందిన అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు పొంగళ్లు

బిట్రగుంట, ఆగస్టు 13: బోగోలు మండలం ముంగమూరు పంచాయతీ పేటగ్రామంలో వెలసి ఉన్న పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం పొంగళ్ల కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం అమ్మవారి సన్నిధిలో సద్దిపోసే కార్యక్రమం అనంతరం గ్రామస్థులు మేళతాళాలతో పొంగళ్లను తీసుకొచ్చి నైవేద్యం సమర్పించారు. రాత్రి పోలేరమ్మ గ్రామోత్సవంతో పాటు గంగపెట్టి, బొల్లిఆవులు, వీరతాళ్ల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన

కావలి, ఆగస్టు 13: మండలంలోని ఒట్టూరు మోడల్ స్కూల్‌లో మంగళవారం కావలి రోటరీక్లబ్, రెడ్‌క్రాస్‌ల ఆధ్వర్యంలో అవయవదాన దినోత్సవంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో 400 మంది విద్యార్థులకు ఉచిత రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు, అగర్వాల్ ఐ క్లినిక్ సహకారంతో కంటి చూపు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. ఇందిర అనీల్ కుమారి, ఎన్‌సీసీ అధికారి సీహెచ్ జయరాం, రోటరీక్లబ్ కావలిశాఖ అధ్యక్షురాలు స్వర్ణలత, కార్యదర్శి సలీంబేగ్, సభ్యులు డాక్టర్ కే. మాధవరెడ్డి, చెన్నంశెట్టి దినేష్, రెడ్‌క్రాస్ సిబ్బంది పద్మావతి, శేషమ్మ, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఆర్‌లో నషా ముక్తిభారత్ కార్యక్రమం

కందుకూరు, ఆగస్టు 13: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నషా ముక్తిభారత్ కార్యక్రమం నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు అవగాహన కల్పించటం కోసం చేపట్టిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్ మాట్లాడుతూ సమాజంలో మాదకద్రవ్యాల వినియోగం పెరగటం ప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టరు డి.రామాంజనేయులు, డాక్టరు పి.రాజగోపాల్, కె.నరేష్‌రాజా, కరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో సుబ్బారావు బాధ్యతల స్వీకరణ

బిట్రగుంట, ఆగస్టు 13: బోగోలు మండల ఎంపీడీవోగా ఏవీ సుబ్బారావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో బదిలీపై వెళ్లి తిరిగి వచ్చిన ఎంపీడీవోను ఏవో గోవిందరావు, ఈవోపీఆర్డీ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది సన్మానించారు.